ఆంధ్రమహిళ

ఆమ-నవ-1955-12-7





వెలువడుతూంది!

ఆంధ్ర మహిళ

ప్రత్యేక సంచిక

★

రంగు రంగుల బొమ్మలతో

కొత్త కొత్త హంగులతో

ప్రత్యేక రచనలతో

★

అందచందాల ఆంధ్ర మహిళ

డిసెంబరులో వెలువడును.

ఆంధ్రమహిళ

సంపుటి 12 :: నవంబరు '55 :: సంచిక 7

ఈ సంచికలో పుటలు తగ్గించబడినవి. వచ్చేనెలలో ప్రత్యేక సంచిక ఎక్కువపుటలతో ప్రచురించబడును.

సంవత్సరచందా :: :: ఆరు రూపాయలు

వ్యవస్థాపకురాలు :
శ్రీమతి దుర్గాబాయి దేశ్‌ముఖ్

సంపాదకురాలు :
కె. లక్ష్మీరఘురామ్

ముద్రణ :
ఆంధ్ర మహిళా ప్రెస్.

ఆంధ్రమహిళ

సంపుటి 12 :: నవంబరు '55 :: సంచిక 7

ఫజులాలీ కమీషన్ నివేదిక

ఎప్పు డెప్పుడని ఎన్నాళ్ళనుంచో కాచుకొని వున్న నివేదిక మొన్న విడుదలైంది.

ఇది అందరికీ సంతృప్తి కరమా అంటే — అది అసంభవము. ఒకరికి సంతృప్తి నిచ్చినదే మరియొకరికి అసంతృప్తి కలిగించినప్పుడు ఎల్లరనెట్లు తృప్తి పరచగలదు? మొత్తంమీద నివేదిక ప్రజానీకానికి తృప్తికరమే క్షేమ కరమేనని తోచుచున్నది.

క్రొత్తగా ఏర్పడ్డ కర్ణాటక, కేరళ, విదర్భ రాష్ట్రములు పెక్కుమందికి తృప్తినివ్వగలవు. హైదరాబాదు విచ్ఛేదన సర్వజనామోదమే యనవచ్చు. పెప్సూ, వింధ్యప్రదేశ్, మధ్యభారతము, కూర్గులకు తమ ప్రత్యేకస్థానములు నష్టమైనందుకు విచారము కలుగవచ్చును. కొందరికి విస్మయము. కొందరికి ఆనందము. కొందరికి విచారము కలిగింపకమానదు. కాని ఒక్కొక్క సమస్యా పరిష్కారము వల్ల కలిగే అసంతృప్తికన్న సంయుక్త సమస్యల పరిష్కారమువల్ల కలిగే తృప్తి ఎక్కువేననవచ్చునేమో. కావున మొన్న నెహ్రూ కోరినట్లు ఈ నివేదికను అందరూ ఆలోచించ వలసియున్నది.

మన స్వరాష్ట్ర విషయము — మనకు తృప్తి అసంతృప్తి సమానంగా కలిగించకమానదు. బళ్ళారి తిరిగి ఆంధ్రలో చేరుటవల్ల ప్రతిఆంధ్రుడు ఆనందించగలడు. రెండురాష్ట్రము లేర్పడుటకు ప్రతిఆంధ్రుడు విచారింపవలసినదే కాని యిందు ఏకరాష్ట్రముగా ఏర్పడుటకు అవకాశము కల్పించుట కొంతవరకు మంచిదే. కోలారు, బరంపురం, కోరాపుట్టి జిల్లాలు, బస్తరు చాందాలు, సేలముతాలూకా తెలుగుప్రాంతములూ వీడవలసి వచ్చినందుకు విచారము తప్పదు. మద్రాసు పట్టణానికి పూర్తిగా తిలోదకాలు వదలవలసివచ్చుట కష్టమే. తెలంగాణాలో గద్వాల లేకపోవుట శోచనీయం!

భాషా ప్రయుక్త రాష్ట్ర నిర్మాణోద్యమము ఇంతటితో తన కర్తవ్యనిర్వహణ పూర్తి అయినట్లే అని తలచు చుండగా విశాలాంధ్ర ఏర్పడక పోవుటచే ఈ ఉద్యమము ఇంకను నిర్వహింప వలసివున్నదనే తోచుచున్నది. పనిలో పని విశాలాంధ్రయు వెంటనే ఏర్పడిన ఎంతబాగుండెడిది! ఎట్టి విలంబనమూ వాంఛనీయముకాదు. ఈ కమీషను వారు రెండు తెనుగు రాష్ట్రములేల ప్రతిపాదించిరో కొంచెము శాంతముగ ఆలోచించిన అందరికీ తెలియగలదు. ఆంధ్రులందరు సంకుచిత భావము లణచికొని, దూరదృష్టితో, విశాల హృదయములతో విశాలాంధ్ర ఏర్పడుటకు ఏకమై ఐకమత్యముతో ముక్కోటి ఆంధ్రులాశించే విశాలాంధ్రకు దోహదమివ్వగలరని ఆశించుట నిరర్థము కాజాలదు.

దసరా దేవీ పూజల్లో

రాగం — కల్యాణి.

(ప) మంగళంబేనీకు, శుభాంగీ, కల్యాణీ ॥మం॥

(అ) అంగనామణులొనర్ప, సంగతముగాగానూ, శుభ ॥మం॥

(చ) పుండరీక నయనా, దండిదనుజదమనీ,
చండ మార్తాండకోటి, శంకితనిభగాత్రే శుభ ॥మం॥

(2) వాలఖిల్యాది ఋషులు, మానకా కొలిచీ నట్టి
బాలే త్రిపురాహారీ, శూలినీసతి శుభ ॥మం॥

(3) యోగయోగులూనిన్నె, ఆగమారూపీవనుచూ,
బాగుగా నేనెంతో త్యాగ రాజార్చితే ॥మం॥



ఆచార్యా వినోబాభావే

అక్టోబరు 2 వ తేదీనుంచి ఆంధ్రదేశంలో భూదాన ఉద్యమమును ప్రారంభించి మొట్టమొదట శ్రీకాకుళం జిల్లాలో పర్యటిస్తూ స్వల్ప కాలంలోనే వందలకొలది *యకరముల భూమిని సేకరించారు.

తల్లిదండ్రులు గుర్తింపవలసిన కొన్ని విశేషాలు.

పసిపాపల బాల్యము

డి. వి. ఆర్. భాస్కరశాస్త్రి, బి.ఎ., బి.ఇడి.

"అమ్మా! నాన్నవచ్చాలు!" అన్నది పాప, సావిట్లో నాన్న చెప్పులు చప్పుడువిని, "నాన్న వచ్చాలూ?" అంటూ అమ్మ పాపనెత్తుకొని వాని పాల బుగ్గలమీద ముద్దు పెట్టుకుంటూ ఒక గ్లాసుతో మంచి నీళ్ళుతీసికొని సావిట్లోకివెళ్ళింది. తండ్రిని చూడగానే పాప అమ్మచంక లోంచి విదిలించుకొని తప్పటడుగులు వేసికుంటూ నాన్న దగ్గరకువెళ్ళి ఆయనమోకాళ్ళు తన చిట్టిచేతులతో పట్టుకుంది. విప్పుతున్న చొక్కా సగంలోనే మానేసి నాన్న పాప నెత్తుకొని ముద్దెట్టుకున్నాడు. అమ్మ "చూడండి పాపకు మీ చెప్పుల చప్పుడు ఎంత జ్ఞాపకమో? వంటఇంట్లోనుంచి వినేవాటినిగుర్తు పట్టేసింది". అంటూమంచి నీళ్ళగ్లాసు నాన్నకు ఇచ్చింది నవ్వుతూ పాపకేసి చూస్తూ.

ఇట్లా పాపకు పసితనంనుంచి రకరకాల ధ్వనులను గుర్తించి పోల్చగలిగేశక్తి క్రమంగా వయస్సువచ్చిన కొద్దీ అభివృద్ధి చెందుతుంది. అట్లాగే ధ్వని ఒకటేకాకుండా, స్పర్శ, ఘ్రాణ, రసనజ్ఞానాలను, పొందినప్పుడు ఆయా విషయ జ్ఞానాలనుకల్పించిన విషయాలను గుర్తించే శక్తికూడా పసితనం నుంచీ పాపలో అభివృద్ధి చెందుతుంది! అందుచేత తలి దండ్రులు తమబిడ్డల పంచేంద్రియాలకు పసితనంనుంచి సరి అయిన క్రమశిక్షణ ఇవ్వాలి.

కోడిగ్రుడ్డు దీపం అమ్మ వెలిగించి గదిలోగడపమీద పెట్టి, పాపకు గిలకకాయనిచ్చి ఆడుకోమని సావిట్లో కూచో పెట్టివెళ్ళింది, సావిట్లో దీపంపెట్టిరావటానికి. పాప కంటిని ఆ కోడిగ్రుడ్డు దీపం, అదిచ్చే బంగారు వెలుగు ఆకర్షించాయి. ఏమిటబ్బా! అది? గబగబ పాప దీపం దగ్గరకు పోయి గిలకకాయతో దీపాన్ని ఒక దెబ్బ కొట్టింది, ఏంజరుగుతుందో చూద్దామనే కుతూహలముతో, చిమ్నీ కాస్తా బద్దలై దీపం ఒరిగి పోయింది గడపమీంచిక్రిందకు. అదాసంగతి! 'కాని–ఇదేమిటి?–' అనుకుంటూ పాప తనచూపుడువేలును పొగవస్తున్న దీపంమంటలో పెట్టింది, వేలుకాలి వెంటనేకెవ్వుమంది అంతే! ఆనాటి నుంచి మళ్ళీ దీపం దగ్గరకుపోదు!

పసితనం నుంచి పాప ఆముదముత్రాగడానికి ఎంత వ్యతిరేకిస్తుందో చూడండి! కొత్తగా ఆముదంత్రాగినవాటి నుంచి నాలుకకు దాని రుచి, ముక్కుకు దాని వాసనజ్ఞాపక ముండి పోవుటచేత పెద్ద అయినాసరే, ఆముదము పేరు చెప్తేనే ఏవగింపు చూపుతుంది. ఈవిధముగా పాప పసితనం నుంచి పంచేంద్రియాలని ఉపయోగించుకోవటమే కాక, ప్రతిః పదార్థాన్ని (యధేచ్ఛగా) పరిశోధించడం, తత్ఫలి తాన్ని జ్ఞాపకముంచుకొని తదనుగుణంగా తర్వాత (పైని పట్టు లాగ) ప్రవర్తిస్తూంటుంది. అందువలన తలిదండ్రులు బిడ్డలకు అనుభవానికి ఎక్కువ ఆస్కారమిస్తూ ప్రపంచజ్ఞానాన్ని కల్గించడం ఆవశ్యకము.

అమ్మ పాపను ఉయ్యాలలో పడుకోబెట్టి, ఉయ్యాల ఊపుతూ "రామలాలీ! మేఘ శ్యామలాలీ! ...." అని పాడుతూ పాపను నిద్రపోగొట్టుంది. ఇట్లాకొంతకాలం (7, లేక 8 నెలలు) గడచేక ఒకనాడు అమ్మపాపనుఉయ్యాల లో పడుకోపెట్టి, లాలిపాట పాడటంమానేసి, ఊయల ఊపింది అనుకోండి. పాప పడుకోక తలపైకెత్తి వేస్తుంది. లేకపోతే దిక్కులు చూస్తుంది, కాకపోతే అమ్మకేసి చూస్తుంది అదీకాకపోతే ఏడుస్తుంది. అమ్మమామూలుగా శ్రావ్యంగా లాలిపాటనారంభిస్తే అప్పుడు పాపపడుకుం టుంది. ఇది సాధారణంగామనము చూస్తూంటాము. అంటే పాప మనస్సులో లాలి పాటకు తననిద్రకు ఒకసంబంధాన్ని గుర్తించిందన్నమాట ఈవిధంగా మాటలకు పనులకు మధ్య సంబంధాన్ని ఏర్పరుచుకుంటూ పాపపనులను మాటలలోను, మాటల్ని పనులలోను తెలిసికో గల్గుతుంది అట్లాగే పాప జంతువుల పేర్లు వస్తువుల పేర్లుకూడా తెలిసికుంటూంటుంది. అమ్మ పాపనెత్తుకొని దొడ్లో నట్టామీద సాయంత్రంపూట నుంచుని, వేడివేడి బువ్వ గోరుముద్దగ పెట్టుంటే కాకిపచ్చి

పసిపాపల బాల్యము

అక్కడవాలింది. పాప కాకికేసి వింతగా చూసింది, అన్నం తినకుండా. అమ్మ కాకికేసి ఒక చిన్న ముద్దవిసిరి, కాకిని 'ఇష్షకాకాయి' అని కొట్టివేసింది. కాకి ఎగిరి గోడమీద వాలింది. పాప ఎగిరిపోతున్న కాకివైపు అట్లాచూస్తుంది కద!...ఇట్లా కొన్నాళ్ళు గడచేక...ఒకనాడు అమ్మ కాకి అక్కడ లేకుండానె 'ఇష్ష కాకాయ్!' అన్నదనుకోండి! పాప వెంటనే దిక్కులు చూస్తుంది, గోడలు చూస్తుంది, ఇంటికప్పులు చూస్తుంది. కాకి ఉన్నదేమోనని! 'కాకాయ్' అనగానే ఆ ఎగిరేవల్లని...కాకి అని గుర్తించేశక్తి పాపకు వచ్చినదన్నమాట! పాప క్రమంగా ఈ విధముగా జంతువులపేర్లు వస్తువులపేర్లు తెలిసికుంటుంది. 'లేదు కాకాయ్ లేదు' అని అమ్మ అంటూ నవ్వుతూ చెయ్యిత్రిప్పుతుంది పాపకూడా, అమ్మ చెయ్యి త్రిప్పటము చూసి తనుకూడా చెయ్యితిప్పుతూ తల్లిని అనుకరిస్తుంది!

ఒక్కొక్కనాడు ఇంటిలో చాకిరీకాస్త ఎక్కువయి అమ్మ అలసిపోయిఉంటుంది. రాత్రి పదిగంటలైనాసరే పాప ఎంచేతో నిద్రపోదు. అంచేత అమ్మ 'ఇష్ష! పిల్లి!_ పడుకో, పడుకో!_ లేకపోతే పిల్లి ఎత్తుకుపోతుంది!_' అని ఏమోమో చెప్పి పసివాడిని నిద్రపోగొట్టుంది పసివాడిని నిద్రపోగొట్టి తాను నిద్రపోవడం అమ్మ ఉద్దేశ్యం కాని, ఆమె పాపను, 'పిల్లెత్తుకుపోతుందనో, లేకబూచాడు వస్తాడనో' ఏదో చెప్పి భయపెట్టి నిద్రపోగొట్టింది. నిజంగా పిల్లి ఎక్కడైనా ఎత్తుకుపోతుందా?? పట్టేది! ఇది అమ్మకు తెలుసు. మాయమర్మం ఎఱుగని పసివాడు నమ్మేడు అమ్మచెప్తే. నమ్మి భయపడ్డాడు. ఆభయంచేత బెదరి కళ్ళుమూసుకొని అమ్మమీద తన చిట్టిచేతులు వేసికుని పడుకుంటాడు. కాస్త ప్రాజ్ఞతవచ్చేటప్పటికి "పిల్లి నిజంగా ఎత్తుకుపోదు. ఒకవేళ ఎత్తుకు పోదామనుకున్నా మోసుకుపోలేదు!" అని తెలిసికుంటాడు కాని పిల్లిఅంటే 'అదోరకము'గా భయపడుతూనే ఉంటాడు 'పెద్ద' అవుతున్నాసరే. చీకటి అన్నా కొందరిలో ఇటువంటి అనవసరమైన భయాన్ని మనంచూస్తుంటాము. స్కూలుఫైనలు చదువుచున్న మా తమ్ముడు పట్టపగలు పిల్లి (పిరికిజంతువు అని తెలిసికూడా) ప్రక్కనుంచిపోతే భయపడుతూంటాడు! ఇటువంటి భయాలన్నీ తల్లిదండ్రులు నేర్పినవేగాని స్వతస్సిద్ధములెన్నడూకావు. అంచేత పిల్లల్ని భయపెట్టేటప్పుడు కొంచెందూరమాలోచించి నిజంగా భయపడవలసినవైతేతప్ప ప్రతివిషయానికిపిల్లలకు భయం నేర్పకూడదు.

పాపను ఒడిలో కూర్చోపెట్టుకొని నాయనమ్మ "శంకర శివా, శంకరశివా! శంభోమహాదేవ, శంకరశివా!..." అని భజన ఆరంభిస్తుంది. నాయనమ్మ చేతులు భజనఎట్లు చేస్తున్నాయో చూసి కాస్సేపు, తర్వాత పాపకూడా భజన మొదలుపెట్టుంది తన చిన్న చేతులతో. వీటినిబట్టి పాపలో అనుకరించాలి అన్న కోర్కె తీవ్రంగా ఉన్నట్లు మనకు కనపడుతుంది. అమ్మ వంటవండటం చూచి తాను కూడా వంట (గుజ్జనగూళ్ళు) వండటం ఆటగా మొదలు పెట్టుంది. బొమ్మల పెళ్ళిళ్ళూ ఇంతే. పాప ఇట్లా పనులూ మాటలూ వగైరా అన్నీ పెద్దవాళ్ళను చూచి చాలావరకు (వంశపారంపర్యముగావచ్చే లక్షణాలు గుణాలు అటు ఉంచి) అనుకరించే, నేర్చుకుంటుంది. అంటే పసిపాపలకు పెద్దవాళ్ళు ఆదర్శాలు. పాపలు పసితనంనుంచి కూడా (నెలల వయస్సునుంచికూడా) పెద్దవాళ్ళ యొక్క అన్నివిషయాలు గమనిస్తూనే ఉంటారు. కాని పెద్దలను అనుకరించేశక్తి రాగానే పాపలు అనుకరించడం మొదలు పెట్టారు. ఈ విషయంలో తల్లిదండ్రులు ముఖ్యంగా జ్ఞాపకముంచుకోవలసిన సంగతులు రెండున్నాయి;— న్యాసం ఆరంభంలో చెప్పినట్లు పాప "అమ్మా! నాన్న వచ్చాలు!" అంది అంటే అమ్మ "నాన్న వచ్చారూ?" అనాలిగాని 'నాన్న వచ్చాలూ?' అనకూడదని శాస్త్రజ్ఞులు చెప్తారు. పాప అంటే ఆమాట. ముద్దుమాట అవుతుంది కాని మనము ఆమాట అంటే అది మొద్దుమాట అవుతుంది. పాపకు "నాన్న వచ్చాలు"లో తప్పు తెలియదు. పైగా పైన చెప్పినట్లు పసివాడికి అనుకరించుట సహజము కనుక అమ్మ అనినట్లే పాప నేర్చుకుంటుంది. అందుచేత పాపకు మాటల సరిఅయిన ఉచ్చారణ రావడానికి కావలసినదానికంటే ఎక్కువకాలం పడుతుంది. బయటకు తన భావాలను తెలియజేసేశక్తి లేకపోయినా, బయటవిషయాలను తెలుసుకునేశక్తి జననంనుంచి ఉంటుందికనుకను, తదితరకారణాల వల్లను ఏడాది రెండేళ్ళ పిల్లల ఎదుటకూడ తల్లిదండ్రుల శృంగార చేష్టలు కూడదన్నారు!

మేడమ్ స్టాలిన్

శ్రీమతి కె. రామలక్ష్మి

సోవియట్‌లో మగవాని పాత్ర ఎంతటి ప్రాముఖ్యం వహించుతుందో ఆడవారిదీ అంతటి ప్రాముఖ్యతా వహిస్తుంది. కానీ, స్టాలిన్ గురించిన అనేక విషయాల వివరాలు మనకి అశంఖాకంగా దొరికినా. మాడమ్ స్టాలిన్-నాద్యడా అల్లులివ్‌ని గురించినవిషయాలు చాలాతక్కువే. ఈవిడ స్టాలిన్ రెండవ భార్య. ఒక ప్రత్యేకత గల వ్యక్తిగా యీమె ఎప్పుడూ బయటి ప్రపంచంలో మసల లేదు. ఉక్కుమనిషి స్టాలిన్‌తో కన్నా, మానవ మాత్రుడైన జోసఫ్‌తోనే యీమె సంబంధ బాంధవ్యాలన్నీ.

సోవియట్ ఉద్భవంతో పాటే వింతైన ఆలోచనకీ అనుమానాలకీ తావిచ్చింది. ఈ దేశం విషయంలో ఒక ప్రక్కనుండి గమ్మత్తయిన ఆదర్శాలకీ ఇంకొక వైపు నుండి అంతులేని అపార్థాలకీ అవకాశం యిచ్చింది సోవియట్. ప్రతి విషయంలో లాంటి యీ ద్వంద్వ తత్వమే వ్యక్తుల జీవితంపట్లా అమలులోకి వచ్చి స్టాలిన్ వ్యక్తిగత జీవితాన్నిగురించి వింతైన కథలు తలెత్తాయి. అతని అయిష్టులు—స్టాలిన్ యిష్టప్రకారం మొదటి భార్యకు విడాకులిచ్చేడనీ, తన క్రూరతత్వం మూలంగా ఒక భార్యని చంపేడనీ, మూడో వివాహం చేసుకున్నాడనీ అంటారు. దీల్లోని నిజానిజా లెలావున్నా—స్టాలిన్ భార్యలచుట్టూ ఒక మంచుతెర వుండడం మాత్రం నిజం.

అందుకే 1932 లో నాద్యడా అల్లులివ్ స్టాలిన్ చనిపోయినప్పుడు, భర్త క్రౌర్యంవల్ల ఆత్మహత్య చేసుకుంది అన్నారు కొందరు. స్టాలిన్ అధికార ఆహార పరిశీలకురాలుగా యీమె వుండేదనీ, స్టాలిన్ కోసం పెట్టబడిన విషపూరిత ఆహారం రుచిచూడడం వల్ల మరణించిందనీ కొందరంటారు. ఈ అభూత కల్పనలన్నీ ఒకే చిన్న నిజంచుట్టూ అల్లుకున్న సాలెగూళ్ళు. మేడమ్ స్టాలిన్ కొన్నాళ్ళుగా కడుపు నొప్పితో బాధపడేది. కాని ఆ విషయాన్ని ఆమె భర్తకి చెప్పలేదు. కొన్నిరోజుల తరువాత రోగం ముదిరి చివరకి ఎపెండిక్సు కుళ్ళి మరణించింది ఆమె.

నాద్యడా మరణంతో స్టాలిన్ వ్యక్తికి అతిసన్నిహితురాలు, పోయింది. ఇక అతని వ్యక్తిత్వాన్ని గురించి తెలిసిన వాళ్ళింకెవరూ, అతని తల్లి తప్ప లేరు. మధ్య వయస్కుడిగా నున్న స్టాలిన్‌కి నాద్యడా వల్లకలిగిన యిద్దరు పిల్లలూ — స్టాలిన్‌లో పితృ ప్రేమని పూర్తిగ చూడ కలిగారు. ఇద్దరు పిల్లలూ— రష్యాలో ఉన్న మూడు మోడల్ స్కూళ్ళల్లో ఒకదాల్లో చదువు కొనేవారు. స్టాలిన్ పిల్లలుకదా అన్న దృష్టితో ఎప్పుడూ వీరికి అధిక గౌరవంగాని ఆదరణ కాని జరపలేదు.

స్టాలిన్‌కి ఇరవైరెండు ఏళ్ళ వయస్సు ఉన్నప్పుడు అతని ఆప్త మిత్రుడు అల్లులివ్ ఒక జార్జియన్ వనితని వివాహం చేసుకున్నాడు. వీరిద్దరికీ కలిగిన కుమార్తే నాద్యడా — (రష్యన్‌లో యీ పదాని కర్థం ఆశ) ఈ చిన్నపాప, అప్పటికే రివల్యూషనరీగా రూపొంది, బోల్షివిక్‌గా ఉత్సాహపూరితంగా పని చేస్తున్న స్టాలిన్ వ్యక్తిగత జీవితంలో ప్రముఖ పాత్ర వహించ బోతూందంటే ఆశ్చర్యంగానే వుంటుంది. కాని, రష్యాను రూపొందించడంలో స్టాలిన్ ఎటువంటి పాత్ర వహించాడో. స్టాలిన్ వ్యక్తిగత జీవితాన్ని రూపొందించడంలో నాద్యడా అంతటి ప్రముఖ పాత్రనీ వహించింది.

అల్లులివ్‌తో స్టాలిన్‌కి అతి ప్రాణప్రదమైన స్నేహం అందుకే. జైలు జీవితంలో మధ్యమధ్యను ప్రశాంతం కావాలంటే స్టాలిన్ అల్లులివ్ యింట్లో కాలక్షేపం చేస్తూండేవాడు. నాద్యడా చిన్నతనం దాటి యౌవని కావడం కళ్ళారా చూశాడు స్టాలిన్. కాని అప్పటికీ ఆమె అతని హృదయంలో సంచలనాన్ని కల్గించిన దనడానికి లేదు కాని, విప్లవరాజకీయాలకీ కమ్యూనిజానికీ జీవితాన్నే అంకితంచేసి బాల్షివిక్ రాజకీయ కార్యక్రమాలే తన సర్వస్వం అని ఎంచుకున్న స్టాలిన్‌కి చిరుగాలి తగిలి ప్రశాంతం చేకూరినట్లు హఠాత్తుగా నాద్యడా కనుకొనకులలో మెలగింది. అల్లులివ్ ముద్దుల కుమార్తె నాద్యడా నవయౌవని అయి ధీశక్తి వ్యక్తిత్వం కల్గిన మహిళగా రూపొందింది.

ఒక ఫ్యాక్టరీలో పనిచేస్తూ వుండేది. అందుకే కార్మికవర్గ ప్రతినిధిగా కూడ స్టాలిన్ దృష్టిని ఆకర్షించింది. ఈ సంధిగ్ధావస్థలో తన వ్యక్తిగత జీవితపు ఆదాయవ్యయాలు లెక్కలలా ఒకసారి వెనుతిరిగి జూచుకున్నాడు స్టాలిన్. కాని విప్లవానంతరమే అతని కలలు రూపొందాయి.

మొక్కవోని తెలివితేటలుకల నాడ్యడా యీ వ్యక్తినే తనజీవిత కేంద్రంగా ఎంచుకుంది. తండ్రి స్నేహితుడైన యీ వ్యక్తికీ తనకీ మధ్య ఒకతరం వ్యత్యాసం వున్నా యీ వ్యక్తే తన సర్వస్వంగా తలపోసింది నాడ్యడా. అందుకే. స్టాలిన్ తన వ్యక్తిగత జీవితాన్ని ఒక దారిన పెట్టుకొందుకు సమయం చిక్కేదాకా, తనూ ఓర్పుతో, ఆశతో, ఆగి ఎదురు చూచింది. స్టాలిన్ దృష్టిలో రష్యా రమ్యమైన చిత్రం ఎలా మెదిలిందో అలాగే ఆమె కళ్ళ ముందూ మెదిలింది. అందుకే స్త్రీసహజం అయిన విసుగు ఆమెలో జనించనే లేదు.

అతి భీకరంగా బోల్షివిక్ రాజకీయాలని విపరీత పరిస్థితులు ఎదుర్కొంటున్న సమయంలో, స్టాలిన్ ప్రేమ పెరిగి పెద్దదై తలెత్తింది. బోల్షివిక్‌కి బలమైన ప్రదేశాలన్నిటా భీకరక్షామాలునాట్యం చేస్తున్నాయి. బోల్షివిక్‌లు ఆర్థికంగా ఆర్పుకుపోతున్నారు. అటువంటి సమయంలో ఏ లెనిన్‌కాని ట్రాట్‌స్కీగాని ఓక్షణమేనా వివాహం విడాకులూ గురించి ఆలోచించేవారేనా కాదేమో కాని ఆపరిస్థితులలోనే స్టాలిన్ కొంచెం వంగేడు. అంతమాత్రం చేత అతను స్వార్థంకోసం తన ఆశయాన్ని వదిలేడనక్కర లేదు. తనూ మానవ మాత్రుడినే అని అనిపించుకున్నాడు

స్టాలిన్ మొదటి వివాహం సజావుగా సాగిపోలేదు. భార్యనుండి వేరుపడి ఎన్నో సంవత్సరాలయింది. సోవియట్ న్యాయసూత్రాల ధర్మమా అంటూ త్వరితగతిని విడాకులు సంపాదించి, ఒక వివాహపు లైసెన్సు పుచ్చుకున్నాడు.

స్టాలిన్ నాడ్యడాని చేపట్టేనాటికి అతని వయస్సు 40 ఆమె వయస్సు పదిహేడు. అతని ప్రేమా ప్రణయకలాపాలూ అతని జీవితంలాగే అంతుతెలియని లోతుగలవి. బలవత్తర ప్రవాహాలలాంటివి. నాడ్యడా స్కూలుకి వెళ్ళే వయస్సు నాటినుండీ స్టాలిన్ ఆమెని తన భార్యగా కోరుకున్నాడు. అందరు జార్జియనులలాగే కన్యల చిన్నతనపు వివాహాలలో అతనికీ నమ్మకం వుంది. అందుకే, ఆమెకి వయస్సు రాగానే ఆమెని చేపట్టాడు.

రష్యా ప్రముఖవ్యక్తిని చేపట్టినంతమాత్రాన నాడ్యడా తన ఫ్యాక్టరీ పని మానలేదు. వ్యక్తిగత హక్కులలో ఆమెకి కావలసినంత నమ్మకం వుంది. కాని, కొద్ది కాలానికే ఆమె తెలుసుకుంది. ఫ్యాక్టరీ నియమిత కాలానికీ యింటిపనికీ సమన్వయం కుదరలేదని. స్టాలిన్ జీవిత యడారిలోని ఒయాసిస్సులలో నాడ్యడా స్టాలిన్ అభిమాన పూరితమైన సహకారం ఒకటే అతనికి ప్రశాంతత నిచ్చేది. విషమ పరిస్థితులలో, ట్రాట్‌స్కీలోనూ లెనిన్‌లోనూ అభిప్రాయ భేదాలువచ్చి విపరీతమైన మానసిక ఆందోళనకి గురిఅయిన కాలంలో స్టాలిన్‌కి ప్రశాంతం నాడ్యడాలో లభించింది. ఒప్పుకోవడం యిష్టంలేకున్నా స్టాలిన్ నాడ్యడామీద తన ప్రశాంతతకి ఆధారపడేవాడు.

స్టాలిన్ వ్యక్తిగత జీవితం అంత రసవత్తరంకాదు. గాంభీర్యమూ కాదు. స్టాలిన్ అలవాట్లు అతి సనాతనం. రష్యా ఉక్కుమనిషిని నాడ్యడా ముద్దు ముద్దుగా 'కోబా' అని పిలిచేది. నాడ్యడాకి సవతికొడుకు వుండేవాడు. యితనే స్టాలిన్‌ల జీవితంలో అలజడి రేకెత్తించేవాడు. స్టాలిన్ కట్టుదిట్టాలు అతన్ని లొంగదీసేవి కాదు. ఈ ఒక్కడే వారివివాహజీవిత ప్రశాంతాకాశంలో నిమబ్బు.

స్టాలిన్‌కుటుంబం క్రెమిలిన్‌లో ఒకచిన్నభాగం ఆక్రమించుకొనేవారు. క్రిందనే వున్న రెస్టారెంట్ నుండి భోజనాన్ని తెప్పించుకొనేవారు. ఇంటి అలంకరణ కూడా ఏం వుండేదికాదు. అవసరాలు మాత్రమే గుర్తించేది నాడ్యడా. ఇంటి పనిపాటలు చేసుకొందుకు కెవరూ పనివాళ్ళుండేవారుకాదు. అన్నీ తానే స్వయంగా చేసుకొనేది. తమ యింట్లోకూడ నాడ్యడాకి స్టాలిన్ ఏకాంతం చిక్కేది కాదు. ఎప్పుడూ ఎవరో ఒకరు వస్తూనే వుండేవారు. అందుకే, వేసవికి విశ్రాంతికోసం గోర్కీ వెళ్ళిన సమయంలో నాడ్యడా అత్యుత్సాహంగా వుండేది. పత్రికలు వింతవింత వార్తలు అందించేవి. స్టాలిన్ నాడ్యడాని అతి కట్టుదిట్టాలలో వుంచుతాడనీ, ఘోషాపెడతాడనీ వార్తలు వస్తూండేవి. కాని యివన్నీ అసత్యాలే. కారణం అటువంటి జీవితం ఏ సోవియట్‌వనితా. అందులోనూ, వివాహానంతరం కూడ ఫ్యాక్టరీలో పనిచేసిన నాడ్యడావంటిది సహించదు. కాని గోర్కీలో స్టాలిన్ దంపతులు అటు

వంటి ఏకాంతంలో వుండి కాలక్షేపం చేసేవారు. కారణం అటువంటి సన్నిహిత జీవితానికి మాస్కోలో వీరికి అవకాశమే ఉండేదికాదు.

నాద్యడా సోవియట్ మహిళలతత్వానికి రూపకల్పన. స్టాలిన్ భార్యగా కీర్తిగాంచాలని ఆమె ఏకోశాన కాంక్షించలేదు. కలక్టివ్ సోవియట్‌లో తనూ ఒక ఉపయుక్తమైన భాగంగా తలపోసింది. స్టాలిన్‌పట్ల ఆమె ప్రేమా, విశ్వాసమూ, ఆమె వ్యక్తిగత విషయాలు తన విశ్వాసానికీ ప్రేమకి తగిన ఆదరణ స్టాలిన్ ప్రదర్శించిన విశ్వాసంవల్ల దొరికిందనే తలపోసేది నాద్యడా. వయస్సులోఅంతర్యం అధికమే అయినా వారిద్దరిమధ్య చక్కని పొందిక అమరింది. రాజకీయరంగంలో తలమునకలుగా నున్న స్టాలిన్ తనని అలక్ష్యం చేశాడని ఎన్నడూ నాద్యడా వాపోవలేదు ఆమె పెరిగిన వాతావరణం అటువంటిది. రాజ్యానికీ, ప్రజలకి తరవాతనే వ్యక్తిగత జీవితానికి ప్రాముఖ్యత. జీవితంలో అన్నీ వుండీ భర్తలు తగినఆదరణ చూపడం లేదని తెగ ఆడిపోసుకునే మన బోట్లంకి నాద్యడా స్టాలిన్ జీవితం ఒక గుణపాఠం.

గాంధీ జయంత్యుత్సవములు

[విశాఖ పట్టణము]

శ్రీ అకెళ్ళ సూర్యనారాయణ, మహిళాభవనమునందు 1955 అక్టోబరు 2వ ॥తే॥ గాంధీజయంతి వుత్సవ సందర్భమునందు, శ్రీమతి డాక్టరు లక్ష్మీకాంతమ్మగారి అధ్యక్షతను సభ జరుపబడెను. ఆ సందర్భములో జరుపబడిన వ్యాసరచన పోటీ పరీక్షలలో, గృహపరిశ్రమలను గూర్చి వ్రాసిన కుమారి బెన్నూరి రమాబాయికి ప్రథమబహుమానము విద్యుచ్ఛక్తిని గూర్చి వ్రాసిన కుమారి వుప్పల నిరుపమాదేవికి ద్వితీయ బహుమానము క్లబ్బువారిచే యివ్వబడెను. వి. రమణమ్మగారు, నే. లీలావతిగారు, జి. సత్యవతిఅమ్మగారు, గాంధీజీవితమును గురించివుపన్యసించిరి. శ్రీ గంటి. సీతమ్మగారిచే భగవద్గీతా పఠనము జరుపబడెను. జనగణమన గీతముతో సభ ముగిసినది.

విద్యావనము: చైల్డు అండ్ సోషల్ వెల్ ఫేర్ కేంద్రము-బొగ్గరము

[వినుకొండ తాలూకా — గుంటూరు జిల్లా]

గుంటూరుజిల్లా వినుకొండ తాలూకా కొండాయ పాలెమునివారు బొగ్గరము అను గ్రామములో స్థాపించబడిన విద్యావనము చైల్డు అండ్ సోషల్ వెల్ ఫేర్ కేంద్రమువారి యాజమాన్యమున ది. 2–10–1955నుండి ది. 19–10–1955 వరకు గాంధీ జయంత్యుత్సవములు జరుపబడినవి.

కార్యదర్శిని కుమారి జి. పి. ఇంవాంజినీగారి అధ్యక్షతను బహిరంగ సభలు జరిపిరి. కొండాయపాలెం పంచాయితో బోర్డు అధ్యక్షులు శ్రీ బొగ్గరము రంగయ్యపంతులుగారు జండా ప్రతిష్ట గావించిరి. వినుకొండ తాలూకా గృహపరిశ్రమల సంఘఅధ్యక్షులు శ్రీ కందుకూరి కోటయ్యగారు కార్యదర్శి శ్రీ గాచిని పిచ్చయ్యగారు శ్రీకాకని వీరాస్వామిగారు మహాత్ముడు హరిజనులకు దేశమునకు చేసిన సేవను గురించి దీర్ఘముగా ఉపన్యసించిరి. శ్రీ కాకని ఆనందము శ్రీకాకనియేసేబుపేరయ్య వందనముగార్లు జాతీయ గీతములను పాడిరి. మహిళా సమాజ సభ్యురాండ్రు సూత్రయజ్ఞము జరిపిరి. శ్రీమంగళగిరి పరవస్తు దాసుగారు మహాత్ముని జీవితవిశేషములను గురించి విపులముగా చెప్పిరి. 3–19–1955 తేదీన వేల్చూరు గ్రామములో శ్రీ వేల్పుల పేరయ్యగారి యాజమాన్యమున విద్యావనము పాలక వర్గమువారు ఊరేగింపు గావించిరి. ఈ వారములో సూత్రయజ్ఞములో తయారైన నూలును "కస్తూరిబా జాతీయ నిధికి" పంపుటకు నిశ్చయించిరి.



వాయు సూక్తము

శ్రీ శివశంకర శాస్త్రి

ఋగ్వేదము - మండలము 4 - సూక్తము 48 - ఋషి
వామదేవుడు - దేవత వాయువు - ఛందస్సు అనుష్టుప్పు.

ఒరులు తాక నట్టి హోమ సామగ్రుల
నారగించు ధనికునట్లు విత్త,
మరుగుదెమ్ము వాయు, వాహ్లాదకర మైన
రథము నెక్కి సోమరసము గ్రోల.

అవల ద్రోసికొనుచు నభిశాపముల, 'నియుత్'
ఘోటకముల బూన్చి, కూడి యింద్రు,
అరుగుదెమ్ము వాయు, వాహ్లాదకర మైన
రథము నెక్కి సోమరసము గ్రోల.

అనుసరించు నిన్ను నసిత భూ వ్యోమముల్
విశ్వరూప, అఖిలవిత్త నిధులు.
అరుగుదెమ్ము వాయు, వాహ్లాదకర మైన
రథము నెక్కి సోమరసము గ్రోల.

కోరి నంతలోనె కూడి తొంబది తొమ్మి
దశ్వములును తెచ్చు నయ్య, నిన్ను.
అరుగుదెమ్ము వాయు, వాహ్లాదకర మైన
రథము నెక్కి సోమరసము గ్రోల.

అధిక బలము కలుగు నశ్వ శతంబును
అట్లు కానియెడల హయ సహస్ర
మోయి వాయు దేవ, యోగించు మయ్య - నీ
రథము వచ్చుగాక రంహసముగ.

వాత సూక్తము

ఋగ్వేదము - మండలము 10 - సూక్తము 186 -
ఋషి ఉల వాతాయనుడు - ఛందస్సు గాయత్రి

ఆరోగ్యకర మైన హ్లాదదం బైన
ఔషధ చాలన నాయువుల్ మాకు
వర్ధిల్ల జేయుత వాతదేవుండు !


వాతదేవా, నీవు మాతండ్రి వయ్య !
మా చెలికాడవు, మా సోదరుడవు,
మనుపవయ్యా, నీవు మాజీవితములు !

నీ నివాసమునందు నిక్షిప్త మైన
అమృతంపు నిధిచేత నస్మదాదులను
వర్ధిల్లనీ వయ్య, వాతదేవుండ !


చిత్రసమీక్ష :

"దొంగరాముడు"

అన్నపూర్ణా పిక్చర్సువారి తొలి చిత్రము "దొంగ రాముడు" మొన్న పేరగన్ టాకీసులో ప్రివ్యూ ఇవ్వ బడినది. శ్రీ కె. వి. రెడ్డిగారి దర్శకత్వంతో తయారైన సాంఘిక చిత్రము ఉత్తమ శ్రేణికి చెందినదనే అనాలి. చక్కని కథ. చక్కని నటన. మామూలుగా ప్రవహించే త్రికోణ ప్రేమ ప్రవాహపు ఆధారముగల కథయేకాక, కథ సరికొత్త బాటను సహజముగా నడచినది. నటీ నటులందరును చక్కగా నటించిరి. నాగేశ్వరరావు ద్వయము, కుమారి జమున కుమారి సావిత్రి తమ తమ పాత్రలను ఉత్తమోత్తమముగ నటించిరి. మిగిలిన నటీ నటులును తమపాత్రలను చక్కగ నిర్వహించిరి. పాటలు బాగానేవున్నా, ఏలనో కొంత ఆశాభంగము కలిగించినవి. ఈచిత్రమునకు ప్రజాదరణ యుండగలదని తోచుచున్నది.



ఇటీవల భారత ప్రధాని జవహర్‌లాల్ నెహ్రూ ప్రారంభోత్సవం జరిపిన, పెరంబూరు రైలు కోచ్ ఫ్యాక్టరీలో తక్కువ తరగతి ప్రయాణీకులకు ఎక్కువ సౌకర్యములతో తయారైన రైలుపెట్టె.



పెరంబూరు రైలు కోచ్ ఫ్యాక్టరీలో కార్మికుల వసతి గృహాలు. పిల్లలు ఆడుకునేందుకు పార్కు, ఆటస్థలం, చక్కని రోడ్లు ఇందు చూడనగును.

మేట్నీ షో

★ శ్రీమతి వి. ప్రభావతీదేవి

"ఒరే కిష్టిగా! మధ్యాహ్నం ఫస్ట్ అవర్ మనకి ఖాళీ యేరా—శాస్త్రిగారు సెలవుపెట్టారట. మేట్నీకి కొట్టేద్దామా మనిద్దరం? "—అన్నాడు కాస్త సందు దొరికితే కాలేజీ ఎగ్గొట్టాలని చూసే నారాయణం — కాంటిన్‌లో కూర్చుని కాఫీ తాగుతూ.

"ఉండరాబాబు! ఫస్ట్ అవర్‌ఖాళీ అయితే సరా? — సెకండ్‌అవర్ మన పిడతగారిది. ఆయన చాలు మన ప్రాణం తియ్యటానికి. ఇవాళ ఛందస్సు అంతా బట్టీ పట్టుకు రమ్మన్నాడు. —ఉత్పలమాల, మణిమాల. మేఘ మాల, రత్నమాల, మట్టీ మశానం— నాకు ఒక్కటీ వచ్చి ఏడవలేదు ఇవన్నీ సరిగ్గా చెప్పకపోతే మన పిలకలు ఝాడించేస్తాడు ఆయన. ఇంతబతుకూ బతికి ఇవాళ ఆడ పిల్లల ముందర ఆయన చేత అవమానం పొందాలో ఏమిటో!"

"ఓరి పూలా! అదేమిటిరా? అంత వరకూ వస్తే ఆయన పిలక మనమే ఝాడిద్దాం. అయినా మనవి పిల కలు కావుగా- క్రాఫింగులు. ఆ సంగతి మరచిపోయావా? అది సరేగానీ ఇవాళ మధ్యాహ్నం సెకండ్‌అవర్ తెలుగు క్లాసు ఉందనే సంగతే మరచిపోయానురా నేను."

"అయితే ఇంకేం?- చాలా ఘనుడవే అన్నమాట."

"అయితే ఇహ మన దామోదరం ఇవాళ ఫస్ట్ బెంచ్‌లో చేరతాడురోయ్- పోజు లియ్యటానికి"

"మరేమిటనుకున్నావ్?- ఇవాళ మాలతి మహాట్రిమ్‌గా డ్రెసప్ అయివచ్చింది. ఇంకా గమనించలా నువ్వు?"

గమనించకేంరా? అలా ఉంటుందా! - మళ్ళీ చదువులో ఏమి అశ్రద్ధగా ఉండదురా- అస్తమానం సంగీతకచేరీలకి సభలకి. సినిమాలకి తిరుగుతూనే ఉంటుంది. మరి ఎప్పుడు చదువుతుందో ఏమిటో!- మొన్న తెలుగులో ఆవిడ గారికి ఫస్ట్‌మార్కు వచ్చిందని మన దామోదరం మొహం ముడుచుకున్నాడు. జ్ఞాపకంలేదూ?"

"అదంతాపైకి- మన ముందర నటనరా. మాలతి అంటే వాడికి వల్లమాలిన అభిమానం. ఆవిడగార్ని— చాటునైనా సరే ఎవరైనా ఒక్కమాట అంటే వాడు ఊరుకోడు. మీదబడి కరుస్తాడు. ఆవిడ మీద సర్వ హక్కులూ తనకే ఉన్నట్టు మాట్లాడతాడు."

"అందులో ఆశ్చర్య మేముందిరా? అది ఓపెన్ సీక్రెట్ .. మొన్న ఒకసారి వాళ్ళింటికి వెళ్ళి నప్పుడు లెక్చరర్ శాస్త్రి నాతో అన్నాడు- దామోదరం మాలతిని మోనాపలైజ్ చేస్తాడేమిటోయ్?- అని"

"ఏం? ఆయనకి కూడా దిగులుగా ఉందా?"

"అదేమిటిరోయ్!- 'ఆయనకికూడా' అంటున్నావే- నీకు మొదటినుంచీ దిగులుగానే ఉందా?"

"ఇంకా మెల్లిగా అంటావేమిటిరా?—మాలతిని గురించి ఎవరికి దిగులుగా ఉండదూ? — కాకపోతే పైకెవరూ అనరుగానీ—"

"ఆ మాటే దామోదరం ఎదురుగుండా అను — నీ అంతు తేలుస్తాడు."

"అవును. వాణ్ణిచూస్తే ప్రిన్సిపాల్‌కే హడల్. ఇహ మన మనగా ఎంత!"

"కాని ఆయన ఎదురుగుండా మనవాడు కొంచెం జంకుతాడురోయ్!.... మొన్న ఒకసారి మాలతి ఒక్కతే జట్కాలో వస్తోంది. వెనకాల మనవాడు సైకిల్ మీద వస్తూ—అంత దూరంలో ప్రిన్సిపాల్ రిక్షా చూసి రివ్వున ముందుకి వెళ్ళిపోయాడు."

"అదంతా భయం కాదురా నాన్నా!— డిప్లొమసీ! డిప్లొమసీ!- ఒకవేళ ఈ లవ్ ఎఫెయిర్ విని ఇంట్లో వాళ్ళు ఒప్పుకోకపోతే ప్రిన్సిపాల్ అయినా సద్దతు ఇస్తా డని అప్పుడప్పుడూ ఆయనకి లొంగి ఉన్నట్టు నటిస్తాడు. మనవాడు అన్నివిషయాల్లోనూ అఖండుడురా! అన్నీ ఇప్పటినుంచే ఆలోచించి అట్టే పెడుతున్నాడు - ఆనక బాధ పడితే లాభంలేదని."

"అసలు ఇంతకీ మాలతి వీణ్ణి చేసుకుంటుందంటావా? మాలతి నాన్న చాలా ఆర్థడాక్స్‌ట- ఈ పొగరుమోతు వాడికి ఆయన తన కూతుర్ని ఇస్తాడా!"

"ఎందుకు చేసుకోదురా నిక్షేపంలా చేసుకుంటుంది- ఒకవేళ ఆ అమ్మాయి వాళ్ళవాళ్ళకి భయపడినా మనవాడు ఊరుకోడు- ఆ అమ్మాయిని ఎత్తుకు పోయైనా పెళ్ళి చేసుకుంటాడు. వాడు మాలతిని ఇంకొకరికి దక్కనివ్వడు."

" ఏమిటిరోయ్ : వాళ్ళిద్దరి తరపునా వకాల్తా పుచ్చుకున్నట్టు మాట్లాడుతున్నావే."

"అదికాదురా- వాళ్ళిద్దరూ అంతగాఢంగా ప్రేమించుకుని పెళ్ళి చేసుకుందామనుకుంటూంటే మధ్యమనకెందుకీబాధ?- అంచేత ఒప్పేసుకుందాం అన్నాను అంతే."

"ఇప్పుడు ఒప్పుకోక ఎవరేమన్నారోయ్? మాలతి నాన్న ఈ పెళ్ళికి ఒప్పుకుంటాడో ఒప్పుకోడో అన్నాను గానీ"

"ఆయన ఒప్పుకోకపోతే మనమంతా కలిసి ఒప్పించాలిరా. అప్పటికీ కుదరక పోతే మనమే పెళ్ళి పెద్దలమయిపోదాం.... ఎలాగైనా ఈ సెలవుల్లో మన దామోదరం ఆ కాస్తా అయిందనిపించేస్తాడులే- లేక పోతే వాడికి పిచ్చెక్కుతుందేమో- కూడా మొన్న ఫిజిక్స్ లాబ్ లో ఏంచేశాడో తెలుసా?"

"ఏంచేశాడేమిటి? కొంపతీసి...."

"అబ్బెబ్బే. అలాంటిదేం కాదులే....మాలతి విషయంలో ఫిజిక్స్ లెక్చరర్" "యూసీ!" గారికీ మన దామోదరానికీ పెద్దఘర్షణ జరిగింది. మాలతి దామోదరం వంక చూస్తూ ఇవతల ఎక్స్‌పెర్‌మెంట్ అంతా తగలేసింది. అదంతా లెక్చరర్ గమనిస్తూనే ఉన్నాడు. ఆయనకి ఒళ్ళు మండి పోతోంది. .... ఇంతలో స్టాండుకి సరిగ్గా బిగించలేదు కాబోలు మాలతి చేతిలోంచి బ్యూరెట్ జారి పడి పోయి బ్యూరెట్టూ బీకరూకూడా పగిలి పోయాయి. చప్పునవెళ్ళి మన "యూసీ" గారు అవి పగలగొట్టినట్టు రిజిస్టర్‌లో సంతకం పెట్టమన్నాడు మాలతిని. మాలతి బిక్కమొహం వేసింది .... దామోదరం ఆయన దగ్గరకి వెళ్ళి 'వెంటనే డబ్బు కట్టేసేట్టయితే సంతకమెందుకు సార్?' అన్నాడు ధీమాగా. డబ్బు కట్టినాసరే రిజిస్టర్‌లో ఆవిడ సంతకం ఉండితీరాలంటాడు లెక్చరర్. అవసరం లేదంటాడు దామోదరం. సిల్లీథింగ్. అనవసరంగాఘర్షణ పెరిగింది. సమయానికి ఆ అమ్మాయి దగ్గర డబ్బుకూడా లేకపోయింది. ఆ సంగతి తెలిసి వెంటనే దామోదరం తన జేబులోంచి రూపాయనోట్లుతీసి ఆయన బల్లమీద విసిరేశాడు. మాలతి సంతకమూ పెట్టింది- ఇంత చిన్న విషయానికి మనవాడు ఎంత దూకుడుగా ఆయన మీదికి వెళ్ళాడో తెలుసా?- ఎవరైనా మాలతిని పల్లెత్తు మాట అంటే వాడి రక్తం ఉడికిపోతుంది. కోపంపట్టలేక తన్ను తాను మరిచిపోయి పిచ్చివాడిలా వ్యవహరిస్తాడు."

"ఇశ్ ! ఊరుకోరా కిష్టిగా. దామోదరం వస్తున్నాడు. మన సంభాషణంతా వాణ్ణిగురించే అనితెలిస్తే ఇంకేమన్నా ఉందా వీపు చిట్లగొట్టేస్తాడు .... అయినా సినిమా సంగతి వాణ్ణికూడా కదిపిచూడరా ఏమంటాడో"

"ఏం దామోదరం ! మధ్యాహ్నం ఫస్టవర్ ఖాళీయేగా. సెకండవర్ తెలుగుక్లాసు— కాలేజీ ఎగ్గొట్టేసి మేట్నీకి పోదామంటున్నాడు నారాయణం. నువ్వుకూడా రాకూడదూ?" అన్నాడు కృష్ణమూర్తి.

"లేదు కృష్ణా—నాకూ ఈపూట కాలేజీ ఎగ్గొట్టేయ్యాలనే ఉందిగానీ సినిమాకు మాత్రం రాను— నాకు వేరే పనుంది వెళ్ళాలి.... మీరుకూడా ఇవాట్టికి సినిమా ప్రయాణం మానెయ్యండి. క్లాసుకి వెళ్ళండి. అందరం ఒక్కసారే గైర్‌హాజర్ అయితే బాగుండదు— మన మందరం కలిసి రేపువెడదాం సినిమాకి. ఇవాళనాకువేరే పనుంది."

"నువ్వా అలా అంటే ఎలాగోయ్ దామోదరం — పోనీ క్లాసుకి ఎటెండ్ అవుదామూఅంటే నాకు ఛందస్సు ఏమీరాలేదు. ఆ పిడతగారు ఏమంటాడో అని భయంగా ఉంది. ఇహ మన నారాయణం సరేసరి- తెలుగు క్లాసు ఉందనే సంగతే మరచి పోయాట్ట."

"ఇంకనేం ? బాగానేఉందీ :- అతనికంటె ఘనుడు-"

"అదికాదు దామోదరం. నువ్వుకూడావస్తే సరదాగా అందరం కలిసి మేట్నీకిపోదాం. రేపు తెలుగు లెక్చరర్ ఏమన్నాఅంటే మాఅందరి తరఫునా ఆయన్ని నువ్వు దబాయించేద్దువుగాని. ఆయన నిన్నేమీ అనడులే. పైగా నువ్వంటే భయపడతాడుకూడాను."

"వాటన్నిటికీ నాకేం అభ్యంతరంలేదుకాని ఇవాట్టికి మాత్రం నామాటవిని మీరు సినిమా ప్రయాణం మానెయ్యండి— నాకు వేరే పనుంది. నేనువెడుతున్నాను."

"మనకి తెలియకుండా అంత కొంపలుమునిగిపోయే పని ఏమి ఒచ్చిందో వీడికి కిష్టిగా?— అదే తనకి అవసర మయితే మళ్ళీ మనందర్నీ బాగా ఉపయోగించుకుంటాడు. మనకి అవసరమయితే ఇలా మొహం తప్పించేస్తాడు. ఏమయినాసరే ఇవాళ మనం సినిమాకి వెళ్ళితీరాలిరా కిష్టిగా — తెలుగుక్లాసు పోయినాసరే దామోదరం రాక పోయినాసరే — నువ్వూ నేను. రాముం మధూ అందరం కలిసేపోదాం — బతిమాలిన కొద్దీ మరీ బెసిరిస్తున్నాడీ దామోదరం."

"ఊరుకోరా నారాయణం - దామోదరాన్ని గురించి అంత చులకనగా మాట్లాడకు. నిజంగానే వాడికేదో అర్జంటుపని తగిలిఉంటుంది. లేకపోతే అలా అనడురా పాపం- పోనీ ఇవాళ్టికి మనమే వెడదాంలే. నువ్వు అంత ఇదిగా అడుగుతూంటే వద్దనటానికి నాకూ మనస్సొప్ప టంలేదు....రామాన్నీ మధుమూర్తినీ తీసుకుని నేను మీ యింటికి వస్తాను — నువ్వు రెడీగాఉండు. అందరం కలిసివెడదాం."

♦ ♦ ♦

"ఏమిటి మాలతీ అంత దీర్ఘంగా ఆలోచిస్తున్నావ్? ఎనీ సీరియస్ ప్రాబ్లెమ్ ?"

"ఏంలేదు సావిత్రీ. మధ్యాహ్నం నాకు కొంచెం పనుంది. ఇంటికి వెళ్ళాలి. ఫస్టుఅవర్ శాస్త్రిగారు రాలేదు కనుక ఫరవాలేదు. సెకండ్ అవర్ తెలుగుక్లాసు. లెక్చరర్ పర్మిషన్ ఇవ్వరేమో అని భయంగా ఉంది."

"అయితే వెళ్ళు మాలతీ. ఆయనకి మేంచెప్తాంలే. దానికి అంత ఆలోచనెందుకు ?"

"అదికాదు సావిత్రీ....తెలుగుక్లాసు మానెయ్యటం నాకూ ఇష్టంలేదు — అదీకాక పొద్దున నేను కాలేజీకి రావటం ఆ లెక్చరర్ చూశాడుకూడాను. ఈపూట నేను ఆబ్సెంట్ కాకపోతే ఆయన క్లాసే మానేశానని కోపం తెచ్చుకోడూ ?"

"ఓయబ్బ ! ఎందుకమ్మా అంత భయం ?.... మీ దామోదరం ఎన్నిసార్లు ఆయన క్లాసు ఎగ్గొట్టెయ్యలేదూ?- ఆయన అతన్ని ఎప్పుడైనా కోప్పడ్డారా ?"

"ఛీ ! ఊరుకోవోయ్ నువ్వుమరీను — మా దామోదర మేమిటీ ?— మాటిమాటికీ నాదగ్గర అతని పేరెత్తకు."

"ఆహా ! ఏంనంగనాచివి మాలతీ !- నువ్వు ఒప్పు కున్నా ఒప్పుకోకపోయినా అతను నీ దామోదరమే. కాదనగలవా ?— నీకోసం దిగులుపడి అతను రోజురోజుకీ ఎలా చిక్కి శల్యమైపోతున్నాడో చూడూ."

"అబ్బ ! ఊరుకో సావిత్రీ ! ఇప్పుడు ఆగొడ వెందుకూ."

"పోనీ లేవోయ్ — నీకు అంత ఇష్టంలేకపోతే మాట్లాడను — ఇవాళదాగినా రేపు దాగదుగా....సరేగానీ ఈపూట క్లాసునిగురించి నువ్వేమీ దిగులుపడకు. నీ తరపున లెక్చరర్‌కి నేను సంజాయిషీ చెప్పుకుంటానులే. నువ్వు నిశ్చయంగా ఇంటికి వెళ్ళచ్చు. సరేనా ?"

"మెనీ థాంక్సు సావిత్రీ. వెళ్ళొస్తాను."

♦ ♦ ♦

"మాలతీ !"

"ఓ ! ఇక్కడా ఉన్నారు ?....టైమయిపోతుందేమో నని ఎంత భయపడ్డానో తెలుసా ?...ఎంత సేపయింది మీరువచ్చి ?"

"అదుగో ఆ 'మీరు' అనటమే మానెయ్యాలి మాలతీ!- ఇలాంటప్పుడైనా మనం ఒకరినొకరం మన్నించుకోటం మానెయ్యాలి....అదిసరేగానీ దేవిగారు ఇంత ఆలస్యంగా వేంచేశారేం ?"

"ఏం చెయ్యను దామోదరం !— కాలేజీలో సావిత్రినీ ఇంటిదగ్గర నాన్ననీ తప్పించుకువచ్చేసరికి ఆలస్య మయింది....అయినా నాతప్పేమీలేదు. అంతా నీలోనే ఉంది. నేనేం చెయ్యను ?"

"అను మాలతీ అను. ఇంకెన్నాళ్ళు అంటావులే - ఇంక ఇలా నన్ను మాటలతో బాధపెట్టేఛాన్సు నీకివ్వను లేవోయ్. వన్ ఫైన్ మార్నింగ్ వచ్చేసి 'మీ అమ్మా యిని నాకిచ్చెయ్యం'డని మీ నాన్నగార్ని అడుగుతాను. సరేనా ?... ఇవాళ నీకోసం ఆగుంపు అంతటినీ మోసం చేసి తప్పించుకువచ్చాను - మిగతావాళ్ళని గురించి దిగులు లేదుగాని కృష్ణమూర్తి ఏమన్నా అనుకుంటాడేమోనని భయంగాఉంది. అతను సినిమాకి రమ్మంటే రానన్నాను."

"పోనీ - అంతబాధగా ఉంటే అతనితోనే సినిమాకి వెళ్ళకపోయావా ? దామోదరం ? మధ్య నన్ను ఎందుకిలా ఇన్‌సల్ట్‌చేస్తావ్ ?"

"ఓస్! ఇంతలోనే అంత కోపమెందుకండీ రాణీ గారూ?.... ఊరికే అన్నానోయ్ - నీకోపం ఎలా ఉంటుందో చూద్దామనీ ...ఆట మొదలుపెట్టేస్తారేమో — ఇహ లోపలికి వెడదామా?"

"టిక్కెట్స్ కొనేశావేమిటి?"

"మధ్యాహ్నమే సీట్స్ రిజర్వ్ చేయించాను."

"ఆల్‌రైట్. అయితే పద."

♦ ♦ ♦

"ఒరేయ్ కిష్టిగా! ఆ బాల్కనీసీట్‌లో కూర్చున్న జంటని చూడరా....అదేమిటిరా ఆసూట్‌వాలా మన దామోదరంలా ఉన్నాడే."

"ఇశ్! నోరుమూసుకు కూర్చోరా నారాయణం. చూట్టూ ఉన్నవాళ్ళు తిడతారనైనా భయంలేదేం?- ఇక్కడికి వచ్చికూడా ఆవెధవవాగుడేనా? ఇప్పుడు నీ కోసం దామోదరం ఎక్కడనించి ఊడిపడ్డాడూ? వాడు- 'నాకేదో అర్జంటుపని తగిలింది సినిమాకిరాను మొర్రో'- అని అప్పుడే వెళ్ళిపోతేను ...అయినా నీకు ఎంతసేపూ దామోదరాన్నిగురించీ మాలతినిగురించీ ఆలోచించటమే పని. మరోధ్యాసలేదు. అస్తమానం వాళ్ళ మూవ్‌మెంట్స్ అన్నీ గమనిస్తూ ఉండడమే నీఉద్యోగం. నీ అంత అపనమ్మకం మనిషి ఈ ప్రపంచంలోలేడురా."

"అది కాదురా కిష్టిగా! నువ్వు సరిగ్గా చూడకుండానే నన్ను తిడతావు....కొంచెంసేపట్లో ఆ ఒక్క లైటూ కూడా ఆర్పేస్తే నువ్వు అసలే నామాట నమ్మవ్. పోనీ ఒక్కసారి వెనక్కి తిరిగిచూడు--అంతదూరంనించికూడా వాడి పక్కనున్న ఆ అమ్మాయి, ఆ అమ్మాయి ఒంటిమీద ఆ చీరా ఎలా ధగధగా మెరిసిపోతున్నాయో!....ఇహ ఆ అమ్మాయి మాలతికాదనీ ఆ సూట్‌వాలా దామోదరం కాదనీ దబాయించేస్తే కళ్ళున్నవా ళ్ళెవరయినా నమ్ముతారా?— వాళ్ళూ అక్కడనించి మనని చూసేవుంటారు. చూడనట్టు నటిస్తున్నారు. నీకు కనబడకపోతే నాకళ్ళు ఎరువుపుచ్చుకుని చూడు....అందుకే వాడు ఇందాక మనని సినిమా ప్రయాణం మానెయ్యమని అంత ఇదిగా ఆర్డర్‌వేశాడు."

"అవునురా నారాయణం! నువ్వు అంటూంటే ఏమిటో అనుకున్నాను -మొత్తానికి దామోదరం మనని మోసం చేసేశాడురా!"

"వాడేమీ మోసం చెయ్యలేదురా - ఇటువంటి విషయాల్లో వాడు ఒఠి అమాయకుడు. ఇదంతా ఆ మాలతిగారి ప్రభావం!- ఆవిడగారు మనతో చెప్పొద్దని ఆర్డర్ వేసుంటుంది. ఈయనగారు శిరసావహించి ఉంటాడు....నేను ఏనాడో చెప్పాను— ఇహ దామోదరం మనవాడు కాడురానాయనా - అని ఇవాళ మేట్నీషో అయినా నీకు కనువిప్పు కలిగించిందా?"

"పోనీలేరా నారాయణం - దానికి అంత బాధపడట మెందుకు?— ఏనాటికైనా వాళ్ళిద్దరూ ఒకటిగా ఉండటమే మనం కోరుకోవలసింది. ఇవాళ మేట్నీషోకి వాళ్ళిద్దరూ కలిసిరావటం నిజంగా చూడవలసిన దృశ్యం. అందుకు నేను నిజంగా చాలా సంతోషిస్తున్నాను. వాళ్ళిద్దరికీ పెళ్ళి అయితే సంతోషించేవాళ్ళల్లో నేను మొదటివాణ్ణి....నువ్వు కూడా నిండుహృదయంతో వాళ్ళని ఆశీర్వదించు నారాయణం!"



దంపతులు

శ్రీమతి వి. అమ్మాజీ

ఆనంద్ తండ్రినుండి ఉత్తరం ఓ ఫొటో రావటం చూచాడు.

"ఫొటో జనార్దనంగారి అమ్మాయి విజయది. కట్నం ఇరవై వేలిస్తారు నీకిష్టమైతే సమ్మర్‌లోనే పెండ్లి జరగాలి" అని

ఆనంద్ విస్మయం పొందాడు! తనూ ఎంచుకొంటున్న విజయనే తండ్రి ఎన్నుకొన్నందుకు, అతని పుత్సాహానికి అంతులేదు. తండ్రిని అభినందించాడు.

విజయ సుగుణవతి. చాలా అందమైంది. స్కూల్ ఫైనల్ చదివింది. క్రిందటి సమ్మర్‌లో ఆనంద్ తెనాలి వెళ్ళినప్పుడు విజయ అన్న రామకృష్ణతో జనార్దనంగారి ఇంటికి వెళ్ళాడు. అప్పుడే తన అన్నకోసరం విజయ వాళ్ళున్న రూమ్‌లోకి వచ్చి ఆనంద్‌నుచూచి సిగ్గుతో మెరుపులా మాయమైంది. ఆమె సౌందర్యానికి ఆనంద్ ముగ్ధుడయ్యాడు. ఆమెను చూడాలనే- ఆశతో అతని నేత్రాలు వెతుక్కో-సాగాయి. ఇంటికిపోతూ లోపలికి చూచాడు. విజయ కర్టెన్ ఒత్తిగించుకొని తన్ని ఓరగా చూస్తుంది. ఆ జరిగిన దృశ్యాన్ని వర్ణించుకొన్నాడు. ఫొటో చూచాడు. ఆ సౌందర్యమే! తండ్రికి తన సమ్మతాన్ని తెలియచేశాడు.

ఆనంద్ స్ఫురద్రూపి. సహృదయుడు. నైతికదృష్ట్యా చూస్తే అంతటి సాత్వికుడు లేడనవచ్చు. అతనిప్పుడు మద్రాస్‌లో ఎమ్.బి.బి.ఎస్. చదువుతున్నాడు.

♦ ♦ ♦

నిర్ణయించుకొన్నట్లుగానే విజయా ఆనంద్‌లకు పెండ్లి వైభవముగ జరిగిపోయింది. అయితే! వధూవరులు పెండ్లిపీటలపైనుండి లేవకుండానే పెద్ద సంఘర్షణ జరిగింది ఇస్తానన్న కట్నమివ్వక పదివేలే ఇచ్చారని! ఆనంద్ తండ్రి ఉగ్రుడై పుత్రుని తీసుకొనిపోయాడు అంతే! ఉభయులకు మనస్పర్థలు కలిగి పట్టుదలలు పెరిగిపోయాయి. ఒకరి ముఖం ఒకరు చూచుకోకుండా వున్నారు.

ఆనంద్‌కు తీరనిబాధ కలిగింది. హృదయంలో పొంగిపొర్లే ఆనంద మధురభావాలు తృటిలో తెగినట్లయింది. కట్నమనే గొడ్డలితో పవిత్ర నిర్మల హృదయాన్ని బ్రద్దలుచేయబూనటం!!! ఆనంద్ తండ్రిని ప్రతిఘటించలేకపోయాడు. అవును! తనేం చెయ్యగలడు! తండ్రిని వ్యతిరేకిస్తే రానున్నఫలితం తెలుసు. తనిప్పట్లో ఏమీచెయ్యలేడు. ముందు తన చదువు పూర్తయి. ప్రాక్టీసు మొదలుపెట్టాక విజయను తీసుకెళ్ళవచ్చు. యీసంగతి రామకృష్ణతో చెప్పి మద్రాస్ పోవుటకు నిశ్చయించుకొన్నాడు. అయితే! రామకృష్ణను తను కలుసుకోలేకపోయాడు. రామకృష్ణ తనముఖమైనా చూడకుండా వెళ్ళిపోయాడు. అవును! తన తండ్రికే అంతపట్టుదలైనప్పుడు వాళ్ళ కెందు కుండదు? తన తండ్రి స్థితిపరుడైనా స్వార్థంతో కట్నందగ్గర మూర్ఖత వహించాడు. ఈ కట్నాల దురాశగల తల్లితండ్రులనెదిరించి నిరుద్యోగ స్థితిలో నిలబడే తనలాంటి యువకులకు దారేది? యీ కట్నాల ఆశ సుఖాంతము కాగల దాంపత్య జీవితాలని నాశనం చెయ్యటమేకదా!

ఆనంద్ వ్యథిత హృదయంతో మద్రాస్ వెళ్ళినాడు.

♦ ♦ ♦

విజయ తండ్రి ఆనంద్ కుటుంబము సంగతితేసుంచా ఇంట్లో కట్టడిచేసాడు. విజయను కాలేజీలో చేర్పించాడు. ఇట్టిపరిస్థితిలో విజయ కాలేజీకి వెళ్ళి చదువుకోటానికి ఇష్టపడలేదు. అయితే! తండ్రిమాటకు తిరుగులేదు.

దంపతులు

ఆనంద్ కుటుంబమువారికి విజయ చదువుగురించి మరింత అసూయాద్వేషాలు కలిగాయి. ఆనంద్ తల్లీ చెల్లెలూ తండ్రికి విజయపట్ల లేనిపోని అపార్థాలుచెప్పారు. మరలపెండ్లి చేద్దామన్నారు. ఇందుకాయన సిద్ధపడ్డాడు! ఆనంద్‌కు తమ ఉద్దేశాలు తెలిపారు. ఆనంద్ హృదయం క్షోభించిపోయింది! విజయ యీ ఇంట్లో అడుగైనా పెట్టలేదే! ఆమెపై ఇంతపగా! ఇంత నిర్దాక్షిణ్యమా! తండ్రి కట్నమివ్వనందుకు ఆమెపై ఇంత అమానుషత్వమా! నిజముగ విజయ యీ ఇంట్లోకి వచ్చివుంటే ఆమెనెంత వేధించేవారో! భగవంతుడు కరుణామయుడు విజయను కాపాడినాడు! అనుకున్నాడు.

తల్లి దండ్రులు బిడ్డల్ని కనిపెంచి పెద్దవాళ్ళను చేసి చివరకు ధన ధాన్యాలు! మేడమిద్దెలు! ఇత్యాది స్వార్థాలతో వాళ్ళ హృదయాలికి చిచ్చుపెడతారు. అది చివరకు ఎట్టివిధంగా పరిణమించినా దానికి నిష్కృతి అనేదిలేదు! ఇది లోకం నడవడి!!!

◆ ◆ ◆

ఆనంద్ తన తండ్రి తెనాలి రమ్మనినా వెళ్ళకుండా మద్రాస్‌లోనే వుంటున్నాడు. అతనిప్పుడు డాక్టర్‌గా. రూపొందాడు. ఎవరికై తనింతదీక్షాపరుడై స్వతంత్రుడైనాడో అట్టి తన సతీమణి విజయ సందర్శనంకొరకు అతని హృదయం తహతహలాడుతోంది. ఏదో బావోద్వేగంతో ఆరాటపడుతోంది.

ఆనంద్ మద్రాస్‌నుండి తెనాలి వెళ్ళుటకు ట్రెయిన్ ఎక్కుతూ అనుకున్నాడు, విజయ తన్నిగురించి ఏమనుకొంటున్నదో! ఇన్నాళ్ళు తన్ని నిర్లక్ష్యం చేశానని నిష్కృతిలేదంటూ నిరాకరిస్తుందా? కానీ ఆమెపై అతనికి నమ్మికవుంది తన్ని విశ్వసిస్తుందని.

◆ ◆ ◆

సాయంకాలం అన్నాతండ్రీ క్లబ్బుకువెళ్ళాక విజయ బయట వరాండాలోకివచ్చి నిలబడింది. ఆమె ఆలోచన పూర్వకంగా ఆకాశంవైపు చూచింది. బంగారుకిరణాలు వెదజల్లుతున్న ప్రభాకరుని దివ్య స్వర్ణారుణ కాంతులకు ఆ మబ్బులు రంగురంగులుగ మారి తేలిపోతున్నాయి. ఏపుగా పెరిగివున్న గులాబిరెమ్మలు చల్లగాలికి నాట్యం చేస్తున్నాయ్. అందులో వికసిస్తున్న జంటగులాబులు తన్ని ఆహ్వానిస్తున్నాయ్. అప్రయత్నంగా ఆమె దృష్టి గేటువైపు మళ్ళింది. ఆమె చకితురాలయింది! ఆ వస్తున్నది ఎవరు? ఇన్నాళ్ళనుండి ఎవరికై తపస్సు చేస్తున్నదో! ఎవరికై ఎదురుత్రోవలు చూస్తున్నదో! ఆ ప్రేమైకమూర్తి! తన భర్త! ఆనంద్!! ఆమెహృదయం ఆనంద్‌తో విప్పారింది!!

ఆనంద్ ఆమె సామీప్యానికివచ్చి మృదువుగ అన్నాడు.

విజయా! నిన్ను తీసుకువెళ్ళుటకు వచ్చాను!

ఆమె సిగ్గుతో తలవంచుకొంది.

అతడుమరల అన్నాడు మృదువుగ.

విజయా! ఇన్నాళ్ళనుండి రాలేదనికోపమా! నన్ను క్షమింపవా!

ఆమె సిగ్గుతో నిర్మలమైన మందహాసముతో ముఖాన్ని ఉజ్వలంగాచేసుకొని

ఎందుకు! కోపం! మీరేంచేశారని! అంది మాధుర్యమైన కంఠంతో.

ఆనంద్ ముగ్ధదృష్టితో రెప్పవాల్చకుండా ఆమె ముఖంలోకి చూస్తున్నాడు. అదేసమయంలో ఆమె అతనిని చూచింది. ఇద్దరికళ్ళు కలుసుకొన్నాయ్. ఆనందంతో వారి హృదయాలు తన్మయత్వం పొందాయి. ఆక్షణంలోనే జనార్దనంగారు వచ్చాడు! ఆయనముఖంలో అగ్నిజ్వాలలు ప్రస్ఫుటమౌతున్నాయ్.

విజయ కంపించి పోయింది. ఆయన కోపంతో విజయను లోపలికి వెళ్ళమని అరచాడు. ఆయన ఆనంద్ మీద విరుచుకుపడ్డాడు. దూషణవాక్యాలతో అతని హృదయాన్ని గాయపర్చాడు. అయినప్పటికీ ఆనంద్ తనను క్షమింపమని ప్రాధేయపడ్డాడు: విజయను పంపెంచమని అర్థించాడు! ఆయన పాషాణ హృదయం కరుగలేదు. విజయను పంపేది లేదని తలుపులు ధడాల్ని వేసుకున్నాడు.

జనార్దనంగారి నౌకరు వీరాస్వామి పలుకరించేవరకు ఆనంద్‌కు తెలీదు. తనెంతసేపటినుండి అలా నిలపడ్డాడో! వీరాస్వామి ఆనంద్‌తో బయటకువస్తూ అన్నాడు, లాలనగా. బాబూ! అయ్యగారి మాటలకు ఏమీ అనుకోకండి. చిన్నమ్మగారి మనస్సు నాకు తెలుసు. ఎప్పుడో మీదగ్గరకే వచ్చేస్తారు.

వీరాస్వామి మాటలు అతని హృదయానికి ఆశలు గొల్పాయి!!

తండ్రి భర్తనుఅన్నమాటల్కి విజయ భరించలేక పోయింది. ఆమె హృదయం క్షోభించిపోయింది. ఆమె దిండులోనికి తలదూర్చి వెక్కి-వెక్కి ఏడ్చింది. ఆమె తన భవిష్యత్తును తలంచుకొని లోలోన కుమిలిపోయింది. తన కర్తవ్యాన్ని స్మరించుకొంది. తను చెయ్యకల్గేది ఒక్కటే! అది! తనకుతానై భర్తకడకువెళ్ళిపోవటమే!!!

• • •

విజయ గేటులోనుండి వస్తూచూచించి. భవనంపై తనపేరుతో చక్కని అక్షరాలు చెక్కబడివుండటం!! భర్త ప్రేమకు ఆమె చలించింది!! పనిమనుష్యులు తనకు భయభక్తులతో వుపచారాలు చేస్తున్నారు. క్రిందా పైనా తనఅభిరుచులకు అనువైన పద్ధతులతోనూతనమైన సామానులు అమర్చివున్నవి. హాల్లోని బీరువాలలో మంచి మంచి గ్రంథములు పేర్చబడివున్నవి. క్రింద చక్కని పూదోట ఆమె భర్తను అభినందించుకొంది. ఆనంద్ తనకు భర్తగా లభించినందులకు తన అదృష్టమునకు మురిసిపోయింది.

ఆనంద్ సాయంకాలం అయిదుగంటలకు అప్పుడే వూరునుండి తిరిగివచ్చి కారు దిగుతూనే వీరాస్వామిని చూచి అంతా తెల్సుకొన్నాడు. తల్లీ తండ్రీ అన్నా. ఎవరితో చెప్పకుండా విశ్వాసపాత్రుడైన ఈముసలి నౌకరును వెంటపెట్టుకొని భార్య భర్తదగ్గరకు వచ్చి వేసినది!! ఆనంద్ సంతోషానికి మేరలేదు!

విజయకొరకు పైకి శబ్దముకాకుండా వెళ్ళాడు. ప్రయాణంబడలికవల్ల విజయ ఇంకా నిదురపోతూనే వుంది. ఆనంద్ ఆమెను చూస్తున్నాడు. అపూర్వ తేజస్సుతో కూడుకొన్న ఆమె సుందరమైన ముఖంలో చిరునవ్వు చూచాడు. ఆమె ఎట్టి మధురస్వప్నాలు కంటున్నదో! తను విజయను భార్యగా పొందకలిగినందులకు అదృష్టవంతుడనని అనుకొన్నాడు. అతను సవ్వడి చెయ్యకుండా క్రిందికి వెళ్ళాడు. రాత్రి విజయ చక్కని దుస్తులు ధరించుకొని వెన్నెల్లో సోఫాలో కూర్చుంది. చంద్రుని కాంతులకు ఆమె మెడలోనున్న రవ్వల కంఠాభరణం ధగధగమెరుస్తూ ఆమెసౌందర్యాన్ని మరింత వ్యక్త పరుస్తున్నాయ్. సుందరమైన ప్రకృతిని విజయ తన్మయత్వంతో చూస్తుంది. ఆర్చిపై అల్లుకొనియున్న సన్నజాజిమాలతీ తీగలు పిల్లగాలులకు అతి వయ్యారంగా వంగుతూ నాట్యంచేస్తున్నాయ్. సన్నజాజులు విరియబూసి సుగంధాలు విరజిమ్ముతున్నాయ్. ఆకాశంలో పక్షులు జంటలుగ స్వేచ్ఛగా ఎగురుతున్నయ్. గదిలో రేడియో సంగీతం నెమ్మదిగ మధురముగ విన వస్తుంది. ఆమె తిరిగి చూచింది. మందహాసముతో వస్తున్న ఆనంద్‌ను.

విజయ సిగ్గుతో లేచి నిలుచుంది. —

మహిళా సమాజము

సంగం జాగర్లమూడి

అక్టోబరు 1 వ తేదీన శ్రీమతి పరుచూరి రాజ్యలక్ష్మీ దేవిగారి అధ్యక్షతను ఆంధ్రరాష్ట్ర ద్వితీయ వార్షికోత్సవ సందర్భంలో బహిరంగసభ జరిపి, రాష్ట్రంలో ఈ రెండు సంవత్సరాల్లో జరిగిన అభివృద్ధిని, ద్వితీయ పంచవర్ష ప్రణాళికాకాలంలో ప్రభుత్వంవారు నిర్వహింపనున్న సాంఘిక సంక్షేమ కార్యక్రమాల ద్వారా ప్రజలకు కలుగగల ప్రయోజనాలను గురించి శ్రీమతి లక్ష్మీప్రసూనాంబ, పరుచూరి శాంతకుమారిగార్లు ఉపన్యసించారు. అక్టోబరు రెండవ తేదీన గాంధీజయంత్యుత్సవ సందర్భంలో శ్రీయుత కొత్తపల్లి సీతారామయ్యగారి అధ్యక్షతను బహిరంగసభ జరిపి మహాత్ముని సత్యాహింసలను గూర్చియు, మహాత్ముని ఆదేశానుసారం ఈ మహిళా సమాజమువారు నిర్వహించుచున్న విద్య, చేతిపనులు, శిశుసంరక్షణ కేంద్రము వీటి ప్రాముఖ్యతనుగూర్చి హిందీ పాఠశాలోపాధ్యాయులు శ్రీయుత ఐనంపూడి వెంకట నారాయణ, శ్రీమతి సుంకర విజయకుమారి, పరుచూరి శాంతకుమారి, రత్నమాణిక్యం. లక్ష్మీ అన్నపూర్ణమ్మ మొదలగువారు మాట్లాడారు. కొత్తలక్ష్మీ ప్రసూనాంబ గారి వందనసమర్పణతో రెండురోజుల కార్యక్రమం ముగింపబడినది.

ఇట్లు,
సహాయ కార్యదర్శిని,
యన్నంశెట్టి సామ్రాజ్యమ్మ.

పట్టాభిపురం మహిళా సమాజం

గుంటూరు.

ఆంధ్రరాష్ట్రావతరణోత్సవము, గాంధీజయంత్యుత్సవములు, అక్టోబరు 1, 2, 3 వ తేదీలలో పట్టాభిపురం మహిళా సమాజంవారు అత్యుత్సాహంతో జరుపుకొన్నారు. అక్టోబరు ఒకటవతేదీన డాక్టరు సుశీలమ్మగారి అధ్వర్యాన, జరిగిన భారతసమాజపూజతో ఉత్సవము ప్రారంభమైనది. పూజ్యులు శ్రీయుత ఉన్నవ లక్ష్మీనారాయణగారు ఆ నాడు జెండా వందన మొనరించిరి. పిమ్మట శ్రీమతి ప్రమీలా భగవాన్‌దాసుగారు 140 మంది బీదబాలబాలికలకు ఆటలపోటీలు జరిపి గెలిచినవారికి బహుమతులనొసగిరి తరువాత 150 మంది బీద బాలబాలికలకు విందుజరిగినది. గాంధీజయంత్యుత్సవమునాడు వివిధ మతప్రార్థనలు, భగవద్గీతా పారాయణ అనంతరం శ్రీమతి పి. రమణమ్మ చంద్రారెడ్డిగారు సూత్రయజ్ఞం ప్రారంభించినారు. పిమ్మట మిసెస్ కోకాసుబ్బారావుగారు, 100 మంది బీదబాలబాలికలకు నూతన వస్త్రములను ఇచ్చినారు. రామభజన, కోలాటములతో నాటి కార్యక్రమము ముగిసినది. ఈ సందర్భంలో శ్రీపాలపర్తి నరసింహంగారు, సమాజ సభ్యులు కొందరు, ఆంధ్రరాష్ట్రావతరణము, ఆంధ్ర వీరులు. పొట్టిశ్రీరాములుగారి త్యాగము. మహాత్మాగాంధీ గారి ఉపదేశములను. గూర్చి మాట్లాడినారు. అక్టోబరు మూడవతేదీన శ్రీ ఎన్. సి. వి. రామానుజాచారి, అడ్వకేటుగారి కుమార్తెలు, శ్రీమతులు, వి. రంగమ్మ. లక్ష్మీదేవిగార్లున్నూ, ఇంజనీరు వేదాంతం లక్ష్మీనారాయణ గారి కుమార్తెలున్ను సంగీతముపాడిరి. కుమారి తోపల్లి రామలక్ష్మిగారు వందన సమర్పణచేసినారు.

స్నేహబంధం

రచన:
"సువేణి"

"ఎంతపని చేశావు రాజ్యం ; నీ కోసం నేను చేసిన త్యాగమంతా వృథా అయిపోయిందే !"

విచారంతో, బాధతో, నిరాశతో, స్నేహ చాలాసేపు పెనుగులాడింది.

చివరికి తెప్పరించుకొని లేచి గోడనవున్న రాము ఫొటోకు ఎర్రని గులాబి పువ్వులదండ వేసి అగరువత్తులు వెలిగించి ప్రక్కన గ్రుచ్చి "రామూ" అంటూ దుఃఖంతో ఆతని ఫొటోమీద వాలిపోయింది.

రాము, స్నేహ ఎంత గాఢంగా ప్రేమించుకున్నారో అంత విచిత్రంగా అంత బాధగా విడిపోయారు. బహుశః అంత ఎక్కువగా అంత నిర్మలంగా, అంత స్వార్థ రహితంగా ప్రేమించుకున్నవాళ్ళు ఎలాగో ఒకలాగ ఎప్పుడో ఒకప్పుడు విడిపోక తప్పదేమో ! కొంతమంది తల్లి దండ్రులచేత. కొందరు సంఘంచేత, కొందరు మూఢ ఆచారంచేత విడగొట్ట బడటం మామూలు. అనివార్య విధిచేత తమంతట తాము విడిపోవడం మరింత విషాదకరము.

స్నేహ చాలా అందమైంది. అందానికి తగిన తెలివి తేటలు సుగుణాలు కూడా ఆమెకు వున్నాయి. ఆమె, ఆమె తల్లి యిద్దరు మాత్రమే వుంటున్నారు తండ్రి ఆమె చిన్నతనంలోనే చనిపోయాడు. అప్పటినుంచి తల్లి పెంచి పెద్దదానిని చేసి చదువు చెప్పింది. స్నేహ ఇంటరు ప్యాసయి బి.ఏ. లోకి వచ్చింది.

స్నేహ యితరులను స్నేహం చేసుకోవడంలో చాలా గట్టిది. తన మంచి తనంవల్ల నైతేనేమి, తెలివితేటలవల్ల నైతేనేమి ఆమెకు అందరు అతి త్వరగా స్నేహితు రాండ్రయ్యేవారు. అలాటి స్నేహితురాండ్ర మధ్యలో ఆమె సానుభూతిని పొందింది రాజ్యం.

పాపం, రాజ్యం ఒక బాల వితంతువు. పూర్వ సంప్రదాయం ప్రకారం ఆమెకు చిన్నప్పుడే— అంటే పన్నెండో ఏటే— పెండ్లి చేశారు. పెళ్ళి అయిన కొద్ది రోజులకే పాముకాటువల్ల చనిపోయినాడు పెండ్లికొడుకు. ఒక్కగాని ఒక్కకూతురు. అలా అవడం తల్లి భరించ లేకపోయింది. మనోవ్యాధితో ఆమె మంచం పట్టింది. ఏడాదికాకుండా రాజ్యాన్ని తండ్రికి అప్పగించి ఆమె పరలోకగతురా లైంది.

రాజ్యానికి తిరిగి వివాహం చేయడానికి తండ్రికి ధైర్యము చాలలేదు. చదువు చెప్పిస్తే తన బాధ కొంత మరచిపోవడానికి అవకాశముంటుందని ఆమెను చదువులో ప్రవేశపెట్టాడు. రాజ్యానికి చదువులో అంత ఆసక్తి లేదు. అయినా ఏడాది తర్వాత ఏడాది పైక్లాసులోకి వస్తూ బి.ఏ. లోకి వచ్చింది.

రాజ్యం ఎప్పుడూ చూసేందుకు విచారంగావుంటుంది. ఆమెను చూస్తే ఎటువంటి కఠినాత్మునికైనా కన్నీరు రాకమానదు. అతి సున్నిత హృదయంగల స్నేహ ఆమె స్థితికి జాలిపడటంలో ఆశ్చర్యమేమున్నది ! ఆమె అందరి కన్నా ఎక్కువగా ప్రేమించేది రాజ్యాన్ని. ఆమె విచారాన్ని మరచిపోయేట్టు చేయడానికి ఎన్నోకబుర్లు చెప్పేది. అనేకవిధాలుగా ధైర్యము, సంతోషము కలుగచేస్తూ వుండేది. రోజులు గడుస్తున్నకొద్దీ వాళ్ళిద్దరు ప్రాణస్నేహితులయ్యారు. ఒకరిని విడిచి ఒకరు వుండేవారు కాదు. శని ఆదివారాలలో ఒకరింటికి ఒకరు వస్తూ పోతూ వుండేవారు. అలాగే రోజులు గడిచిపోతున్నాయి. ఒక నాడు రాజ్యం అంది—

"స్నేహా, నీవు ఎప్పుడూ ఇలాగే నా మీద దయ చూపుతూ వుండగలవా ?"

"అదేమిటి, రాజ్యం ? అయినా నీకీ సందేహం ఎందుకు కలిగింది ?"

మళ్ళీ ఏమీ మాట్లాడలేదు రాజ్యం.

వారి స్నేహాన్ని చూచి చాలా మందికి సంతోషంకంటె ఈర్ష్య ఎక్కువగా కలిగేది. ఒకరోజు స్నేహ రాజ్యం యింటికి వెళ్ళినప్పుడు రాజ్యం తండ్రి అన్నాడు :

"స్నేహా, నీ ధర్మమా అని మా రాజ్యం ముఖంలో నవ్వు చూస్తున్నాను" కృతజ్ఞత చూపుతూ అన్నాడు.

"నాదేముందండి ! అయినా, రాజ్యం ప్రతిదానికి బాధ పడుతుంది." అంది నవ్వుతూ.

స్నేహబంధం

"ఏమయితేనేమి, దానిని ఒకదారికి తెచ్చావు తల్లీ" ఈవిధంగా రాజ్యం తండ్రి స్నేహకు తన కృతజ్ఞత తెలుపుతూ ఆమెను పొగుడుతూవుండేవాడు.

రోజులు గడిచాయి. వాళ్ళు బి. ఏ. మొదటి సంవత్సరంనుంచి రెండో సంవత్సరంలోకి వచ్చారు. ఇంతలో వున్నట్లుండి స్నేహాని ఒంటరిదాన్నిచేసి ఆమె తల్లి పరలోకం చేరింది. సముద్రం మధ్య ఏ ఆధారంలేక తుపానులో కొట్టుకుంటున్న నావలాగ అయిపోయింది స్నేహ. ఏసహాయంలేక నిలువునా కూలిపోతున్న సమయంలో రాజ్యం, ఆమె దూరబంధువు రాము ఆమెను ఆదుకొన్నారు. ఉన్న ఆస్తి దాయాదులకు పోకుండా, వాళ్ళవల్ల ఏబాధలూ కలగకుండా, రాము వచ్చి కాపాడాడు. నిజానికి రాముకు ఏమీ అవసరంలేదు. అతనికీ స్నేహకీ అంతకు ముందు ముఖపరిచయమైనాలేదు. కాని పురుషునిగా తన ధర్మం నిలుపుకొన్నాడు ఆమెను రక్షించి. ఆమె బాధ్యత తన మీద వేసుకొన్నాడు.

రెండు మూడు నెలలు గడిచాయి. అతను రోజూ వచ్చి ఆమె క్షేమ సమాచారాలను తెలుసుకొని పోతూ వుండేవాడు. ఆమెకు ధైర్యము, ప్రోత్సాహము కలుగచేస్తూ వుండేవాడు. రాము అంటే ఆమెకు అభిమానము ఏర్పడింది. ఒకరోజు రాముతో అంది-

"మీకెందుకు నావల్ల యింత శ్రమ ?"

"అదేమిటి స్నేహ ! శ్రమ అంటావేమిటి ! ఇదొక శ్రమా ? మగవాడినై పుట్టి నిస్సహాయ స్థితిలోవున్న ఒక స్త్రీకి ఈమాత్రం సాయం చేయకపోతే జన్మయెందుకు ? నాకు నీవు శ్రమయిస్తున్నావని నేనెప్పుడూ అనుకోలేదు."

ఆతని విశాల స్నేహ పూరిత హృదయాన్ని చూచి స్నేహ ముగ్ధురాలైంది. రోజులు గడిచినకొద్దీ వారిద్దరి మధ్య వున్న అభిమానము ప్రేమగా అభివృద్ధికాజొచ్చింది.

ఒకరోజు మాటల సందర్భంలో రాజ్యంతో స్నేహ అన్నది-

"రాజ్యం, కొద్దిరోజులలో రాముతో నాకు పెళ్ళి జరగబోతున్నది."

"ఆ ! నీకు రాముతో పెళ్ళా ! నిజం !" అన్నది రాజ్యం ఆశ్చర్యం చూపుతూ.

"అవును, రాజ్యం."

"నీవు అదృష్టవంతురాలివి స్నేహ. మంచి భర్త దొరకడానికి నిజంగా ఎంత గొప్పనోమో నోచుకొని పుట్టాలి. పెండ్లి అయినాక నన్ను మరిచిపోవు కదూ, స్నేహ ! నీవైనా వున్నావుకనుక నేను ఈ మాత్రంగానైనా వుండగలిగాను ఇప్పుడు నీవు కూడా నన్ను విడిచి పోతున్నావు. ఇక నాగతేమిటి ; అయినా నా పిచ్చికాని, ఎన్నాళ్ళని నీవు పెళ్ళి చేసుకోకుండా నాకోసం వుండిపోగలవు !" అని రాజ్యం వాపోయింది.

"ఏడుస్తున్నావా, రాజ్యం ! నీకింత బాధకలుగుతుందనుకోలేదు." అంటూ స్నేహ కూడా బాధపడింది.

ఇంటికొచ్చింది. ఆమె మనస్సంతా బాధతో నిండిపోయింది. నిజమే. తన స్నేహం వల్లనే తన సాహచర్యం వల్లనే రాజ్యం జీవింపగలుగుతున్నది. తను లేకపోతే ఆమె వుండలేదు. ఆమెను ఆదరించే వారు తానుకాక యింకెవరున్నారు ? తను పెళ్ళి చేసుకొని వెళ్ళిపోతే రాజ్యం జీవితం దుఃఖమయం అయిపోతుంది. నాశనమయిపోతుంది. అయితే ఆమెకోసం తను పెళ్ళి మానెయ్యాలా ! రాముతో తన భవిష్యత్తును గురించి ఎన్నో గాలి మేడలు కట్టుకున్నదే ! అవన్నీ ఇప్పుడు కూలిపోవలసిందేనా ! తన మధుర స్వప్నాలన్నీ స్వప్నగతి కావలసిందేనా ! తను రాముని విడిచి వుండగలదా ! తన జీవితమంతా నాశనముకావలసినదేనా !.... .... అవును, విచార సముద్రంలోవున్న ఒక స్నేహితురాలి కోసం తను ఈమాత్రం త్యాగం చేయలేకపోతే స్నేహమంటే అర్ధమేమిటి ?............... నిజమే. తన స్నేహితురాలికోసం తన సౌఖ్యం తాను త్యజించవలసినదే... ...కాని, కాని, తను దిక్కులేనిస్థితిలో వున్నప్పుడు తోడు నీడగావుండి తన్ను ఆదరించిన రాముని ప్రేమ త్యజించడం ధర్మమేనా ? అది కృతఘ్నత కాదా ? తనను విడిచి రాము జీవించగలడా ? ఒకవేళ జీవించినా అతనికి జీవితంలో సుఖం వుంటుందా ? .... రాముని పెళ్ళి చేసుకోవలసిందే. అతని యెడల తన కృతజ్ఞత చూపి తన ప్రేమతో ఆతని జీవితము ఆనందమయముగా చేయడం తన ధర్మం........ ఛా. ఇది తన్ను తాను మోసపుచ్చుకోడమే. రాముతో తాను సుఖించడానికి చేస్తున్న తర్కమే యిది. లేకపోతే రాముకేమి ? అతడు

మగవాడు. కొద్దిరోజులలో తనను మరచిపోయి ఇంకొక అందమైన పిల్లను పెండ్లాడి సుఖంగా వుండగలడు. ఎటొచ్చీ ఆడదానికే కష్టంగాని మగవాడికేమి ? రాజ్యం ఎన్నికష్టాలలో పడి పడి వున్నది. ఆడదైన తను రాజ్యానికి సానుభూతిచూపి, తన సుఖం త్యజించలేకపోతే తన జన్మ ఎందుకు ? తన చదువువల్ల ప్రయోజనమేమిటి ? ఎవరి సుఖం వారు చూసుకోడం సామాన్యమే. కాని తోటి స్త్రీ కోసం తన సుఖాన్ని త్యజించడంలోనేవున్నది నిజమైన గొప్పతనం. అని అనేకవిధాల తర్కించుకొని చివరకు మనసు దృఢం చేసుకొన్నది స్నేహ.

ఇంతలో రాము వస్తూ "స్నేహ, నీకొక సంతోష వార్త చెప్పనా ?" అన్నాడు వుత్సాహంతో.

"ఏమిటి రాము ?"

"మన ప్రేమలత పెరిగి పెద్దదయి వృక్షమై పువ్వులు కాయలు కాస్తుంది"

స్నేహ ఫక్కున నవ్వింది.

"ఏమి భావకవిత్వం రాము ! ఎక్కడయినా లత వృక్షమవుతుందా ?"

"ఎందుకుకాదు ? ఒకవేళ పూర్వంకాకపోతే యిప్పుడు చేసిచూపిద్దాం".

"పూర్వంకానిది యిప్పుడుమాత్రం ఎట్లా అవుతుంది ? ఎవరూ చేయలేనిది మనం చేయడానికి మన మేమయినా దిగివచ్చామా రామూ? "

"అదికాదు, స్నేహ, మనపెళ్ళికి మావాళ్ళు ఒప్పుకున్నారు. మన కోర్కెలు పండబోతున్నాయి. ఈ గులాబి పువ్వుచూడు ఎంతఅందంగా ఆనందదాయకంగావుందో!" స్నేహ తల వంచుకున్నది. ఆమెకండ్లు నీళ్ళతో నిండినయి, బొటనవ్రేలు నేలమీదరాస్తూ అన్నది :—

"రామూ, నిన్నొక్కటి అడుగుతాను చెప్పుతావా?"

"ఏమిటి?"

"ప్రేమ ఎక్కువా? స్నేహ మెక్కువా?"

"ఏమిప్రశ్న స్నేహ ! రెండు ఒకటేకదా!"

"అయితేభేదం లేదంటావా ?"

"కొంచమున్నదనుకో. ప్రేమలో స్నేహమున్నది. స్నేహంలో ప్రేమ వున్నది. కాని ప్రణయం లింగభేదం వల్ల ఏర్పడుతుంది. అది ప్రకృతితో సహకరించి భగవత్కార్యానికి తోడ్పడుతుంది. అందువల్ల స్నేహంకంటే ప్రేమే గొప్పది. నాస్నేహంలో రెండూమిళితమై వున్నాయి గనక ఆమె రెంటికంటే గొప్పది. రెంటికి అతీతమైంది కూడా !"

"అదిసరేగాని లింగభేదంవల్ల కలిగేప్రేమలో స్వార్థం వుందికదూ: "

"అవుననుకో. అయినా త్యాగాన్ని పురికొల్పడంలో ప్రేమకు పెట్టిందిపేరు కదా: "

"అయితే స్నేహం త్యాగాన్ని పురికొల్పదా? స్నేహం చేసే త్యాగం స్వార్థరహితంగనక ప్రేమకంటె స్నేహమే గొప్పదేమో: "

"స్నేహ, నేను మన పెళ్ళి విషయం మాట్లాడుతూ వుంటే ఇప్పుడు ఈ తర్క మీమాంసాలెందుకు ?"

"అదికాదు రాము. ఏదిగొప్పదైతే ఏంకాని, నేనిప్పుడు సంధిగ్ధావస్థలో పడ్డానురాము. నా మనసు పరిపరి విధాల పోతున్నది."

"ఏమిటిది స్నేహ?"

"రామూ" అన్నది. ఇకనోటివెంట మాట రాలేదు. జలజల కన్నీరు కారుతున్నది.

"ఏమిటిది స్నేహ? ఎందుకు ఏడుస్తున్నావు?" అన్నాడు రాము ఖంగారుగా.

"ఆ ! ఏమీలేదు....మనం పెళ్ళి మానుకోవాలి రాము! మనప్రేమ స్నేహంగానే వుండిపోవాలి. నాకు తెలుసు రాము నీవు నన్ను ఎంతగాఢంగా ప్రేమిస్తున్నావో అయినా ....అయినా ...నాకు హృదయం లేదనుకోకు రాము.... నేనుకృతఘ్నురాల ననుకోకు రాము...రామూ, రామూ, నన్ను క్షమిస్తావుకదూ! " అంటూ వలవల ఏడ్చింది స్నేహ. రాముకు ఇదేమి అర్థంకాలేదు. రాతి బొమ్మలాగ నిలువుండి పోయాడు. ఒకనిమిషం — అది నిమిషమా యుగమా ?—పోయాక అన్నది స్నేహ:—

"నీకు రాజ్యం తెలుసుకదూ : పాపం ఆమె జీవితమంతా దుఃఖమయం. ఆమెను ఒంటరిగా విడిచిపెట్టి నేను రాలేను రాము. "

స్నేహబంధం

"నా కేమీ అర్థం కావడంలేదు స్నేహ."

"బాల వితంతువైన నా స్నేహితురాలిని ఏకాకిగా వదిలివేసి నేను సుఖించలేను. రాము. నా హృదయం ఒప్పుకోడంలేదు."

"పిచ్చిపిల్లా, నీవు పెళ్ళి చేసుకోకుండా వున్నంత మాత్రాన నీ స్నేహితురాలి దుఃఖం ఎట్లా వుపశమిస్తుందో నా కర్థం కావడంలేదు. నీ ప్రేమ, నీ సుఖం, నీ జీవితం నాశనం చేసుకోవడం నీ స్నేహితురాలికి యిష్టమేనా స్నేహా?"

"ఏమో రాము. నేనామెతో నా వుద్దేశం చెప్పలేదు. కాని నా పెండ్లిమాట చెప్పినప్పుడామెముఖం విచారంతో నిండిపోయింది. మబ్బు కమ్మిన ఆకాశంలా అయిపోయింది. "నీవుకూడా లేకపోతే నా గతేమయి పోతుంది" అని ఆమె బాధపడ్డది రాము. ఆ బాధ నా మనస్సును చీల్చివేసింది రాము. బాలవితంతువగు, శోకజీవియగు నా స్నేహితురాలి కోసం నన్ను ఈ చిన్న త్యాగం చేయనియ్యి. రాము."

"ఇది చిన్న విషయంకాదు. స్నేహ. నీ జీవితం బలి చేస్తూ ఇంకొకరి జీవితాన్ని కూడా నాశనం చేస్తున్నావు."

"కావచ్చుకాని, ఆమె అబల అని శోకజీవి అని జ్ఞాపకముంచుకో, రాము" అంటూ ఆతని వొడిలో తలపెట్టి వెక్కి వెక్కి ఏడ్చింది స్నేహ. ఆమె తల నిమురుతూ రాము అన్నాడు. "ఇది నీవు చేయాలిసిందికాదు నామాట విను, దీనివల్ల ఎవరికి వుపయోగం లేకపోవడమే కాకుండా రెండు జీవితాలు నాశనమవుతాయి. బాగా ఆలోచించు, స్నేహ," ఆమె తలెత్తి అతన్ని చూస్తూ అంది.

"రామూ, నీవు నన్ను నిజంగా ప్రేమించే వాడివైతే నన్నీపనిని చేయనియ్యి, లోకంలో అన్నిటికన్నా గొప్పది స్నేహంకదూ!"

"రెండూ ఒకటే స్నేహ నీ విప్పుడు ఇద్దర్ని ప్రేమిస్తున్నావు. ఆ యిద్దరిలో జాతిపక్షపాతం చేత ఒకరికి మేలు చేయ్యాలని చూస్తున్నావు. కాని నీవు చేసేది అంత తెలివైన పనికాదు స్నేహ. ఒకవేళ రాజ్యం నిన్నంత ప్రేమించేదయితే నీ సుఖాన్ని చూచి సంతోషిస్తుంది కాని బాధ పడదు. అలా దుఃఖించే స్నేహితురాలి కోసం రెండు జీవితాల్ని నాశనం చేయడం తెలివైన పనికాదు, బాగా ఆలోచించు. స్నేహ."

"ఆలోచించుకున్నాను రాము. ఆమె ఏలాంటిదైనా ఆమె సుఖం కోసం నా స్నేహధర్మం నిలుపుకోతలచాను."

"స్నేహ. తొందర పడుతున్నావు. నేను లేనిది నీ వుండలేవు. నాప్రేమని నీప్రేమని ఇట్లా నాశనంచేయకు".

"అవును. నీవులేని లోకం నాకు శూన్యమే కాని నా స్నేహితురాలిలాగే నేను కూడా శూన్యంలోనే బ్రతుకుతాను. ఇప్పుడు నన్ను ఆపటానికి ప్రయత్నించకు రాము. నన్ను మరచిపో. ఇంకొక అమ్మాయిని పెళ్ళి చేసుకుని సుఖంగా వుండు. అదే నాకూ సుఖం". అంటూ స్నేహ అక్కడనుంచి వెళ్ళిపోయింది. రాము బరువు పాదాలతో వెళ్ళిపోయాడు. తిరిగి ఆమెకుకనబడలేదు.

ఆమె యిక ఆయింట్లో వుండలేక పోయింది. వేరే యిల్లు తీసుకుని అక్కడకువెళ్ళిపోయింది. మామూలుగా కాలేజికి వెళ్ళేది. మామూలుగా రాజ్యంతో మాట్లాడేది. మామూలుగానే అన్నీ జరుగుతున్నాయి. పరీక్షలువచ్చాయి అయిపోయినయి. రిజల్ట్సుకూడా వచ్చాయి. రాజ్యం ప్యాసయింది. స్నేహ ఫెయిలయింది, అయినా విచారించ లేదామె. "ఎవరికోసం" అని నిట్టూర్చింది. ఆమె లోలోపలే బాధపడేది, ఆమెలోనిబాధ ఆమెనుమంచాన్ని పడేటట్టు చేసింది. పనిమనిషి వచ్చి పక్క సరిచేస్తూ "ఇదేమిటమ్మా" అంటూ ఒక కవరిచ్చింది. చింపి చదివింది, రాజ్యం రాసింది.

"స్నేహ, నా కోసం నీవు చాలా శ్రమ పడ్డావు. నా కోసం నీ పెళ్ళికూడా మానుకున్నావు. నేనేమి చేసికూడా నీ రుణం తీర్చుకోలేను. నాకుతెలుసు కాని నీ ఆదర్శానికి నే నందలేను. మా పక్కింటి అబ్బాయి గోపాల్ నీకు తెలుసనుకుంటాను. అతను నన్ను ప్రేమిస్తున్నాడు. నేను కూడా అతన్ని ప్రేమిస్తున్నాను. నేను తెలివి తక్కువగా చేసిన చిన్న పొరపాటు కోసం నా స్నేహాని విడిచి పెట్టాలిసి వస్తున్నది. నేనతనితో వెళ్ళిపోతున్నాను. త్వరలో నేను మాతృస్థానం వహిస్తున్నానని చెప్పటానికి సిగ్గుపడుతున్నాను. నాకోసం విచారించకు నన్నుక్షమించు.

ఇట్లు రాజ్యం"

ఆమె కండ్లు తిరిగిపోయాయి. కొంచెంసేపు మౌనంగా వుండిపోయింది. తర్వాత బొంగురు గొంతుతో ఎంతపని చేశావు రాజ్యం! నీ కోసం నేను చేసిన త్యాగమంతా వృధా అయిపోయింది గదా!" తర్వాత రాము ఫోటో వంక ఆమెకళ్ళు మళ్ళాయి. "చూశావా, నా మాట వినలేదూనాడు" అన్నట్లు ఫోటోలోనుంచి రాము కళ్ళుపలికాయి.

"నన్ను క్షమించు రాము! నన్ను బంధించిన స్నేహబంధం ఆమెను బంధించలేక పోయింది."

మనలో మనమాట



గ్రహాలు - ఉపగ్రహాలు

శ్రీమతి కె. లక్ష్మీరఘురామ్

భూమిచుట్టూ తిరిగే కృత్రిమ ఉపగ్రహాలను సృష్టించడము విషయంలో అమెరికాను రష్యామించగలదనీ, అమెరికావారు సృష్టిద్దామనుకుంటున్న ఉపగ్రహాలకన్నా పెద్దగ్రహాలను వారికన్నా ముందుగానే రష్యా సృష్టించగలదనీ రష్యా అంతరగ్రహయాత్రాపరిశోధన సంఘము అధ్యక్షుడు ఆచార్య వి మోనిన్ సెదాన్ నేడు వెల్లడిచేశారని కోపెన్ హెగన్‌నుంచి పత్రికావార్త.

"రామస్కంధము హనుమంతము..." అని గొణుక్కుంటే ఏమైనా లాభముంటుందా?

మొన్నటిదాకా ఎవరు తొందరగా ఎంత ఎక్కువ ప్రమాదకరమైన బాంబులు చేస్తారని పోటీపడినట్లు ఒకరిని మించి మరిమయొకరు ఏటంబాంబులు, హైడ్రోజన్ బాంబులు తయారుచేశారు. శ్రీ నెహ్రూ ఐరోపా శాంతి దౌత్య పర్యటన పుణ్యమాయని మొన్న భయంకర అస్త్రములకు జెనివాలో తిలోదకాలు వదలినట్లు వార్తలు వస్తూనేవున్నవి. ఇంతలోనే ఈశుభవార్త — ఈగ్రహముల ఉత్పత్తి. ఏదో అస్త్రములకు స్వస్తిచెప్పారు, మరికొంతకాలమువరకు గుండెలమీద చేతులువేసుకుని హాయిగా నిద్రపోవచ్చునుకదా యని ఆశపడుతూ వుండగానే మళ్ళీ ఈరష్యా. ఈఅమెరికా గ్రహాల వుత్పత్తి. పోటీలో పడ్డ విషాదవార్త. ఈ దేశాల రెండింటికి దేంట్లోనో ఒకదాంట్లో పోటీ లేకుంటే తోచదల్లే వుంది. మరిలేకపోతే ఎందుకొచ్చిన ఈపోటీలు? కూటికా గుడ్డకా? "పనిలేని మంగలి...." అన్నట్లు.

వారిపాట్లు వారేదో పడతారు మనకెందుకని వూరుకోటానికి వీల్లేదే! మనము పుట్టకముందు ఎప్పుడు పుట్టించాడో బ్రహ్మగారు ఆ నవగ్రహాలని. వాటితోనే మనము సతమతమవుతున్నాముకదా? మరి ఈదేశాలవారు సృష్టించనున్న గ్రహాలతో ఏమిపాట్లు పడవలసియుండునో? నాకుమట్టుకు గ్రహాలంటే చాలాభయము. అందుకనే వీలున్నప్పుడెల్లా నవగ్రహపూజ చేస్తూనే వుంటాను. పైగా నవరత్న ఆభరణము సర్వకాల సర్వావస్థలయందు ధరిస్తూనే వుంటాను--పోతే ఒక్క నవరత్నకల్పఔషధాన్ని మాత్రము పథ్యము చేయవలసి వస్తుందనేమోనని సేవించలేదుగాని. మరిఅన్నివిధముల నవగ్రహాలని సుముఖులుగాచేసికొనేందుకు అష్టకష్టాలు పడ్డాను, పడనున్నాను. కానిఏవ్వంతైనా లాభము కనబడలేదు. ఈ నవగ్రహాలలో ముఖ్యమైన శనిగ్రహానికి ఎందుకనోగాని నేనంటే చాలామోజు. సాధారణంగా శనిగ్రహము ఏడుసంవత్సరములఆరునెలల కన్నా ఒక్కచోట నిలువదట. కాని శనిగారికి మన విషయములో అటువంటి నియమము వర్తింపచేయలేదు. నేనెరిగినప్పటి నుండి నావద్దేయున్నట్లు గుర్తు. మరీలాగు ఎంతమంది వద్ద తిష్టవేస్తున్నాడో! ఏదో ప్రస్తుతము ఒక శనే గనుక సరిపోయినది. రేపు అమెరికా రష్యా సృష్టించే గ్రహాలలో శనిగ్రహాలెన్ని ఉత్పత్తి కాగలవో? ఒక్క శనిగ్రహము నుండే తప్పించుకోలేక ముప్పుతిప్పలూ పడుతూవుంటే ఒక్క కొన్నిశనిగ్రహాలనుండీ (అందులో ఉపగ్రహాలు కూడాను) తప్పించుకునేవిధమేదో? శంభో! శరణు, శరణు.

గ్రహాలనుసృష్టించే బదులు మేరుపర్వతాలనీ పాలసముద్రాలనీ సంజీవి పుడకలనీ అమృత భాండాలనీ సృష్టించటానికి పోటీపడితే ఎంతబాగుంటుంది!

ఏమో అంతానాకు అగమ్యగోచరంగావుంటుంది ఈ మేధాసంపన్నుల క్రీడలు చూస్తూవుంటే అసలు ఈపోటీచేస్తూ ఉపగ్రహ సృష్టి చేయటంలో ఏమైనా చిదంబర రహస్యమున్నాదా అని. గ్రహాలకన్నా ఉపగ్రహాలలోఏమైన ఎక్కువ ఉపయోగాలు కాని విశేషాలు గాని ఉన్నవా? ఉపగ్రహాలు గ్రహాలకన్నా మేటులా? లేక సాటివేనా? ఏమో ఎవరికి తెలుసు!

మనలో మనమాట గ్రహాలకన్న ఉపగ్రహాలే.... .

కచేరీ చావడి

మగవారి హక్కులు

శ్రీ సుబ్బారావు శాస్త్రి

"ఓ.... శంకర్!"

"నమస్తే.... శాస్త్రీ!"

"నమస్తే:... చాలారోజులకి వచ్చారు."

"ఇప్పుడేవీలు అయిందండీ! .... ఏమిటో దీర్ఘంగా అలోచిస్తున్నారే?"

"ఏం.... లేదండీ!.... మాహక్కుల గురించి .. అలోచిస్తున్నాను."

"ఏమిటో మీహక్కులు?"

"ఏమున్నాయి?.... మీఆడవాళ్ళు చాలా అన్యాయంగా ప్రవర్తిస్తున్నారు"

"ఎమిటా.... అన్యాయం?"

"అసలు....మీలో చాలామంది మాపాట్లు. మాబాధల గురించీ ఆలోచించరు!... ఏవోకోర్కెలు కోరుతారు. ఎవరో పక్కింటావిడ సిల్కుచీర కొనుక్కుంటే మమ్మల్నీ కొనమంటారు. మాదగ్గఱ అంతడబ్బు యెలా వస్తుందీ?"

"నిజమే! భార్యల కోర్కెలు తీర్చడం భర్తలమీద ఆధారపడిందికదూ! మీరుతీర్చకుంటే వాళ్ళకోర్కెలు యింకెవరు తీరుస్తారు?"

"మామూలు మధ్యతరగతివాడు.... సిల్కుచీర ఎలా తెస్తాడు? అది తీసుకురాకపోగానే.... రుసరుసలు బుస బుసలు ...! ఈ ఆడవాళ్ళతో ఎలా వేగడం?"

"అలాంటివారు వున్నారు. నేను ఒప్పుకుంటాను! వాళ్ళు భర్తలగురించి. వారిబాధలగురించి ఆలోచించాలి సాధ్యమైనంత వరకు మీరుకూడా వాళ్ళకోర్కెలు తీర్చాలి!"

"తీరుస్తామండీ! ... వాళ్ళు యేమయినాఅంటే గభాలు పుట్టింటికి వెళ్ళిపోతామంటారు! భార్యపుట్టింటికిపోతే భర్త పడేపాట్లు ఆలోచించండి!"

"అవును! అలావెళ్ళడం అన్యాయమే!.... నేను కొందరు మగవార్ని చూశాను!.... వారుభార్యని వీధిలోకయినా పంపరు! గుమ్మంలో నుంచుంటే కసిరికొడ్తారు! నెలకొకసారయినా ఆడవార్ని సినిమాకో, బజారుకో తీసుకవెళ్ళడం అదీ వుండాలి!"

"నిజం! అటువంటి మూకూర్ఖులుడా మాలోవున్నారు. అన్నీ వెధవ అనుమానాలే! కాని....ప్రతివారం వచ్చిన సినిమాకల్లా ఎలాతీసుకు వెడుతారండీ? సినిమాకి పంప లేదని పుట్టింటికి వెళ్ళినవార్ని నేనుచూశాను!"

"సినిమాకి భర్తకి చెప్పకుండా వెళ్ళిందని ...పుట్టింటికి పంపివేసిన మగవార్ని నేను చూపిస్తాను."

"ఒప్పుకుంటాను శంకర్!....మీ ఆడవాళ్లు కూడా.... కొంచెం భర్తలదగ్గర అణిగి మణిగి వుండాలి!....భార్యల కోర్కెలుతీర్చడానికి మగవారుప్రయత్నించాలి! మీతప్పులు మీరు....మాతప్పులు మేమూ దిద్దుకోవాలి!"

"బాగా అన్నారు! ప్రతిదానికి బార్యమీద విసుక్కో కూడదు. ఎవరయినా అందమయిన పిల్లనిచూసి, భార్యని చూసి అసహ్యించుకోడం ఆ అందని ద్రాక్ష గుత్తికోసం ఎగరడం తగదు....!"

"అవు నవును!....ప్లీడర్గారిభార్య చంద్రహారం చేయించుకుంటే, గుమస్తాగారిభార్యకూడా అది కోరడం మంచిది కాదు. ఎవరిదోష వారిదే! మన మెంతో అంతలోవుండాలి!"

"ఆబ్బో...! చాలా టైమ్ అయింది!....మళ్లి కలుసుకుందాం!"

"అవును ...నేను కూడా....వూళ్ళోకి వెళ్లాలి!"

"వస్తా....నమస్తే!"

"నమస్తే!!"

శాశ్వత విముక్తి

శ్రీమతి "లీల"

మంజువాణి పేరుమోసిన నర్తకి. కాలికిగజ్జకడితే పాషాణాలు కరుగుతాయ్. హృదయాలు ద్రవిస్తాయ్. లేళ్ళు నృత్యం చేస్తాయ్. ఎండినకొమ్మలు చిగురిస్తాయ్.

గాఢంగా ప్రేమించింది విక్రముణ్ణి. ఇద్దరూ విడదీయ లేని జంట. దీప కాంతులు, పుష్పపరిమళాలు. ఎన్నో శరద్రాత్రి వెన్నెలలు స్వర్గానందంలో గడచిపోయేయ్. శరీరాలు రెండు. హృదయం మనస్సు ఒక్కటే!

ఆరోజు విజయవర్మ మహారాజు పుట్టినరోజు. మంజువాణి నృత్యము. విజయవర్మ ముందు ఆమె గజ్జకట్టడం అదే మొదటిసారి. నాట్యశాలంతా ప్రేక్షకులతో కిక్కిరిసి పోయింది. తెరలేచింది. మంజువాణి ప్రవేశించింది. కిన్నెర గొంతుక, గజ్జెలఘణఘణలు, అమోఘ అద్భుతనృత్యం. సభికులు నిశ్చేష్టతజెందారు మహారాజు నివ్వెరబోయాడు.

ఎవ్వరీనర్తకి? మానవమాత్రురాలుకాదేమో? అద్భుత నృత్యం. అమృత సౌందర్యరాశి, సమ్మోహ నాస్త్రముల పుట్ట. ఎందరో రమలు ఒకటై ఈమెలో మేళవించారా?

సభలోని నేత్రద్వయాలన్నీ మంజువాణిపై కేంద్రీక రింపబడ్డాయి. తెరవ్రాలింది. సభికులకు చలనం కలిగింది. పొగడ్తలకు మేరలేదు.

ఆరాత్రి మహారాజుకు నిద్రపట్టలేదు. మంజువాణి లేని ప్రాసాదం వెన్నెలలేని శరద్రాత్రి. తావిలేని పుష్పం.

మర్నాడు మంజువాణి ప్రాసాదంలోబందీ. మహారాజు ఆజ్ఞ. ఎదిరించలేక పోయింది. చేసేదేముంది.

అంతఃపురంలో అన్నీ ఉన్నాయ్. వేటికి లోపంలేదు. పిలిస్తే పలికే దాసీజనం వందలలో. కాని ఏం ఆనందం.

మంజువాణి విగ్రహం అంతఃపురంలో. మనస్సు విక్రముని మీద. ఎన్నోశరద్రాత్రులు కన్నీటితో గడిపింది. హృదయం కుమిలిపోయింది. కానిరాజాజ్ఞ, అధికారుల బలంవలన నిర్బంధం.

విక్రమునికి పిచ్చెక్కినట్లయింది. మంజువాణిలేని జీవితంవ్యర్థం. పట్టణంవదలాడు, ఎన్నోఊర్లు తిరిగాడు. కాని శాంతి లభించలేదు. మనసుకు లభించలేదు నిలకడ. మంజువాణిని మరువలేక పోయాడు. మరలావచ్చాడు.

విక్రముడుఇక ఓర్చుకోలేక పోయాడు. మహార్నవమి అర్థరాత్రి. ధైర్యంతో తెగించాడు. కోటప్రాకారందాటాడు. రాజాంతఃపురము ప్రవేశించాడు. అంతఃపురమంతా గాలించాడు. ఒకచోట హంసతూలికా తల్పంమీద మంజువాణి గాఢనిద్ర. చెక్కిళ్ళమీద కన్నీటి చారలు. విక్రముడు కుమిలిపోయాడు. గాఢాలింగనము చేసుకొన్నాడు. మంజువాణి అదరిపడింది, చూస్తేప్రియుడు! అబ్బ! ఎంతసాహసం! కత్తులబోను. రాజుచూస్తే! అమ్మో! ఇంకేమైనా ఉందా!

ప్రియుని బతిమలాడింది వెళ్ళిపొమ్మని. విక్రముడు వెళ్ళలేక పోయాడు. తిరిగిరేపు కలుసుకుంటానంది. విక్రముడు బయలుదేరాడు. విక్రమునిమనసులో వివిధ ఊహలు. రేపుసాయంత్రం విజయదశమి, తను, వాణి హాయిగా వెన్నెట్లో ఎక్కడో ఎదోతెలియని ఆనందంలో.

మనస్సు ఇక్కడలేదు. రాజప్రాసాదమని మరచాడు. అంతే! మరోనిముషంలో రాజభటులు బంధించారు. అర్థరాత్రి అంతఃపురంలో పరపురుషుడు. ఎంతఘోరం?

మర్నాడు విచారణ. విజయవర్మ నేత్రాలు కోపాగ్ని కణాలు. మంజువాణి తప్పుతనదంది. విక్రముడు తన్ను దండించమన్నాడు. రాజుమండి పడ్డాడు. ఎంతపని చేసింది మంజువాణి? ఎంతకు తెగించాడు విక్రముడు?

ఇద్దరికి సాయంత్రం ఉరిశిక్ష. కలలు కల్లలు. మేడలు కూలాయ్. పట్టణమంతా పండుగ, విజయదశమి పర్వదినం, సాయంత్రం ఇద్దరిని ఊరంతా ఊరేగించారు. ఉరికంబం ఎక్కించారు. ప్రజలందరూ కన్నీరుకార్చారు! రాజుహృదయం లొంగుతుందా రాజాజ్ఞనాపేదానికెవరర్హులు.

ఉరిత్రాడును ప్రేమత్రాడుగా స్వీకరించిం దాజంట. రాజుమనసు మారలేదు. ప్రజ కళ్ళు మూసుకొంది నిరంకుశాధికార పాపాన్ని చూడలేక. ఈఘోరం చూడలేక సూర్య భగవానుడుకూడా పశ్చిమాద్రి చాటుకు పోయే దానికి ఉద్రిక్తుడయ్యాడు.

అంతే! రెండు పవిత్ర నిండు ప్రాణాలు ఈలోకాన్ని వదలి వేశాయ్. వారిద్దరూ మరోలోకంలోనైనా కలుసు కుంటారో లేదో!

★

అన్ని నొప్పులకు

అమృతాంజనము

60

సంవత్సరముల
సేవచే
పేరొందినది!



అమృతాంజన్ లిమిటెడ్
మద్రాసు.
బొంబాయి
కలకత్తా

★ క్షమ ★

శ్రీమతి "చిన్నా"

ఎవరుతల్లీ నీవు ? కన్నీరుకారుస్తూ ? ఎంతకాలమని. అట్లా ? దిగమింగుకోవలసిన దుఃఖమా నీది? పరవాలేదు. నాదగ్గర చెప్పుకోవచ్చు. అభిమానం నోరు పెగలనివ్వదు నిజమే ! నేనూ ఎరుగుదు నీ బాధ. అనుభవించానుగూడా. అనుభవిస్తున్నానింకా. ఇంకా ఎంతకాలం అనుభవిస్తానో చెప్పలేనుకూడా. ఆహా ! చెప్పలేకేం ? బ్రతికినంత కాలమూ అనుభవించవలసిన దుఃఖమునాది. పెదవి దాటి బయటికి రాకూడని దుఃఖం బావురుమని ఏడ్చుటకుగూడా నోచుకోని దుఃఖం. లోకములో ఎన్ని రకముల దుఃఖాలు లేవూ ? అన్నింటిలో ఇదొకటీ ? ఇది అనుభవించేవంతు నాకొచ్చింది. నిజమే ! లోకంలో ఆకలి ఉంది. దానిని అనుభవించేవంతు కొందరికి మాత్రమే. ఆకలి ఏం మహా భాగ్యంకాదు. బాధ. అది ఈ రూపములో 'ఉన్నదనిగాని ఈ దేహం వదలకుండా పోతుందనికాని చెప్పలేం. ఆకలిబాధ చెప్పుకున్నకొలదీ పెరిగిపొయ్యేబాధ. అజీర్ణ రోగులకు పరమ ఔషధము ఈ బాధ. అమ్మా ఆకలి యని అరచి చెప్పుకోవచ్చును ఆకలిబాధ. అంత దారుణమైన ఆకలిబాధలో కూడా కొన్ని సుగుణాలు ఉన్నవి. మరి నే పడే బాధకు ఏమైనా తప్పించుకొనే రహదారులు ఉండపోతాయా ? అని నాలుగు దిక్కులా వెదికాను. వెదుకుతున్నాను. నేను ఆశా జీవిని ప్రాణమున్నంత వరకూ వెతుకుతూనే ఉంటాను. అప్పుడప్పు డనిపిస్తుంది. ఈ వెదుకుటయే నా బాధ మరచిపోడానికి ఓపెద్ద రహదారి యేమో ! అమ్మా ! దుఃఖంతో బరువెక్కిన నీ కనురెప్పలు పైకెత్తటానికి ప్రయత్నించుతల్లీ ! నిన్నేమని పిలవను ? చెల్లీ అని నోరారా పిలుచుకోవాలనుంది. మనం యిద్దరము ఒకమాదిరి దుఃఖసముద్రం ఈదుతున్నాం, లేదు కొట్టుకుంటున్నాం. అది సరిగాదు. నేను మాత్రం కొట్టుకుంటున్నాను. నీవు కదలుటయేలేదు. అలాంటిప్రయత్నమైనా చేయటంలేదు నీవు. ఎవరునీవు ? ఎందుకిట్లా ? అయ్యో ! క్షమించు ! తల్లీ ! తెలివితక్కువ ప్రశ్న వేస్తున్నందుకు క్షమిస్తావుకదూ ! క్షమాదేవివి నీవు. నీకీపేరు ఎంతో తగివుంది. నిన్ను ఈపేరుతోనే పిలుస్తాను. క్షమాదేవీ ! నా మాట విను. చేతనా సహజముగు ప్రకృతిలో పుట్టాం. నదులూ, పర్వతాలూ, అరణ్యాలూ, పట్టణాలూ, మానవులూ, జంతువులు పక్షులు క్రిమికీటకాలు సమస్తమూ చలనముగలిగి ఉన్నవి. దుఃఖానికీ చలనముండదు ! ఉంటుంది. తప్పక ఉంటుంది. తల్లీ ఎంతకూ మాట్లాడవు. నీకు నమ్మకము లేదుకదూ. నిజం చెపుతున్నాను. నాకు మాత్రం నమ్మిక ఎక్కడుందీ ? లోకానికి మార్పు సహజము. నేను ఆశాజీవిని. అందుకని చెపుతున్నాను. ఇంతటి దుఃఖానికీ అంతం ఉండవచ్చును తల్లీ. ఎప్పుడూ ? ఎలాగ ? "బ్రతుకులు ముగిసినప్పుడు మిగిలిన శూన్యంలా" ఆఁ ఆఁ ఏమిటీ ? మీరే అంటున్నారా ఈమాటలు ? కాదు. కాదు. మీరు కదలనైనాలేదు. నేనే. నాలోంచే ఈమాటలు ! ఆశాజీవిలోంచే ఈమాటలు ! ఎంతటి నిరాశ ఈ మాటల్లో ! ఒంటరితనంలోని స్తబ్దత్వం ఈ మాటల్లో గూడుకట్టింది. అమ్మా ! అమ్మా ! ఇటుచూడు తల్లీ ! క్షమించుచెల్లీ ! సర్వత్రా చైతన్యము. ఆరాధించేనేను. రాయిలా నల్లరాయిలా. అంతకన్నా కఠినంగా నిరాశగా ఇట్లా అయ్యానని ఇంత వరకూ నాకు తెలియనేలేదు. క్షమాదేవీ ! నీవుసాక్షాత్తు క్షమాదేవివి. కేవలము స్త్రీవి. పతిగతప్రాణానివి. భారత మాతకు పుత్రివి. అబలవు. నీపతిబలమును నమ్మి బ్రతుకువానవు. హిందూ స్త్రీవి. స్త్రీ అంటే శక్తిస్వరూప మనే ఇదివరకు తెలుసుకున్నాను. క్షమామూర్తులు స్త్రీలే అని ఇప్పుడు తెలిసింది. క్షమాదేవీ ! నీ భర్తను, నీ ప్రాణాన్ని, నీప్రాణాధికాన్ని పరస్త్రీలకప్పగించి పెదవి మెదపకుండా దుఃఖం తెలియనీయకుండా నిశ్శబ్దంగా ఊపిరి పీలుస్తూ దినాలు వెళ్ళదీయగలశక్తి ఎవరిచ్చారమ్మా నీకు ? స్త్రీ శక్తి రూపిణి. ఈ శక్తి నీదే అంటున్నావా ? తల్లీ ! ఏ ఆశా లేకుండానే బ్రతుకెట్లా నిలుపుకోగలుగుతున్నావు తల్లీ ! ఏమిటీ యోచిస్తున్నావు. ఏమో అనుకుంటున్నావు. అంతా ఒక్కత్రుటి. కదలబోయి అగిపోయింది తల్లి ! దుఃఖంలో మరగిపోతున్నది. పొంగురాకుండా ఆపాలంటే తరమా ! ఎప్పుడో పొంగిపోతుంది తప్పదు. ఎప్పుడో ఏమిటీ ? ఇప్పుడేనేమో !

తల్లీ ! తల్లీ ! ఏమిటి ఇదంతా ఈ ఎరుపులు ఈ రక్తవర్ణము ఎక్కడినుంచి లోకమంతా జీవలోకమంతా నిండి ఇంకా ఎక్కడికో దూసుకుపోతున్నది. తెల్లని స్ఫటికములాంటి నీ దేహము రక్తము చిందుతున్నది,

మల్లెపూవుల మరిపించే సుకుమార ధావళ్యమైన నీతనువు కాలుతున్న ఇనుములా మారుతున్నదేమితల్లీ. క్షమాదేవీ! నీవేనా ఇదంతా. ఏమిటో అంటున్నావు. "స్త్రీలు, ముఖ్యంగా ఒకే భర్తతో బ్రతుకదలచుకొన్న స్త్రీలు, విశేషంగా భారతదేశంలో, భర్త చాటున మనదలచిన స్త్రీలు, క్షమాదేవులు కాకతప్పదు. అంటున్నావా? తల్లీ! లేదు నీవేమీ అనడంలేదు. ఈమాటలుకూడా నాలోనించే వినపడుతున్నాయి. నిజం నీలో కనపడుతున్నది. నా లోంచి వినబడుతున్నది. అంతేనా! నిజం అంతేనా! కన్నతల్లీ, క్షమాదేవీ నామాట మన్నించుతల్లీ! దుఃఖంలో బరువెక్కిన, కాగికాగి ఎరుపెక్కిన నీ కన్నులొకసారి నావంక ఎత్తిచూడు తల్లి! తల్లి ఏమో అంటున్నది! చూసి చేసేదేమీ లేదనా! క్షమాదేవీ ఏమో అంటున్నావు నీవే! ఈమాటలు తప్పక నీవు మాత్రమే అనగలిగిన మాటలు స్త్రీలలో! ఏమిటీ అంటున్నావు? లోకంకోసం, నీతోడి స్త్రీలోకంకోసం, కాదు కాదు. అనాధలయొక్క అత్యాశాపరులయొక్క స్వార్థంకోసం కులస్త్రీలు ధనం, ప్రాణం, నవ్వుతూ అర్పించాలా? అందుకని క్షమాదేవతని ఆశ్రయించారా? కులస్త్రీలంతా? క్షమా దేవతలు! ఇదే నీ జవాబా తల్లీ? ఇదే నీ సందేశమా మాకు తల్లీ! తల్లీ! శిల అరిగినట్లు, లోహం కరగినట్లు కఠినంగా మారిన నీ దేహం మళ్ళీ కరిగిపోతున్నదితల్లీ! ఎరుపెక్కిన నీతనూకాంతిలో నీలిరంగులెక్కడినుంచో! పురుషుల్లో ప్రాధాన్యంలేదా? జగాన్ని భుజాలమోయు పురుషులకు అంగరక్షకై నిలచినవారికి సగం ప్రపంచం నిండినవారికీ నీ కటాక్షమిస్తున్నావా తల్లీ!

ఆ(నీవన్నది సరిగా వినబడలేదే. కులసతులందో, పరసతులందో, పడుపువృత్తితో పొట్టపోసుకొను పణ్య స్త్రీలయందో, ధనమూ, బలమూ ధారపోయుటయే పురుషుల పుట్టుక ఫలమంటావా? సత్యం ఇంతేనాతల్లీ! ప్రత్యేకత పురుష జన్మలది కానేకాదా? తల్లీ! తల్లీ! ఏమైపోతివితల్లీ. ఎందుకు కనపడవేమో చెల్లీ! కరిగిపోయి కరిగిపోయి అరుణోదయంలో కలిసిపోతివా క్షమా ధరిత్రీ! నేనూ, ఆశా, చిరంజీవులమా!

చేబదులు

శ్రీ దాసరి వెంకటకృష్ణయ్య

"ఏమండీ! ఓ ఐదురూపాయిలుంటే బదులివ్వండీ — వారు వూళ్ళోలేరు రాగానే తీసికొనియిస్తాను" అంటూంటారు సాధారణంగా మనయిరుగు పొరుగు ఆడవారు. ఈ బదులు తీసికోటం చాలా దురభ్యాసం. కొన్ని కొన్ని అలవాట్లు చెడ్డలవాట్లు అని తెలిసికూడ తిరిగి ఆ రొచ్చులో దిగబడతాం. చేబదులు తీసుకోటంఅనేది ఎంతోసామాన్య విషయమైనప్పటికీ అది త్రాగుడుకంటేగూడ ముమ్మందు చెడ్డ వ్యసనమౌతుంది. క్రమేణా అప్పులు చేస్తారు. ఈ అప్పు కొద్దికొద్ది మొత్తాల్లో బయలుదేరి చివరికి చావునాకీ కింద పరిణమిస్తుంది. వడ్డీకి వడ్డీ పెరిగి కాపురాల్నే కబళిస్తుంది.

ఏ దురభ్యాసమైనాసరే చేజేతులా చేసుకోవాలని ఎవరికీవుండదు. ఉదాహరణకు చూడండీ సిగరెట్టు, నల్లమందు ముక్కుపొడి, సారాయి, కాఫీ యిత్యాదులు కాస్త మొదట్లో రుచిచూట్టము; తర్వాత అలవాటులోకిదిగి దిన కృత్యాల్లో ఒకటిగా తయారవుతుంది. దాన్నించి బైటపడాలన్నా వీలుండదు ఇంతెందుకు ఓనమాలు దిద్దుకుంటున్న పిల్లవాణ్ణి చూడండి. "ఒకసారి నీ బలపం ముక్కయిస్తావూ" అని అడుగుతూంటాడు. ఈ విధంగా చేబదులు అనే జాడ్యం ప్రతివారిలోనూ పాతుకుపోయింది.

ఆఫీసునుంచి వస్తూవస్తూ బజారులో ఏదైనా కంటికి యింపుగా కనిపిస్తేసరి అది అవుసరం లేకపోయినా సరే డబ్బు లేకపోతేనూ. లేక తక్కువైతేనూ ఎవరైనా స్నేహితుణ్ణి అడిగి "యింటికి పోగానేయిస్తాను" అని చేబదులు తీసి కొంటూంటారు. ఇంకొక రకంవారున్నారు. చేతిలో పదిరూపాయిలు సయితం వుంచుకొని, ఎవరికైనా ఒక పావలో, అర్ధో యివ్వాల్సి వస్తే నోటుమార్చకుండా పక్కవార్ని అడిగి తీసుకొని యిస్తూంటారు. ఇలా ఒకటి రెండుసార్లు చేబదులు తీసికోటంవల్ల ప్రతివస్తువా బదులు తీసికోటానికి బుద్ధిపుడుతుంది. చేబదులు తీసికొంటం తిరిగి యివ్వరనికాదు. పుచ్చుకునేప్పు డున్న తొందర తిరిగి యిచ్చేప్పుడుండదు. ఒక్కొక్కసారి ఏదో అశ్రద్ధవల్ల మరచిపోవడం కూడా కద్దు.

ఇకదీంతో వారికీవీరికీ వైరం ఈవైరంచివరికి "వారికీ వీరికీ మాటల్లేవండీ" అనేదాకా పోతుంది. ఇంతకీ అసలు విషయం వడ్లగింజలో బియ్యపుగింజ. సాధారణంగా మన యిళ్ళల్లో స్త్రీలకు పిండి రుబ్బుకోటానికి పాత్రం యివ్వలేదనో లేక పెరుగు తోడెయ్యడానికి మజ్జిగ చుక్క యివ్వలేదనో ఏదో యిలాంటి స్వల్ప విషయాల దగ్గర గిల్లి జగడం ప్రారంభమవుతుంది. ఈ రకంవారికి బదులు తెచ్చిన డబ్బుకాని, వస్తువుకాని తిరిగి యివ్వాలన్న ఆలోచనే వుండదు. అసలీ చేబదులు అడగడానికికారణం. తమకు వచ్చే జీతానికి మించి ఖర్చుచేయటం. ఖర్చులు కూడ తమ తాహతుకు మించి చేయకూడదు. ఇలా చేయటంవల్లే నెలొచ్చేసరికి అక్కడక్కడా అప్పులు చేయటం పడుతుంది. అనుకోకుండా వచ్చే రోగాలకీ, ప్రయాణాలకీ ఘనంగా ఖర్చుపెట్టి గొప్పవారని పించుకుంటే తరువాత చిక్కన పడేదివారే. రోజు గడవడం దుర్ఘటమౌతుంది. అయ్యగారికి సూట్లు వగైరా, అమ్మగారికి జరీపట్టుచీరెలు; మొదట స్నేహితుల్తో కాఫీహోటలు బిల్లులవరకూ అన్నీ అప్పులే. బట్టలకొట్లోఅప్పే. కాఫీహోటల్లో అప్పే. ఇక దీనికితోడు త్రాగుడు అలవాటైతె చెప్పేదేమిటి ..? అప్పు చేసైనాసరే నిప్పంటి సారాయి త్రాగాలంటారు. ఈ అప్పులన్నీ పెరిగి చివరికి తీర్చలేక ఐ. పీలు, ఆత్మహత్యలూ చేస్తుంటారు

"చేబదులు" లాంటిదే "అరువు" గూడ. ఏదైనా బట్టలు, నగలు మొదలైనవి తీసికొని తిరిగి యివ్వడానికి అరువు అంటారు. పెళ్ళిళ్ళలో పోట్లాటలకు కారణం ఈ అరువుసొమ్మే. పెండ్లిఅయాక పెట్టిననగలు అప్పటికప్పుడే తీసుకోగానే మిగతావారు ఏదోవిధంగా తమకోపం ప్రకటిస్తారు. ఇంకా ముదిర్తే "మీ పిల్లని తీసుకుపొండి; మా అబ్బాయికి యిక పెళ్ళేకాదా?" అంటారు. అంతటితో ఆ పెళ్ళి ఆఖరు. ఆ పిల్ల వీరి కవసరం అంతకంటేలేదు. ఈ విధంగా మన సంఘంలో పీటలమీద పెళ్ళిళ్ళు చెడిపోతున్నయ్.

చేబదులు యిచ్చేవారుగూడ తాము యివ్వడం ఒక దురభ్యాసమని గుర్తిస్తే కొంత వరకూ యీ సమస్య మాసిపోతుంది. సాధ్యమైనంతవరకు చేబదులుయివ్వడం మానుకోవాలి. అంత్యనిష్ఠూరంకన్నా ఆదినిష్ఠూరం మేలు కదూ! ఇక మొహమాటంవల్ల, మిత్రత్వంవల్ల బదులు అడిగినప్పుడు లేదని నిరాకరించలేము. ఇలా బదులివ్వడంలో సహాయం. పరోపకారం లేదనను. నిజంగా స్నేహితులైనవారు ఆపదలో వుంటే ఆదుకోవాల్సిందే. కానీ, యిచ్చేటప్పుడు అదిమనకు తిరిగి వస్తుందనే ఆశ లేకుండా యివ్వడం మంచిది. అసలు చేబదులుకు పోకుండావుండి తమసంపాదన కనుగుణ్యంగాఖర్చుచేసుకోవటం ప్రతివారూ పెద్దలూ, పిన్నలూ అలవర్చుకోవడంవుచితం.

తెలుగు సామెతలు

శ్రీమతి గు. వెంకుబాయమ్మ

1. బావి లోతు చూడ వచ్చుకాని మనసులోతు చూడ లేము.
2. బుర్రకొక గుణము, జిహ్వకొక రుచి.
3. బొంకరా బొంకరా పోలిగా యంటే, టంగుటూరు మిరియాలుతాటి కాయలంతేసి అన్నాడట.
4. బావా నీభార్య ముండామోసిందోయీ అంటే, మొఱ్ఱోమని ఏడ్చేడట
5. ప్రత్తిగింజలు తింటావా బసవన్నాయంటే ఆహా ! అన్నాడట
   గంత కట్టనా బసవన్నాయంటే ఊహు ! అన్నాడట
6. పనిలేనిమంగలి పిల్లి తల గొరిగాడట
7. పాడు వూళ్ళో పొగిడే వాళ్లులేరు, నాకు నేనే పొగుడుకుంటా నందిట
8. పులిని చూచి నక్క వాతపెట్టు కున్నట్లు
9. ధైర్యములేని రాజు, యోజనలేని మంత్రి
10. నాకోడి, కుంపటిలేక పోతే ఎట్లా తెల్ల వారుతుందో చూస్తా నందట
11. నిలుచుటకు జాగా దొరుకుతే కూర్చోడానికి అప్పుడే దొరుకుతుంది
12. దాగపోయినచోట్ల దయ్యాలు పట్టి నట్లు
13. దున్నేరోజులలో దేశము మీదకు పోయి, కోసే రోజులలో కొడవలి పట్టుకు వచ్చాడట
14. జిల్లేడు చెట్టున పారిజాతము పూయునా ? .
15. తన కంపు తన కింపు, పరుల కంపు ఓకరింపు.
16. తనచెయ్యి కాలుతుందని సవతి బిడ్డ చేతితో కలయబెట్టిన దట
17. తల్లి కడుపుతడుమును, భార్య జేబుతడుమును.
18. తల్లిదైవము, తండ్రి ధనము
19. తాటాకు చప్పుళ్లకు కుందేళ్ళు బెదరునా ?
20. తాను మ్రింగేది తనను మ్రింగేది తెలుసుకోవాలి
21. తాలిమి తన్నూకాచును, ఎదిరినీ కాచును:
22. చేసేవి శివపూజలు-చెప్పేవి అబద్ధాలు.
23. వేడి నీళ్లకు ఓర్వలేనమ్మ సహగమనం చేస్తా నందిట

సంక్షేమం



ఆంధ్ర మహిళా సభ ప్రాజెక్టు

శ్రీమతి జరీనా కరీమ్‌భాయ్‌గారి రాక



ఈనెల 17 వ తేదీ శనివారం మధ్యాహ్నము కేంద్ర సమాజ కల్యాణబోర్డు మెంబరైన శ్రీమతి జరీనా కరీమ్‌భాయ్‌గారు సూళ్లూరు పేట తాలుకాలో ఆంధ్రమహిళా సభ ప్రాజెక్టు కమిటీవారిచే నడుపబడుచున్న కేంద్రములను చూచుటకు వచ్చిరి. ప్రాజెక్టు కన్వీనరు శ్రీమతి న్యాయపతి కామేశ్వరమ్మగారు, కమిటీ మెంబర్లు శ్రీమతులు కస్తూరి రుక్మిణమ్మ, గజ్జెల లీలగార్లు, తడ బాలానంద కేంద్రము వద్ద వారికి స్వాగతమిచ్చిరి. ఆంధ్రాస్టేటు బోర్డుమెంబర్లయిన శ్రీ న్యాయపతి రాఘవరావుగారు, శ్రీమతి కడప రామసుబ్బమ్మగారుకూడా కేంద్రములనుచూచుటకువచ్చిరి.

శ్రీమతి లక్ష్మీనరసమ్మగారు, కేంద్రములోవున్న గ్రంథాలయము, ఆటవస్తువులు పిల్లలకేకాక, స్త్రీలకు కూడా ఎంతో ఉపయోగపడుచున్నవని చెప్పిరి. పిల్లల పాటలు, పద్యాలు, లెజీమ్సుతో నృత్య ప్రదర్శనమును చూచి, శ్రీమతి కరీమ్‌భాయ్‌గారు చాలా సంతోషించిరి.

తరువాత చేనిగుంట ప్రసూతి కేంద్రమునకురాగా, అక్కడ కమిటీ మెంబర్లయిన శ్రీ మునిరామరెడ్డిగారు (పంచాయితీబోర్డు ప్రెసిడెంటు), శ్రీ చెంగారెడ్డిగారు, మొ॥ గ్రామ పెద్దలు, స్త్రీలు, బాలబాలికలు స్వాగత మిచ్చిరి.

శ్రీమతి కరీమ్‌భాయ్‌గారు యీ కేంద్రములను చూచిన పిదప, తడ రేవుస్థలమునకువచ్చి, పులికాట్ సరస్సులో దూరముగానున్న ఇరకం, వేనాడు ద్వీపములకుపోవు నాటుపడవలను చూచిరి. ఆ కేంద్రములతో ఎన్నోవందల సంవత్సరములనుంచి, గర్భవతులకు ఎట్టి సౌకర్యములు లేవని, ఇన్నాళ్ళకు ఆంధ్రమహిళా ప్రాజెక్టు కమిటీవారిచే ఏర్పాటు చేయబడిన కేంద్రములవలన, వారికష్టాలు గట్టెక్కెనని, ద్వీప గ్రామవాసులగు శ్రీ రాజా మొఎలి, శ్రీ జి. ఆర్. కన్నయ్యనాయుడుగార్లు చెప్పిరి.

ఆంధ్రమహిళా సభ ప్రాజెక్టు కమిటీవారు చేయుచున్న కృషిని చాలా ప్రశంసించి, ఇట్టి కేంద్రములలో 5 సం॥ లోపు పిల్లలకు ఒక శిశువిహార్ (బాల్‌వాడీ) కూడా పెట్టినయెడల బాగుండునని సలహా ఇచ్చిరి. —

భారత సేవక సమాజము - మహిళా శాఖ

గుంటూరు.

గుంటూరులో భారత సేవక సమాజపు మహిళాశాఖ వారు కాన్సరు నిరోధక ప్రచారము చేయ నిర్ణయించి, దానికి శ్రీమతి కందాపాపాయమ్మ భీమశంకరం అధ్యక్షులుగాను, శ్రీమతులు డి. లక్ష్మీజగన్నాథరెడ్డి, జానకీ భూవాల్కా, మద్ది సుందరమ్మ సుదర్శనం, పరుచూరి అన్నపూర్ణమ్మగార్లు ఉపాధ్యక్షులుగాను శ్రీమతులు అమ్మాజీయమ్మ, ఆవుల జయప్రద సాంబశివరావుగార్లు కార్యదర్శులుగాను, శ్రీ డాక్టరు పరుచూరి వీరయ్య చౌదరిగారు ఎక్స్ అఫీషియో కార్యదర్శిగాను కార్య నిర్వాహక వర్గమును ఏర్పాటు చేసియున్నారు. పై సంఘ ప్రారంభోత్సవము 19-9-55 న ఏ. సి. కాలేజీహాలులో ముఖ్యమంత్రి శ్రీ బెజవాడ గోపాలరెడ్డిగారి అధ్యక్షతను ఆరోగ్యశాఖామంత్రి శ్రీ కళావెంకట్రావు, ఆంధ్రా మెడికల్ సర్వీసెసు డైరెక్టరు శ్రీ కె. ఎన్. రావుగార్ల సమక్షములో జరిగినది.

డాక్టరు పరుచూరి వీరయ్యచౌదరిగారు మాట్లాడుతూ, "అసలు కాన్సరు అంటేఏమిటి? దానినేవిధంగా నిరోధించాలి" అనే విషయాన్ని విపులంగా తెలియపరచారు. శ్రీ కళావెంకట్రావుగారు మాట్లాడుతూ ప్రజలుకూడా స్త్రీ పురుష వ్యత్యాసం లేకుండాదీనికి సహాయపడాలని చెప్పారు. మెడికల్ కాలేజీ ప్రిన్సిపాలు డాక్టరు జగన్నాథరెడ్డిగారు కాన్సరు వ్యాధిని నిరోధించడానికి విదేశీయులు ఏమిచేశారో విశదీకరించారు. శ్రీ కె. యస్. రావుగారు ఇప్పటివరకు ఈవ్యాధి నిరోధకాన్ని గురించి ఆంధ్ర రాష్ట్రంలో జరుగుతున్న ప్రయత్నాలను విపులీకరించారు. ముఖ్యమంత్రి శ్రీ గోపాలరెడ్డిగారు ఇలాంటి మహావ్యాధిని నిరోధించ ప్రయత్నించటం సంతోషమేననియు, ఇందుకు పురప్రముఖులందరు తోడ్పడాలనియు ప్రభుత్వముకూడ సహకరించగలదనియు చెప్పారు.

"ఈతరం వారి సౌకర్యం కోసం భావి తరాల భవిష్యత్తును బలి చేయరాదు"

వై. బి. దాషే

వృద్ధుల విషయంలో శ్రద్ధతీసికొనడమనే సత్సంప్రదాయం సమిష్టికుటుంబాలలో భారతదేశంలో తరతరాలుగ వస్తూనేవుంది. మూడుతరాలవారు కలసిమెలసి వుండడం ఆచరణలోనేమి, ఆదర్శంలోనేమి అక్షరాలాపాటింపబడుతూంది. ఆర్థిక, నైతిక, ఆచారాదికములైన సాంఘిక కట్టుబాటులు భారతదేశంలో వృద్ధుల యెడల శ్రద్ధను మరింత ఇనుమడింప చేశాయి.

ఈ వృద్ధుల సమస్యను వయోభేదాలను బట్టీ, సమిష్టి కుటుంబాన్నిబట్టీ రెండు దృక్పథాలలోనూ ఆలోచించాలి.

వయోభేదాల ననుసరించి, ఆయా 'వయస్సులలో సాధించ వలసిన పురుషార్థాలు అనాదికాలం నుంచీ మన దేశంలో సుస్పష్టంగా వ్యక్తం చేయబడ్డాయి. జ్ఞానసముపార్జన, ధనసంపాదన, ఐహికాముష్మిక వాంఛల సాధన, ఇహలోక బంధాలనుంచివిముక్తి, క్రమంగా బ్రహ్మచర్య, గృహస్థ, వానప్రస్థ, సన్యాసాశ్రమాలలో సాధింప వలసివున్నది, ఆయావయోభేదాలలో పై వరుస క్రమంలో అక్షరాలా ఆయాపురుషార్థాలను సాధించడం అందరికీ సాధ్యంకాక పోయినా, సుఖప్రదమైనజీవితం గడపడానికి ఈవిధంగాచేస్తే బాగుంటుందని సూత్రీకరింప బడింది. వయోభేదాల ననుసరించి ఆయావయస్సులలో ఆయాపురుషార్థాలని సాధించాలని ఒక నిర్ణయం చేయబడినా, ఆచరణలో సాంఘిక జీవనంపైన వీటి ప్రభావం మాత్రం విస్మరింప బడలేదు. అందుచేత ఈ వయోభేదాల నిర్ణయం కేవలం శారీరక మైనప్పటికీ, సాంఘికంగా దీని ప్రభావం ఎంతైనావుంది. ఆయా వయోభేదాలననుసరించి, సాధించ వలసిన కార్యాలుకూడా నిర్ణయింప బడ్డాయి. పురుషార్థాలు, వయోభేదాలు విడతీయరాని సహచరులన్నమాట ! ఈ రెండింటిని విడదీయడానికి ప్రయత్నిస్తే సంఘానికే తీరని ముప్పువాటిల్లుతుంది. ఆయావయోభేదాల ననుసరించి, ధర్మార్థకామమోక్షాలను సాధించవలెననే ఆదర్శం హిందూ సాంఘిక కట్టుబాటుకే ఒక మహత్తర సూత్రంగా పరిగణింపబడింది. మానవచరిత్రకి సంబంధించిన సాహిత్యాన్ని మనం చూస్తే ఈ వయోభేదాల నిర్ణయం ప్రపంచం అంతటా ఎంత సర్వ సాధారణమైనదో తేటతెల్లమవుతుంది.

సమిష్టి కుటుంబ విధానం భారతదేశంలో ప్రాచీన కాలంనుంచీ వుంది. ఒకే ఇంటిలోవుంటూ ఒకే వంటలో భోజనం చేస్తూ వున్న కుటుంబాల పరిమితి ఇదమిద్ధమని నిర్ణయించడం కూడా కష్టమే : వారసత్వ విధానం అములులోవున్న కుటుంబాలే భారతదేశంలో ఎక్కువ. అందుచేత ఈ సమిష్టికుటుంబాలలో తండ్రివైపుబంధువులుకూడా వుంటారు. ఈ కుటుంబాలలో మూడుతరాలవారి సమైక్యతని మనం చూస్తాము. అంటే తాతలు అవ్వలు దీనిలో వుంటారన్నమాట. ఈ విధంగా ఈ కుటుంబాలలో వీరి మీద శ్రద్ధ చూపబడుతూంది. వయోభేదాల ననుసరించి ఆయా అవస్థలలో సాధింప వలసిన పురుషార్థాల నిర్ణయందృష్ట్యా, సమిష్టి కుటుంబాలలో వృద్ధుల ఆధిక్యత గౌరవింప బడుతూంది. మనుమడు పుట్టగానే తాత కుటుంబ వ్యవహారాలను కొడుకున కప్పగించడమనే విధానం నిర్ణయింప బడింది. ఈ వయస్సులో పురుషుడు భార్యతోసహా అడవులకిపోయి వానప్రస్థాశ్రమం స్వీకరించాలని పెద్దలు చెప్పారు. సన్యాసాశ్రమంలో ఒంటరి జీవితాన్నే గడపాలి. జీవిత సుఖాల్ని కోరకుండా, యువకులతోపాటే వృద్ధులుకూడా దేహసంబంధమైన సుఖాల్ని ఆశించకుండా వుండటానికే ఈ నిర్ణయం చేయబడింది. మానవుడు చెల్లించవలసిన ఋణాలలోకల్లా "పితౄణం" చాలా ముఖ్యమైనదిగా చెప్పబడింది. ఈ విధంగా తాత ముత్తాత ఋణాలని తీర్చుకొనే పద్ధతి నిర్ణయించడంలోనే పెద్దలకీ, పిన్నలకీ మధ్య సంఘర్షణ పరిష్కరింపబడింది. ఈ విధంగా ఒకప్రక్క వృద్ధులు గౌరవింపబడుతున్నారు. వేరొక ప్రక్క వీరు అనవసరంగా అధికారం చెలాయించకుండా వుంచబడుతున్నారు !

ఆర్థిక, సాంకేతిక, ఆదర్శాత్మక దృక్పథాల దృష్ట్యా భారతదేశంలో సమిష్టి కుటుంబం ఎన్నో మార్పులను పొందింది. అందుచేత పూర్వంలాగే ఇప్పుడుకూడా సమిష్టికుటుంబాలలో తమకు ఎక్కువ ప్రాధాన్యతనిస్తూ,

"ఈతరం వారి సౌకర్యం కోసం భావి తరాల భవిష్యత్తు బలి చేయరాదు"

సౌకర్యాలని సమకూర్చాలని వృద్ధులు వాంఛించడం సమంజసంకాదు. ఆర్థికంగాకలిగిన మార్పులవల్లనైతేనేం. పాశ్చాత్య దేశాల సంపర్కంచేత నైతేనేం. "చిన్న కుటుంబాలు. ఏకకుటుంబాలు, నవీనయుగచిహ్నాలైనాయి.

ఇంతకుముందు చెప్పినట్లుగా ఆయా వయోభేదాలలో ఆయాపురుషార్థాలని వేపుచేస్తే అనేక క్లిష్ట సమస్యలనెదుర్కొన వలసి వస్తుంది. పురాణయుగాలలో కూడా ఇలాంటి చిక్కులు పొడసూపిన సందర్భాలు వున్నాయి. శంతనుడు దాశకన్య సత్యవతిని వివాహంచేసి కొనడం మూలంగా భీష్ముడు శాశ్వతబ్రహ్మచారిగా, రాజ్యాధికారాన్ని కోల్పోవలసి వచ్చింది.

ఆయా వయోభేదాలలో ఆయా పురుషార్థాలని సాధించాలనే పట్టింపు పూర్తిగా సడలిపోయింది. అందుచేతనే వృద్ధులకీ, యువకులకీ, జీవితరంగంలో సంఘర్షణ తప్పడంలేదు. అధికారం చలాయించడానికి అలవాటుపడ్డ పెద్దలు అలాంటి సౌకర్యాన్ని సులభంగా వదులుకోలేకపోతూన్నారు. ఈ పరిస్థితి ఎన్నోకష్టాలకి దారితీస్తుంది. ఒకవైపు ఇలాంటి వృద్ధులయెడల శ్రద్ధతీసికోవాలి, రెండవవైపు ఆ వృద్ధుల చెప్పుచేతలలో మెలగాలి: అందుచేతనే ఇలాంటి వృద్ధులు సంఘానికి బరువుగా తయారవుతున్నారు. అధ్వాన్న మౌతూన్న ఆర్థికపరిస్థితులు ఈ సమస్యని మరింత అధోగతికి కొని పోతున్నాయి: ఈ వృద్ధుల ముచ్చటలు తీర్చడానికి యువకులు తమ జీవితావసరాలను బలిచేయవలసి వస్తుంది. ఈ విధానం భావితరాలవారి జీవన విధానాన్ని కుంటుపరుస్తుందనడంలో సందేహంలేదు.

"ఈతరంవారి సౌకర్యం కోసం భావితరాల భవిష్యత్తును బలిచేయరాదనే" పరమసత్యం అందరూ ఒప్పుకొన్నదే! ఒక ప్రత్యేక విధానంద్వారా తమ హక్కులను చాటేముందు ఆవిధానం తమ కోరికలను తీర్చే స్తోమతు కలిగివుందా అని ఆలోచించాలి.

ఈ క్రిందివివరణ ఈ సమస్యా పరిష్కారానికి తోడ్పడుతుంది,

"వృద్ధులు జీవిత సుఖాలని, అధికారాన్నీ శాశ్వతంగా తమకేవుండాలనీ వాంఛించకుండా తరువాత తరాలవారికి ఒప్పజెప్పడానికి మానసికంగాతయారుకావాలి. ముఖ్యంగా యువకుల విషయంలో వృద్ధులు ఈ సమస్యపట్ల ఏవిధంగానూ అడ్డురాకూడదు. చతుర్విధ పురుషార్థ సాధనలో ఆధునికకాలంలో పూర్వకాలపువయోభేదాలను పాటించడం అంత ఆచరణసాధ్యమైన పనిగా నేడు కనుపించదు. అయినా వృద్ధులుమాత్రం కోరికలను అణచుకొని అతి సామాన్యమైన జీవనానికి అలవాటు పడాలి. మానసికంగాను, శారీరకంగానూ తగిన స్థితిలోవున్న వృద్ధులు ఈ పద్ధతినిఅవలంబించడం ఎంతోసమంజసం. కాని, రోగిష్టివారైన ముదుసలుల విషయంలో సమిష్టికుటుంబాలు తగిన శ్రద్ధతీసికొనడం నేటికాలంలో సాధ్యపడని విషయం; అందుచేత పట్టణప్రాంతాలలో అశక్తులైన. దుర్బలులైన ముసలివారికి శరణాలయాలను నిర్మించడమే ఈ సమస్యా పరిష్కారానికి తగినమార్గం. ఇలాంటిసంస్థలకి సాంఘిక సంస్థలూ, రాష్ట్రప్రభుత్వాలూ ఆర్థిక సహాయం చేస్తాయి. జీతంపైన నియమింపబడిన సిబ్బంది ఈ రక్షణాలయాలలోని ముదుసలుల సేవచేస్తుంది; ఇలాంటి రక్షణాలయాలు తమతమ ఇండ్లకు దగ్గరగా వుండటంచేత స్నేహితులనీ. బంధువులనీ, చూసుకుంటూ వృద్ధులు తృప్తిచెందవచ్చును. ఈ సంస్థలు వారిశ్రద్ధ వహించడంచేత స్నేహితులకీ, బంధువులకీ, ఈ ముదుసలుల యెడ గౌరవం, భక్తీ మరింత ఎక్కువౌతుంది. మార్పు చెందిన సాంఘికాచార వ్యవహారాలకి అనుగుణంగా ఇలాంటి సంస్థలు స్థాపింపబడితే ముదుసలుల యెడల పూర్వపు భక్తి ప్రపత్తులు, గౌరవం తిరిగినెలకొల్పబడడంతథ్యం. ఇలాంటి మార్పు రానంతకాలం ముదుసలులు తమపట్టుదలలనీ, చాదస్తాలనీ వదలనంతకాలం సమిష్టి కుటుంబాలకి వృద్ధులు బరువుగానే తయారవుతారు,

---

పెండ్లికాని తల్లీ-బిడ్డా

:o:

భీమానది ఒడ్డున, పాపం! విడిచిపెట్టబడ్డ బిడ్డ లాల్ శంకర్ ఉమాశంకర్‌గారికి దొరికింది. ఆయన పండరీపురంలో సబ్‌జడ్జీగా ఉండేవారు. ఆబిడ్డను స్వీకరించడంతో ఆయన ఎన్నో కష్టాలను ఎదుర్కోవలసి వచ్చింది. ఆరోజుల్లో, 1875 ప్రాంతంలో, భారతదేశ పరిస్థితులలా ఉండేవి.

ఇల్లు చేరడంతోనే సబుజడ్జీ లాల్‌శంకర్‌జీ ఆ ఒక్క బిడ్డతోనూ దొరికినబిడ్డలనిమిత్తం పండరీపురంలో ఒక వసతిగృహం స్థాపించి ఇలాంటి బిడ్డల ప్రాణాలెన్నో నిలబెట్టాలని నిశ్చయించారు. రెండు సంవత్సరాలతరవాత దానికొక అనాథశరణాలయాన్నికూడా చేర్చారు ఇవి ఇలాంటి దిక్కుమాలిన పిల్లల్ని పెంచాలి అనే మనోవికాసాన్నయినా ప్రజలకుకలగజేస్తుందనిఆయన నమ్మకం. ఉద్యోగరీత్యా వారు అక్కడినుంచి మరొకచోటికి బదిలీకావడంతోనే లాల్‌శంకర్‌జీ ఈ అనాథవసతి గృహ నిర్వహణ సంఘసంక్షేమ సేవా తత్పరులైన బొంబాయి ప్రార్థనా సమాజంవారికి వొప్పజెప్పారు.

అసలు అక్రమ సంతానం అని అలాంటి బిడ్డలను అననేకూడదు అక్రమం చేసింది ఆ బిడ్డల తల్లిదండ్రులే! తల్లిదండ్రుల వాస్తవ పరిస్థితులు ఎంత విషాదకరమైన వైనప్పటికీ, బిడ్డలు మాత్రం బాధలు భరించలేని తల్లుల చేతులలోనే తరుచూ హత్యకావింపబడతారు. లేకపోతే ఎక్కడో విడిచిపెట్టబడతారు. ఇలాంటి సంఘటనలు మనలను ఆహ్వానిస్తాయి. మానవులకు సహజమైన జాలి గుండెలు గల మనం కాదనలేము. అయినప్పటికీ పూర్వాచారాలు కరుడుగట్టిన సంఘంచేత మాత్రం ఇలాంటి బిడ్డలకు తగిన సంరక్షణ జరగాలి అన్న విషయం ఒప్పించడం దుస్సాధ్యం. ఇందుకు వ్యతిరేకించేవారివల్లనైతేనేమి, అలక్ష్యం చేసేవారివల్లనైతేనేమి, ప్రతిఘటించే వారివల్లనైతేనేమి బొంబాయి ప్రార్థనాసమాజం అనేక చిక్కులను ఎదుర్కొనవలసి వచ్చింది. అందుకే 1908 వ సంవత్సరంవరకూ అవివాహితలైన తల్లులకు, అలక్ష్యమూ, బహిష్కరణమూ అనుభవించకుండా ప్రసవించి బిడ్డనుకనడానికి ఇంత ఆశ్రయం కల్పించడానికి వారికి సాధ్యపడలేదు. ఈసాంఘిక దోషానికి చాలామంది తల్లులు బాధ్యులు కానప్పటికీ, సంఘం వారి యెడల ఎంత మాత్రమూ విచక్షణత చూపించలేదు. మంచి చెడలు పరిగణించని అనేక మోసగాండ్రు పాపం వారి దుస్థితిని తమప్రయోజనాలకోసం ఉపయోగించుకున్నారు.

హిందూదేశంలో ఒక బాలిక వివాహం కాక పూర్వం బిడ్డను కనడానికి అనేక కారణాలుఉన్నాయి. బాలవితంతువులను తన కుటుంబంలోనివాళ్ళే చెరచవచ్చు ఆడపిల్లలమీద అధికారమూ, సంరక్షకత్వమూ కలవారు వారి విధులను దుర్వినియోగం చెయ్యడంవల్ల కావచ్చు తల్లిలేనిపిల్లని మోసగించవచ్చు. నిస్సహాయ అయిన ఒక వితంతువు కుమార్తెను పాడుచెయ్యవచ్చు. దొంగప్రేమను చూపించి తీరాసమయానికి వాగ్దత్తాన్ని తిరస్కరించవచ్చు. పేదరికంవల్ల ఆడపిల్లలే దుర్నీతి పథాన్ని అవలంబించవచ్చు. మతంమీద నమ్మకం కొద్దీ ఆశ్రయించిన శిష్యులని దొంగస్వాములవార్లు వారివలలో వేసుకుని చెరిచిన సందర్భాలుకూడా ఎన్నో ఉన్నాయి. ఎందరో మోసగాండ్రు ఎందరినో చెరిచిన సందర్భాలూ ఉన్నాయి.

దినదినాభివృద్ధిని పొందుతూ ఉన్న ఈ పండరీపురంలోని సంస్థకు అక్రమ శిశువుల వసతిగృహమూ, అనాథశరణాలయమూ కాక ఇంకా మూడు శాఖలు ప్రస్తుతం పనిచేస్తున్నాయి. మాతా రక్షణశాల ఒకటి, నిర్వాసుల వసతి గృహం రెండోదీ స్త్రీపునరోద్ధరణ గృహం మూడోదిన్నీ. మూడూ ఆరు సంవత్సరాలమధ్య వయసు పిల్లలకి ఒక మాంటిసరీస్కూలు ఉంది. పాఠశాలలకు వెళ్ళతగిన వయసుగల బాలబాలికలు పట్నంలోని పాఠశాలలలో విద్యనభ్యసిస్తారు. ఈ వసతిగృహాలలో మగపిల్లలు పదిసంవత్సరాల వయసువరకే ఉంటారు. శిక్షింపబడిన బాలనేరస్థులుకూడా ఇందులో పాల్గొనిసామాన్యమైన సహజజీవనాన్ని గడుపుతూఉంటారు. ఇక్కడి బిడ్డలకు గృహకృత్యాలలోనూ చేతిపనులలోనూ శిక్షణ ఇవ్వబడుతుంది. కొందరు సంగీతంకూడా నేర్చుకుంటారు. ఈ సంస్థను విడిచివెళ్ళే ప్రతిస్త్రీకి, నర్సుగానో, దాదిగానోపనిచేసిజీవించడానికి అవసరమైనశిక్షణలభిస్తుంది.

వాళ్ళ వాళ్ళకథలు చెప్పాలంటే చాలా దుఃఖభాజనంగా ఉంటాయి. కాని, "నౌరంగే ఆర్ఫనేజి అండ్ ఫౌండ్లింగ్ హోము" అని పిలవబడే పండరీపురంలోని ఈసంస్థ అనాథలగు స్త్రీలకూ, శిశువులకూ నిజమైన స్వర్గధామం అనడానికి సందేహంలేదు. అంత జాగ్రత్తగా వారిని పెంచుతారన్నమాట. వారి విషయాలున్నూ ఎంతో రహస్యంగా ఉంచబడతాయి. ఈబాలికలు భారతదేశం నాలుగుమూలలనుంచీ అన్నిమతాలనుంచీ వస్తుంటారు. 1941—50 సంవత్సరాలలో జరిగిన కృషిఫలితాలు ఈ క్రింద ఉదహరింపబడినవి.

1. మాతా సంరక్షణశాలలో ప్రవేశించిన స్త్రీలు. 1109
2. విడిచిపెట్ట బడ్డ భార్యలు. 162
3. వితంతువులు. 664
4. పెండ్లికాని యువతులు. 328
5. రక్షణ గృహంలో జన్మించిన శిశువులు. 979

పెండ్లికాని యువతులు ఎక్కువగా విద్యలేనితరగతుల నుంచే వస్తారని గమనించాలి. ఏటా 40 లగాయతు 100 మందివరకూ పెండ్లికాని తల్లులు వస్తూఉంటారు.

పండరీపురంలోని ఈవసతులను నిజగృహాలుగా చేసింది అక్కడి "బావా". 1938 నుండి ఇప్పటివరకూ సూపరింటెండెంటుగా ఉన్న శ్రీ వి. ఎస్. జవేరీయున్నూ అక్కడి పిల్లల "తల్లి" అయిన వారిభార్యయున్నూ కారణం. వారే పిల్లలకు జననీజనకులు. వారికీ, పిల్లలకీ మధ్య హృదయపూర్వక ప్రేమానుబంధం ఏర్పడింది. వివాహం అయివెళ్ళిన యువతులు తిరిగి తమ బిడ్డలతో పుట్టింటికి వచ్చినట్లు వచ్చివెడుతూఉంటారు.

ఇంకొక సమస్య. ఏటా రు. 90,000 ఖర్చగుతూ ఉన్న ఈసంస్థయొక్క ఆర్థిక పరిస్థితి. ఈ వసతి గృహంలో ఉన్న బాలికలు భోజనానికిగాని, వసతికిగాని డబ్బు ఇచ్చుకోలేనివాళ్ళే. పండరీపురం మునిసిపాలిటీ సాలీనా ఇచ్చే గ్రాంటును, డబ్బాలుపెట్టి పోగుచేసిన చందాధనం కలుపుతారు. ఇటీవలనే కేంద్ర సాంఘిక సంక్షేమసంస్థ ఈ సంస్థకు పూర్తి గ్రాంటు సాలుకి రు. 15,000 లు ఇచ్చింది.

ఈ సంస్థయొక్క ముఖ్యసమస్య ఇంకొకటుంది. దొరికిన బిడ్డల మరణసంఖ్య నూటికి యాభై ఇద్దరికంటె ఎంత తగ్గించాలని ప్రయత్నించినా సాధ్యపడడంలేదు. కారణాలు అందరికీ తెలిసినవే. గర్భంలో ఉన్నప్పుడు సరియైన జాగ్రత్త తీసుకోకపోవడం, తల్లి దండ్రులు రోగిష్టులు కావడం, తప్పనిసరిగా పోతపాలు పోయటం మొదలైనవి మూడున్నర పౌనులు బరువుగల బిడ్డల ప్రాణాలకు హానికలగజేస్తాయనడానికి సందేహంలేదు.

కేంద్ర సాంఘిక సంక్షేమ సమితి

సమాజ కల్యాణయోజన ప్రథమ వార్షికోత్సవము (నెల్లూరుజిల్లా)

కేంద్రసాంఘిక సంక్షేమ సమితి ఆధ్వర్యాన నెల్లూరు జిల్లాలో ప్రారంభించబడిన సమాజకల్యాణ యోజన ప్రథమ వార్షికోత్సవము 26-8-55 సాయంత్రం 4 గం లకు సంగం (కోవూరుతాలూకా) లో జరిగింది. జిల్లాకలెక్టరు శ్రీ యం. బి. రాజాగారు. బి. ఎ. ఎల్. ఎల్. బి. గారు. శ్రీమతి రాజారావుగారు. జిల్లా కన్వీనరు శ్రీమతి డాక్టరు లక్ష్మి గారు, ప్రాజెక్టు కమిటీసభ్యులును సంక్షేమకేంద్రమును దర్శించిరి. పిదపబహిరంగసభ శ్రీరాజాగారి అధ్యక్షతన ఏర్పాటు చేయబడెను. ప్రార్థనానంతరము శ్రీ కలెక్టరుగారు గ్రామీణుల సంక్షేమమునకు సాంఘిక సంక్షేమ సమితివారు, ఇతర సంక్షేమశాఖలును చేయుచున్న కృషిని గురించి విపులముగా నుడివిరి. అనంతరము శ్రీమతి డాక్టరు మేథ్యూస్ గారి అభివందనములతో సభముగిసెను. ఈ విధముగనే కొరిమెర్లలో శ్రీ రాజారావుగారు, దుండిగములో శ్రీమతి నక్కా రంగనాయకమ్మగారు, సిద్దారెడ్డి పాళెములో శ్రీమతి సత్యవతమ్మగారు. చెన్నూరులో కుమారి అరుంధతిగారు, మర్రిపాడులో శ్రీమతి డాక్టరు లక్ష్మిగార్ల అధ్యక్షతను సభలు జరుపబడెను. సంక్షేమ కేంద్రములన్నియు గ్రామీణులు ఎంతో వుత్సాహముతో కార్యక్రమములందు పాల్గొని వార్షికోత్సవమును జయప్రదముగా జరిపించిరి.

నీతిమాలిన వ్యాపారాన్ని అరికట్టండి

శ్రీమతి వి. టి. లక్ష్మి (మద్రాసు)

"దయఉంచి నన్ను వ్యభిచారి అని దూషించకండి! నేనలా జన్మించనూలేదు, అదినా ఉద్దేశమూకాదు. కాని ఒకసంగతి. వ్యభిచారం అనే పాపం అనాదికాలంనుంచీ ఉంది. తరతరాలనుంచి సంఘానికి అవసరమైన దోషం. మానవస్వభావం మానవ స్వభావంగా ఉన్నంతకాలం ఆ పాపాన్ని నిర్మూలించడం అసాధ్యం అనిఉద్ఘాటిస్తున్నారు. అలాంటి పరిస్థితులలో నేను పతిత నయాను. తరువాత బొందెలో ప్రాణాలు నిలబెట్టుకుందుకు జీవనాధారంకోసం ఈనీచానికి ఒడబడిన నన్నువెలివేసి, అంతకంటే నికృష్ట మైన దోషిగా ఎందుకు నన్ను మీరు నీచపరుస్తారు? మొక్కను నాటింది మీరే! జాగ్రత్తగాపెంచి ఒక విష వృక్షంగా తయారు చేసిందీ మీ సంఘమే. ఇప్పుడు దాని కొమ్మలనూ పండ్లనూ నిషేధిస్తారా?" అని బాలికలనూ, యువతులనూ, వ్యభిచార వృత్తిలోకి దింపుతున్నదనే నేరం మోపబడిన ఒక మనీషి నన్ను ప్రశ్నించింది. ఇలాగే నికృష్ట జీవితాలకు గురియైన అనేకులు ఈ విధ మైన భావాలేకలిగి ఉంటారనుకుంటాను వెలిబుచ్చడానికి వీలు లేకుండా.

అవును పూర్తిగావాళ్ళు అన్నది సమంజసమే వ్యక్తి గతంగాగాని, వ్యాపారరీత్యాగాని ఏ సంఘవ్యవస్థ అయినా బహిరంగంగా చివురించడానికీ, దానంతట అదే మొలక లెత్తడానికీ సహనాన్ని చూపించి నప్పుడు కోటానుకోట్ల అపరాధినులూ ఉంటాయి, అభిమానించి దోహదం చేసే వాళ్ళూ ఉంటారు. వ్యక్తిగతంగా గాని, రహస్యంగాగాని ప్రప్రథమంలో ప్రారంభమైన వ్యభిచార ప్రవృత్తే తుదకు వ్యాపారమై విరాజిల్లుతుంది. ఈసమస్య అంతరించాలంటే దీని మూలకారణాలను ఊడపెరికి పారెయ్యాలి. ఈ పని నిస్సందేహంగా దుర్ఘటమైనది. అనుకున్నంత సులభ సాధ్యమూకాదు. చట్టనిర్మాణం కూడా ఈ దుష్టసమస్యను పరిష్కరించలేదు. ఎందుచేతనంటే అందుకు అవకాశాలు స్వల్పం. ఆచరణలో అనేకచిక్కులు వస్తాయి. కాని బాలి కలనూ యువతులనూ ఈ వృత్తిలోనికి దింపడం ప్రభు త్వం ప్రతిఘటిస్తూ ఉందనైనా తెలియ జేస్తుంది.

వ్యాపారంగా సాగిస్తున్న ఈ అనర్థాన్ని నిర్మూలించ డంలో మద్రాసు రాష్ట్రం ఏ ఇతర రాష్ట్రానికీ తీసిపోదు. 1930 వ సం॥ లోనే వ్యభిచార నిర్మూలన చట్టాన్ని అమలు జరిపింది. ఈచట్టాన్ననుసరించి అప్రతిష్ఠా కర ములైన ఈ వ్యభిచార గృహాలను పూర్తిగా నిర్మూలించ డానికి కృషిచేస్తూఉంది. సమర్థులైన పోలీసుఉద్యోగస్తులకు దీన్ని అమలు జరపడం ఒప్పజెప్ప బడింది. వ్యభిచారుల గణనమీద జీవించేవారినీ, వయసు వచ్చిన ఆడపిల్లల్నీ, ఆదరించే యువకుల్నీ ఈ నీచవృత్తికి ప్రోత్సహించి వారిని సేకరించేవారినీ, వీధులలో నిలబడి సైగచేసేవారినీ, ఈ చట్టం దోషు లని నిర్ణయిస్తుంది. మద్రాసుప్రభుత్వం చిన్న పిల్లలను రక్షించి వారికి శిక్షణ నిచ్చుటకొరకు రక్షణ గృహాన్ని, వీధులలో నిలబడి విటులను పిలిచినందుకు శిక్షింపబడి విడుదల అయిన ముప్పయి సంవత్సరాలకు తక్కువయసు యువతులను జాగ్రత్తపెట్టి వారిని సంస్క రించుటకొరకు విజిలెన్సుహోమునూ, మద్రాసు నగరంలో నడుపుతూ ఉంది. ప్రభుత్వ విచారణశాఖ సహకారంతో రిఫర్మేటరీ సంస్థలనుండి విడుదలయిన వారిని గ్రహించి వారికి పునరావాసం కల్పించడానికి తగిన పథకాన్ని తయారు చేసింది. ఇవికాక రాష్ట్రంలో పెద్ద పట్టణాలైన మధుర, తిరుచ్చి, సేలం, కోయంబత్తూరులలో నాలుగు స్వల్పకాల రక్షణగృహాలను నడుపుతూఉంది మలబారు జిల్లాలో ప్రభుత్వ సహాయంతో నడపబడే రక్షణ గృహం ఒకటిఉంది. దేశంమొత్తంమీద ఇట్టి జాగరూకతా సంస్థేను కృషి ప్రభుత్వాధిపత్యాన సుస్థిరమైన శాఖల ద్వారా నడిపించడంలో అగ్రతాంబూలం మద్రాసు రాష్ట్రా నిదే. వేలకొలది పతితలు ఈదుష్ప్రవర్తననుండి రక్షింప బడ్డారు. వ్యభిచారం వృత్తిగాసాగిస్తున్న వేలాదిస్త్రీలు తమ నికృష్ట జీవితాలనుంచి రక్షింపబడి, సుస్థిర జీవితాలను గడుపుతున్నారు. జాగరూకతాశాఖ కావించినకృషి స్వల్ప మైనదికాదు. సంతృప్తికరమైన పనిజరిగింది. అయినా ఇంకా చేయవలసినది ఎంతో మిగిలిఉంది. స్త్రీ పురుషుల మనస్సులు నీతివర్తనము యొక్క విలువను గ్రహించే ట్లు చేసి ఈ దౌష్ట్యాన్ని పూర్తిగా నిర్మూలించవలసిఉంది. ఇది నిరంతర ప్రచారంవల్లనే సాధ్యమౌతుంది. పడుపు వృత్తి వ్యాపారంగా సాగించేవారిమీదనే చట్టం శ్రద్ధ వహిస్తుంది. సరదాకుగాని, రహస్యంగాగాని జరిపేవ్యక్తి గతవ్యభిచారం చట్టంయొక్క పరిమితిలోనికిరాదు. స్వార్థ రహిత సంఘసేవకుల నిరంతర కృషివల్ల, మనోవిజ్ఞా సంగల ప్రజాభిప్రాయం వల్లనే ఇది సాధ్యం అవుతుంది.

నీతిమాలిన వ్యాపారాన్ని అరికట్టండి

స్త్రీలకు ఒక రకమైననీతి, పురుషులకు మరొకరకమైన నీతి ఉండాలని సంఘంలో అనూచానంగా వస్తున్న తప్పు అభిప్రాయాన్ని విడిచిపెట్టాలని మొట్ట మొదట ప్రచారకులు ప్రబోధించాలి. కుటుంబం నిర్మలమైనదిగా ఉండాలంటే, కుటుంబాలను సంకరంకాకుండా నిలబెట్టాలి అంటే తల్లి ఎంత పవిత్రంగా ఉండడం అవసరమో, తండ్రి కూడా అంతపవిత్రంగానూఉండడంఅవసరం. పవిత్రమైన మానవుని తయారుచేసే సుగుణాలన్నింటికీ మూలం నీతి. రెండోది పురుషులు తమ ఆరోగ్యాన్ని కాపాడుకోడానికి తమ కామాతురతను విచక్షణ లేకుండా అప్పుడప్పుడు తృప్తి పరచుకోవచ్చుననే పురాతనమైన నమ్మకం ఇంక వదలి పెట్టాలి అని సంఘాన్ని వేడుకోవాలి. ఇంద్రియ లోలత్వం శరీరానికీ, మనస్సుకీ కూడా అనారోగ్యకరమని ప్రస్తుతవైద్య విద్యాప్రవీణుల అభిప్రాయం. నానా రకాల వాళ్ళతోనూ విశృంఖలంగా జీవితం గడుపుతూ, విచక్షణా రహితంగా చెడ్డమార్గాన్ని సంచరించే వాళ్ళు నీరసులై పోవడమే కాకుండా అమాయికులైన తమ కుటుంబీకులకూ, తద్వారా సంఘానికీ తప్పనిసరిగా రోగాలను అంటిస్తారు. అందుచేత ఈ సమస్య వ్యక్తిగతమైనదేగాక సంఘ ఆరోగ్యమునకు సంబంధించినదికూడాను. మూడోది వ్యభిచారదోషం బీదవాళ్ళకీ, అజ్ఞానంచేత ఒడబడిన వాళ్ళకీ సంబంధించిన విషయం మాత్రమే కాదని సంఘానికి నమ్మకం కలగజేయాలి. "వ్యభిచారం ఒక గొప్ప ప్రజాసంస్థ" అని ఒక సంఘసేవకుడు నిర్వచించాడు. ఏ తేడాలు లేకుండా, గౌరవం లేకుండా, ఏ తరహాకు చెందినవారినైనాసరే, ఏ మతంవారినైనాసరే వ్యభిచారం పగ్గంపట్టి తన వలలోకి లాగుతుంటుంది. ఆకర్షణీయమైన పరిస్థితులు తెలియకుండానే వారిని ప్రవాహంలో ముంచేస్తాయి.

వ్యభిచారిణి అని నొసటమీద వ్రాసి ఎవరూ పుట్టలేదు. ఎవరికీ అలాకావాలనే అభిప్రాయమూ లేదు. అందుచేత వ్యభిచారం ఏరూపంలో ఉన్నా, ఎవరు చేసినా ఏవగించుకుని, అద్వితీయమైన నీతిమార్గాన్ని నడవవలసిందని సంఘంలోని ప్రజలను ప్రబోధించాలి. పతిత యువతులకు ఆశ్రయంఇచ్చి వారికేదైనా వృత్తిని కల్పించాలి. ప్రభుత్వంయొక్క, సంఘ సేవాపరాయణులయొక్క సహకారంతో వారివారికి తగిన వృత్తులను కల్పించి భయంకరమైన రోగాలకు జన్మస్థానాలై, కష్టపడి సంపాదించిన సొమ్మును హరించి, దుర్నీతి కరుడుగట్టి దోషభూయిష్టం అయిన పట్టణాలను నిర్మాలిన్యం చెయ్యాలి.

సంఘ సంస్కరణలకు మార్గదర్శని అయి, సంక్షేమ రాష్ట్రం అనిపేరు కెక్కిన మద్రాసు రాష్ట్రం సంక్షేమ సంస్థల సహకారాలతో ఏవిధమైన వ్యభిచారాన్నయినా సరే అచిరకాలంలో నిర్మూలనం చేస్తుందనిన్నీ ఏ ఒక్క యువతినీ వ్యభిచారిఅని నిరాకరించ దనిన్నీ ఆశిస్తున్నాను.

స్త్రీ హితైషిణీమండలి బాపట్ల

24 వ వార్షికోత్సవము.

బాపట్ల స్త్రీ హితైషిణీమండలి 24 వ వార్షికోత్సవము యీనెల 21–8–55 తేదీ ఆదివారం సాయంత్రం 5 గంటలకు మండలి భవనమున జరుపబడినది. బాపట్ల వ్యవసాయ కళాశాల అధ్యాపకురాలు శ్రీమతి యస్. యశోదాదేవి బి.ఎస్.సి (ఆనర్సు) గారు అధ్యక్షతవహించిరి. పిమ్మట మండలి సహాయ కార్యదర్శిని కామరాజు వెంకటలక్ష్మమ్మగారు వార్షిక నివేదిక చదివిరి.

ఈ సంవత్సరం సెంట్రల్ సోషల్ వెల్ఫేర్ వారొసంగిన రు 1500 ల గ్రాంటు సహాయమున మండలియందు హిందీ, కుట్టు, సంగీతము తరగతులు నడుపుచున్నాము. 8 గురు సంగీతమును 6 గురు కుట్టును 4 గురు హిందీని నేర్చుకొనుచున్నారు. చీరాల రోటరీక్లబ్బు వారొసంగిన పాలపొడితో పేద పిల్లలకు ఉచితముగా పాలు పోయుచున్నాము అని చెప్పి సెంట్రల్ సోషల్ వెల్ఫేర్ వారి సహాయము వలన స్త్రీలకు ఉపయుక్తమైన కార్యక్రమములు నడుపగలిగినందుకు వారికి తమకృతజ్ఞత తెలిపిరి.

మండలి భవనమును పౌరుల సహాయమున మరమత్తు చేయగలిగినందుకు పౌరులకు తమ కృతజ్ఞతను తెలిపిరి.

కుష్ఠురోగ నివారణ

శ్రీ టి. ఎన్. జగదీశన్

(హిందూ కుష్ఠు నివారణ సంఘ కార్యసచివుడు)

ఈ వ్యాసంలో కుష్ఠురోగంయొక్క సాంఘిక పరిస్థితులనుగురించి ఉద్ఘాటించదలచాను. కుష్ఠురోగమును అరికట్టి, నివారించుటకు సంఘసేవకులు ఎన్నివిధాల సేవ చేయుటకు సాధ్యమౌతుందో వివరిస్తాను. ముందుగా ఒకసంగతి చెప్పాలి—— కుష్ఠురోగం అనేక సాంఘిక సమస్యలను దారితీస్తుందంటే ఆరోగ్య సమస్యగా దానిని పరిగణించక నిర్లక్ష్యభావంతో చూడడమేకారణం. కుష్ఠురోగం ఆరోగ్య సమస్య అని ముందుగా మొట్టమొదట అంగీకరించాలి. అదికూడా అన్నివ్యాధులలాంటి వ్యాధే. వైద్యులూ, ప్రజారోగ్యసిబ్బందీ, తమ శక్తిసామర్థ్యాలనీ దీక్షనూ వినియోగించి దీనివిషయమై శ్రద్ధవహించాలి. అందుచేత సాంఘిక సేవానురక్తుల కృషిని అభిలషిస్తూ పురాతనమూ భయంకరమూ అయిన కుష్ఠు వ్యాధిని అరికట్టి, నిర్మూలించుటకు ప్రభుత్వమూ, కళాపరిషత్తులూ, వైద్య విద్యాప్రవీణులూ, ఆరోగ్యశాఖోద్యోగులూ చురుకుగానూ, ఔదార్యంతోనూ, ఉత్సాహకరంగానూ పనిచేస్తే తప్ప, ఇందువల్ల ఉత్పన్నమయే విచారకరమైన సాంఘిక సమస్యలను అరికట్టుట దుస్సాధ్యం.

కుష్ఠును గూర్చిన వాస్తవిక విషయములు బోధించుటకు సంఘసేవకుడు ఏమిచెయ్యాలి :

పాఠకులు మొట్టమొదట చెయ్యవలసినది ఏమనగా కుష్ఠునుగూర్చి ఇంతవరకూ తమకు ఉన్న దురభిప్రాయాల్ని మనస్సులోనుంచి పూర్తిగా తీసివెయ్యాలి. ఇది సులభంకాదు. సహృదయులంతా అర్థంచేసుకుని ప్రయత్నిస్తే సాధ్యమౌతుంది. కుష్ఠుఅరికట్టదగిన వ్యాధి అనిన్నీ, ఎంత ఎక్కువస్థితిలో ఉన్నా, వైద్యానికి లొంగని రోగం కాదనిన్నీ మీరు పరిగణించాలి కుష్ఠునుగూర్చి, సంఘసేవకులు విస్తృతమైన ప్రచారం ఈ క్రింద వివరించిన అంశములతో కావించవచ్చును.

1. కుష్ఠు అరికట్టదగినదీ, వైద్యానికి లొంగుబాటులోకివచ్చేదీ అయిన రోగం.

2. ఇదివస్తే సిగ్గుపడవలసిన అవసరంలేదు. ఇది శాపంకాదు. దీనిపుట్టుక సుఖరోగసంబంధమైనదికాదు.

3. కుష్ఠు వంశాగతంకాదు. క్షయవ్యాధివలెనే సన్నిహిత సంపర్కంవల్ల కుటుంబాలకు ప్రాకవచ్చును.

4. వ్యాధిగ్రస్థులలో నూటికి ఎనభైమందికి అంటువ్యాధికాదు.

5. అంటుకునేశక్తి కుష్ఠువ్యాధికి చాలా తక్కువ. కాని అంటుకునే కుష్ఠువ్యాధి ఉన్న రోగులు మాత్రం చిన్నపిల్లలకు దగ్గరగా ఉండకూడదు. చిన్నపిల్లలకి రోగాలు త్వరగా అంటుకుంటాయి.

6. రోగులు పెందలకడనే వైద్యుల సలహా తీసుకొని వైద్యం చేయించుకోవాలి. కాని అది సత్వరఫలితాలను ఇస్తుందనికాని, హఠాత్తుగా నిర్మూలం అవుతుం దనిగాని, భావించటం పొరపాటు. నవీన ఓషధులైన సల్ఫోనులు కుష్ఠుమీద అమోఘంగా పనిచేస్తాయి. ఆలస్యం అయినా విధిగా పనిచేస్తాయనే ప్రశంసలను అందుకున్నాయి.

7. ప్రత్యేకంగా ఉంచడం, దూరంగా పెట్టటం మొదలైనవి దాదాపు బహిష్కరణను సూచిస్తాయి. కాని కుష్ఠుకు సంబంధించినంతవరకూ ప్రత్యేకంగా ఉంచడం అంటే అంటుకునే రోగంవిషయంలో పిల్లలకు దూరంగా ఉంచమనే

8 ఈకృషి కొనసాగకపోవడానికి తరతరాలనుంచి మనలో వస్తున్న దురభిప్రాయమున్నూ, దాని వాస్తవాన్ని గురించిన అజ్ఞానమున్నూ కారణాలు. ఒక్కసారి ప్రజలు ఇది సామాన్యవ్యాధి అని గుర్తించిననాడు ఈ వ్యాధిని ప్రజారోగ్య సమస్యక్రింద నివారణచేయవచ్చును.

9. కుష్ఠురోగులకు తప్పనిసరిగా వసతి గృహాలుకాని, ప్రత్యేక అన్నసత్రాలుగాని ఉండనక్కరలేదు. వారికి కావలసింది వైద్యమున్నూ ఆసుపత్రులున్నూ. కుష్ఠురోగికి ఆత్మగౌరవం కల్పించి, ఏదైనా పనులు కల్పించి వానిని ఉపయోగించుకోవాలి.

10. కుష్ఠురోగం భయంకరంగా ఎందుకు పరిగణింపబడుతోందంటే శరీరావయవములకు వక్రత కనిపిస్తుంది

గనుక. అజ్ఞానంవల్లా, అలక్ష్యంవల్లా ఏర్పడిన ఈవక్రత మానవుని శక్తిని వృధాచేస్తుంది. ఇందుకు వెల్లూరులోని డాక్టరు పాల్. డబ్ల్యూ. బ్రాండుసీ. వారి అనుచరులనూ అభినందించాలి. ఇప్పుడు వారు కుష్ఠువల్లవచ్చే అవయవ వైకల్యాన్ని నివారిస్తున్నారు. ఇంక రాకుండాకూడా చేస్తున్నారు.

11. కుష్ఠువాడు అనేపదాన్ని వాడకూడదు. దానికి బదులు. కుష్ఠురోగమనిగాని. కుష్ఠువ్యాధిబాధితుడనిగాని అనండి. వైద్యానికీ, వ్యాధికీ సంబంధించిన భాష సరిగ్గానూ నిర్దుష్టంగానూ ఉండాలి

కుష్ఠువ్యాధియొక్క వాస్తవమూ, విజ్ఞానమూ ఇండియాలోని పట్టణాలలోను పల్లెలలోనూ ఉన్న ప్రజలకు విస్తారంగా ప్రబోధించడంవల్ల ఆరోగ్యశాఖోద్యోగులున్నూ సంఘసేవకులున్నూ ఈ ఉద్యమానికి ఎంతో సహాయ పడినవారగుచున్నారు. అంటుకునే గుణంకలిగిన కుష్ఠు వ్యాధి పీడితులు ఎక్కడ ఉన్నాసరే ఈ క్రిందివిధంగా జాగ్రత్త తీసుకుంటే వ్యాధినిర్మూలనకు ఎంతో తోడ్పడిన వారవుతారు

ఎ. వ్యాధి పీడితుడు ప్రత్యేకంగా, పిల్లలకి దూరంగా శయనించాలి.

బి. అతని పక్క. తినేపాత్రలూ, వంట సామానులు వేరేగా ఉంచాలి.

సి. అతను కట్టుకునే బట్టలూ. పక్కబట్టలూ, తువ్వాళ్ళు మొదలైనవి చాకలికి వేసేముందు క్రిములను నిర్మూలించే సొల్యూషనులో ముంచాలి. కుటుంబంలోని వారి ఇతరబట్టలతో కలవకండా ప్రత్యేకంగా ఉతికించడం మంచిది.

డి. అతని కుర్చీ, చాప, మొదలైనవి పిల్లలకి అందు బాటులో లేకండా కేటాయించాలి.

నిజపరిస్థితులను ప్రబోధం చెయ్యడంవల్ల సంఘసేవకుడు వ్యాధిగ్రస్తుని దిక్కుమాలిన ఒంటరితనములోనుంచి బయటికి లాగిన వాడవుతున్నాడు. మానసికంగా అతడు పడేబాధలనుంచి విముక్తి పొందే అమూల్యమైన సేవను సామాన్య ప్రజలు దానిసత్యాన్ని బయటపెట్టి సాగించగలరు. ఆ మాట చెప్పేసరికే హడలిపోయే స్త్రీ పురుషాదుల భయం తొలగింపవచ్చు. భయ విముక్తులనుచేసి ప్రజాసీకానికి స్వేచ్ఛను కలగజేసిన వారమగుదుమని చెప్పడానికి సాహసిస్తున్నాను. వాస్తవ పరిజ్ఞానం ప్రచారం చెయ్యడంవల్ల వ్యాధి నిర్మూలనకు తగిన వాతావరణం సృష్టించిన వారమగుచున్నాము.

వ్యాధిగ్రస్తుని కుటుంబానికి సంఘ సేవకులు చేయ గలిగిన సేవ ఏది ?

వ్యాధిపీడితుని నిస్సహాయ స్థితిని సాంఘిక సేవానురక్తుడు ఎంతగానో చూస్తున్నాడు స్త్రీకిగాని పురుషునికిగాని కుష్ఠురోగి అనడంతోనే ముష్టివాడు జ్ఞాపకం వస్తాడు. నిస్సహాయుడైన రోగికి మనం చెయ్యగలిగినంత సహాయం చెయ్యవలసినదే. కాని మొట్టమొదట ఈ వ్యాధి గృహసమస్య అనే సంగతి గ్రహించాలి.

హిందూదేశంలో సాధారణంగా అంటుకునే గుణం కల కుష్ఠువ్యాధి గలవారు ఆరోగ్య వంతులైన బిడలతో ఒకేగృహంలో ఎక్కువ జనసమ్మర్ధంగా ఉండే చోటుల్లో నివసించడం వల్లనే సాధారణంగా ఈ వ్యాధి వ్యాపిస్తూ ఉంది. పిల్లలకి దూరంగా ఉంచడంవల్ల వ్యాధి దానంతట అదే నిర్మూలనం అవుతుంది. పిల్లలమీదతప్పితే ఇతరుల మీద దాని ప్రభావం తక్కువ. మనం వారికి చెప్పినా బీద కుటుంబీకులు అజ్ఞానంవల్ల తగిన జాగ్రత్త తీసుకోలేరు. ధనవంతులకు తెలియకకాదు గాని ఇతరులకు తమ వ్యాధినిగురించి తెలుస్తుందేమోననే భయంవల్ల తగిన జాగ్రత్త తీసుకోరు. ఈ సమస్యను పరిష్కరించ డానికి ఒకేఒక మార్గం ఉంది. ఈ రోగాన్ని ప్రజలదృష్టికి తీసుకురావాలి. ఇది సామాన్యమైన వ్యాధి అనిన్నీ దీన్ని రాకుండా చెయ్యవచ్చు ననిన్నీ, పూర్తిగా కుదర్చవచ్చు ననిన్నీ, దీనివల్ల సిగ్గ పడవలసిన అగత్యం లేదనిన్నీ, అనుకున్ననాడు గాని అది బయటకురాదు. ఎవరైనా రోగి నిన్నడిగితే ఈ విధంగా సలహాఇయ్యి

1. నిపుణులైనవారి సలహాతీసుకో.

2. అటు కుష్ఠు ఉన్నవాళ్ళు చెయ్యవలసినదేమిటంటే తమబిడ్డలనైనా, పరాయివాళ్ళబిడ్డలనయినా కలసినివసించ నీయకూడదు. చిన్న బిడ్డలను వీలుంటేనీయింటికి తీసుకురా. లేకపోతేబంధువులఇంటికి పంపించు. లేకపోతే శిశుసంరక్షణ గృహాలలో చేర్పించు. ఇలాంటి అభిప్రాయాలు రోగికిమాత్రం ఎంతమాత్రం ఉండవు.

3. రోగికి వైద్యం ప్రధానం. కాని అతని వైద్యానికి చేసే ప్రయత్నాలకి ముందుగా అతనితో సన్నిహిత సంబంధం గల అతని పిల్లలకు తగిన ఏర్పాట్లు చేసిన తరువాతనే జరగాలి,

అంటు రోగిని సానటోరియమ్‌కు పంపవచ్చు అతనిని ఆసుపత్రికి పంపేముందు అతని కుటుంబానికి తాను తిరిగి వచ్చేవరకూ ఏదో ఆదరువు కల్పించాలి. ప్రతి అంటు రోగి సానటోరియమ్‌కు వెళ్ళనక్కరలేదు. వ్యాధి అంటుదనంలో హెచ్చుతగ్గులను బట్టి ఎక్కువ అయినరకంకాకుండా ఉండి పిల్లలకిదూరంగా ఉండడానికి వీలుఉండేవాళ్ళు సంఘంలో తిరగవచ్చు. అలాంటి ప్రోత్సాహం కలిగించి సిగ్గుపడవలసిన అవసరం లేదనిచెప్పి నలుగురిలో తిరగుతూ తమ పనులు తాము చేసుకుంటూ ఉండమని చెప్పాలి. అయితే సంఘారోగ్యందృష్ట్యా పిల్లలకిపారాలు మాత్రం వాళ్ళు చెప్పకూడదు. ఈ వ్యాధి పీడితులు తమ తమ వృత్తులను చేసుకోడానికి ఈ వ్యాధి ఎంత మాత్రం అడ్డంకు కాదనే సంగతి కుష్ఠు నిర్మూలన సేవాపరాయణులు విరివిగా ప్రచారం చెయ్యాలి.

అంటు రకంకాని వ్యాధి పీడితులను సంఘంలో చేర్పించే ఏర్పాటు గట్టిగా చెయ్యాలి. అతనికి ఏదైనా వృత్తి కల్పించడంగాని. ఏదైనా పని ఇప్పించడం గాని చెయ్యాలి.

నివారణ గృహాలూ, ఆసుపత్రులూ ఏర్పాటు చేయించమని సేవానిరతులకు చెప్పను. అట్టి బాధ్యత తీసుకునే శక్తి వారికిలేదు. ప్రత్యేకమైన నేర్పరితనం, నిర్మాణశక్తి పెద్దలతో సంబంధం కలవారికి ఆపనిని విడిచి పెడదాం. కాని మీరు వ్యక్తిగతంగా చెయ్యగలిగినదీ, చెయ్యవలసినదీ, ముఖ్యంగా చెపుతాను.

కుష్ఠు వ్యాధిని గూర్చిన వాస్తవికతను తెలుసుకుని, మీ దృక్పథాన్ని మార్చుకొండి,

మీరూ, మీ మిత్రులూ భయాన్ని విసర్జించండి. వ్యాధిగ్రస్తులతో స్నేహం చెయ్యండి.

వాళ్ళనిగురించి మీరు జాలి పడడం కాకుండా మీరు అర్థం చేసుకుని సానుభూతిని చూపండి.

వాళ్ళ సొంత సమస్యలను తెలుసుకొండి.

మానసికంగా వారికి ఉండేబాధను తొలగించండి.

వారిహృదయాలలో ఆనందమూ, ఆశాపూరికొల్పండి.

వికలాంగులైయున్న రోగుల దగ్గరకు తరుచూవెళ్ళి మీ ప్రసంగం వల్ల నూతన జీవనాన్ని కలగజేసి. ఒంటరితనాన్ని పో గొట్టండి.

వారికి ఏదైనా చదివిపెట్టండి.

వ్రాసి పెట్టండి. చిన్న చిన్న పను లేవైనాఉంటే చేసి పెట్టండి.

అప్పుడు మిత్రులులేని వారికి మీరు నిజమైన మిత్రులు అవుతారు.

నిరాశా, నిస్పృహలతో కుళ్ళి కుమిలిపోతున్నవారికి మీ అడుగు సవ్వడులు ఆశా గీతాలవుతాయి.



భారతదేశంలో సాంఘిక సంక్షేమ సేవ

ద్వితీయ పంచవర్ష ప్రణాళికా కాలంలో యాభై వేల గ్రామాలకు విస్తరింపబడుతుంది.

శ్రీమతి దుర్గాబాయ్ దేశ్‌ముఖ్ ప్రసంగం

"కేంద్ర సాంఘిక సంక్షేమ సంస్థ ద్వితీయ పంచవర్ష ప్రణాళికా కాలంలో ఇంకొక 5000 సంక్షేమ సంస్థలకు ధన సహాయ కార్యక్రమం నిర్వహింపనున్నది. ద్వితీయ పంచవర్ష ప్రణాళికా కాలం పూర్తి అయేలోగా ఈ సహాయం 50000 గ్రామాలకు విస్తరింపబడుతుందన్న మాట."

అని ఆలిండియా రేడియో ఢిల్లీ కేంద్రం నుంచి 10–8–1955 తేదీని ప్రచారం కావింపబడిన ప్రసంగంలో శ్రీమతి దుర్గాబాయి దేశ్‌ముఖ్ అన్నారు. శ్రీమతి దేశ్‌ముఖ్ ఇంకా ఇలా అన్నారు.

గడచిన రెండు సంవత్సరాలలోనూ కేంద్ర సంక్షేమ సంస్థ త్రివిధ బాధ్యతలు నిర్వహించింది.

1. యావత్తు దేశంలోని స్వచ్ఛంద సేవాసంఘాలకు ధన సహాయం చేయడం.

2. గ్రామ సంక్షేమ విస్తరణ ప్రణాళికలను గ్రామీణ ప్రాంతాలలో వల అల్లినట్లు సమకూర్చడం.

3. పల్లెప్రాంతాలలో సమర్థతతో కృషి చేయుటకు తగిన సంఘ సేవకులకు, ఆరోగ్యరక్షక సేవికలకు శిక్షణ ఇవ్వడం.

శ్రీమతి దేశ్‌ముఖ్ ఇంతవరకు 2000 ఐచ్ఛిక సేవా సంస్థలకు సహాయం జరిగిందని అన్నారు. కేంద్ర సాంఘిక సంక్షేమ సంస్థ గడచిన రెండు సంవత్సరాలలోనూ కావించిన కృషి సంతృప్తికరమైనదని భావిస్తూ ముమ్ముందు ఇతోధికమైన కృషి జరగగలదనే ఆశతోనూ విశ్వాసంతోనూ ఉన్నది అని కూడా అన్నారు. వారి ప్రసంగంయొక్క పూర్తిపాఠం ఈ దిగువ పొందు పరచబడినది.

ప్లానింగ్ కమిషన్ వారి శిఫారసులను పురస్కరించుకుని కేంద్ర ప్రభుత్వం కేంద్ర సాంఘిక సంక్షేమసంస్థను నెలకొల్పి ఈనాటికి దాదాపు 2 సంవత్సరములైనది. ఈ సమయంలో, గత రెండు సంవత్సరాలలో జరిగిన కృషిని గూర్చి సమీక్షించుకొనుట చాల ఉపయోగకరం.

మన ఆశలూ, ఆశయాలూ నెరవేరుటకూ ఇకముందు జరుగవలసిన కార్యక్రమ పరిశీలనకూ కూడా ఉపయోగపడుతుంది. భారతదేశంలో సాంఘిక సంక్షేమ కృషి యొక్క పురోగమనాన్ని విలువకట్టే ప్రయత్నంకూడా ఉచితమేను.

గత రెండు సంవత్సరాలలోను కేంద్ర సాంఘిక సంక్షేమ సంస్థ త్రిముఖమైన బాధ్యతలను నిర్వహించింది.

మొట్టమొదట సాంఘిక సంక్షేమ సాంఘిక సేవా రంగములలో కృషిచేయు స్వచ్ఛంద సంస్థలకు ఆర్థిక సహాయం చేసింది. తద్వారా తమ కార్యక్రమాలను విస్తృతం చేసుకొని, బీదలకు, నిరాధారులకు సంఘంలో నిస్సహాయులయినవారికి సేవచేయుటకు ఉపయోగకరమైన అవకాశాలను కల్పించింది.

రెండోది దేశం అంతలోనూ గ్రామ సంక్షేమ విస్తరణ ప్రణాళికలు అల్లుకుపోవునట్లు స్త్రీ శిశు సంక్షేమం ప్రధాన కార్యక్రమంగా పెట్టుకుని నిర్మాణం కావించింది.

మూడోది గ్రామసేవికలకూ ఆరోగ్యరక్షణ సిబ్బందికీ తగిన శిక్షణ ఇవ్వడం. వీరు గ్రామాలలోనే నివసించి, పల్లెప్రజలతో పనిచేసి స్త్రీ శిశు వికలాంగుల సహాయ

కార్యక్రమానికి దోహదంచేసి ప్రతిపల్లెలోనూ మాతా శిశు రక్షణకి అవకాశాలు కల్పించింది.

గత మూడు మాసాలలోనూ చరిత్రదృష్ట్యా కూడా గొప్ప విశేషం ఉంది. ఎందుచేతననగా దేశంలో మొదటి సారిగా ప్రభుత్వం తమకు ప్రతినిధిగా కేంద్ర సంక్షేమ సంస్థను నిర్మించి సమాజంలో నీచంగా చూడబడే వర్గాలకీ, వికలాంగులకీ, బలహీనులకీ ఐచ్ఛికసేవను చేయు వారిని ఉత్సాహపరచి సహాయంచేసేబాధ్యతను వారికి ఒప్ప చెప్పింది. సాంఘిక సేవా రంగంలో అభివృద్ధిని వ్యక్త పరుస్తున్న ఈ కార్యక్రమంలో ఇంకొక ప్రత్యేకత ఉంది. ఇంతవరకూ బీదల సంరక్షణ ఉదారులైన వ్యక్తుల ధర్మంమనే ప్రధానంగా జరిగేది. ఇప్పుడు ఆదర్శమైన సాంఘిక సంక్షేమ సేవా నిర్వహణ వ్యక్తిగతంగాకాక, సంఘముయొక్క సమాజముయొక్క బాధ్యత అని గుర్తించబడినది. ఆయా విధుల నిర్వహణలో, సంస్థల యొక్క ప్రాముఖ్యత నొక్కి వక్కాణించబడినది. ఈ సంస్థలు ప్రజలయొక్క విరాళాలవల్లగాని, ప్రభుత్వాల సహాయం వల్లగాని నడుపబడుట మిక్కిలి అభిలషణీయము.

ఐచ్ఛిక సేవాసంస్థలకు ఆర్థిక సహాయం :

మాతా శిశు సంరక్షణనూ, వికలాంగులూ, అనాథుల యొక్క సాధారణ సంక్షేమ కృషులనూ నిర్వహించే వివిధ రాష్ట్రాలలో రెండు వేల సేవా సంస్థలకు కేంద్ర సంక్షేమ సంస్థయొక్క ఆర్థిక సహాయం లభించింది.

సాంఘిక సంక్షేమాభివృద్ధి బాధ్యత రాష్ట్రప్రభుత్వాలకి ఎంతో సమాజాలకీ అంతేననిన్నీ, దానిని వృద్ధి కావించే ఉత్తమమూ, ఫలవంతమూ అయిన విధానం రంగంలోని ఐచ్ఛిక సంస్థలూ, ప్రభుత్వమూయొక్క సహకార బాధ్యతలవల్లనే జరుగగలదనీ అందరికీ తెలిసినదీ, అందరూ అంగీకరించినదీ అయిన నిస్సంశయ విషయం.

ప్రభుత్వ ధనం. ప్రయివేటు సంస్థలు ఈపనిని నిర్వహించుటకుగాను తీసుకున్నప్పుడు, సరియయిన రక్షణయున్నూ జాగ్రత్తయున్నూ తీసుకొనవలయునన్న సంగతి అందరూ ఆమోదించినదే. ధనసహాయం ఎందునిమిత్తం ఇవ్వబడిందో ఆకార్యమునకు వినియోగింపబడుతున్నదని తెలుసుకొనవలెను.

మంజూరు చేసిన గ్రాంటులను ఆయాసంస్థలు ప్రయోజనకరముగానూ సవ్యముగానూ, ఖర్చుచేయున్నదీ లేనిదీ సరిచూడవలెను.

ప్రభుత్వ ధనంతో సరిసమానమైన సమన్వయ విరాళాలు ప్రత్యేక వ్యక్తులనుండియూ, యితర విధముగానూ ఆయా సంస్థలు పోగుచేసి సమాజముయొక్క అవసరములను తీర్చుచున్నదీ లేనిదీ చూడవలెను.

పైమూడు విషయములూ ముఖ్యముగా గమనించి కేంద్ర సాంఘిక సంక్షేమ సంస్థ సేవాసమాజములకు గ్రాంటులను మంజూరుచేయుచున్నదని శ్రోతలకు నమ్మకముగా చెప్పుచున్నాను.

సంక్షేమ విస్తరణ ప్రణాళికలు :

రెండువందల ఇరవై అయిదు విధములైన సంక్షేమ విస్తరణ ప్రణాళికలు అయిదువేల గ్రామములకు విస్తరిల్లునట్లు యిదివరకే ఆచరణలోనున్నవి. ప్రథమ పంచవర్ష ప్రణాళికా కాలం పూర్తి అయేలోపున ఇంకొక నూరు విధములైన ప్రణాళికలు ఆచరణలోకి తీసుకురాబడును. వీనివల్ల ప్రత్యేకవర్గములకు సంక్షేమసేవ జరుగగలదు. చాలకాలమునుండి నిర్లక్షింపబడుచున్న గ్రామీణ ప్రజలకు సమాజ విస్తరణ ప్రణాళికలవల్లా, జాతీయ విస్తరణ సేవ వల్లా ఏర్పడిన అభివృద్ధి పథకము తమ లాభం కొరకేనని కొత్త ఆశ, కొత్త జీవం కలుగజేయుచున్నది.

కేంద్ర సాంఘిక సంక్షేమ సంస్థయొక్క పథకములు పల్లెప్రాంతీయ శిశువులకు, స్త్రీలకూ వెనుకబడినజాతులకూ వారివారి బాధలనుండీ దారిద్ర్యమునుండీ విముక్తి కలగజేయగలదనే ఆశ కలిగించినవి. గ్రామ ప్రజలు ఏపథకములైనా తమలాభంకోసమేననితెలుసుకొన్నప్పుడువారు అత్యుత్సాహముతో సహకరించుటకు సిద్ధపడుదురు. సమాజాభివృద్ధికి వాస్తవంగా సంక్షేమ విస్తరణ ప్రణాళికలు పునాదులనుట నిర్వివాదాంశము.

ఉన్నదానితో సంతృప్తి పడతారు అనే నింద గ్రామీణ ప్రజలమీద ఉంది. స్వతస్సిద్ధంగా వారిలో అణగియున్న అంతశ్శక్తులను మేల్కొల్పి స్వయం సహాయకత్వమందూ, స్వయం శ్రేయోభివృద్ధియందు వారికి ఆకాంక్ష కలుగునట్లు చేయుటయే మా ముఖ్యోద్దేశము. తమ సహచరులయొక్క సేవయందు తమ జీవితములను

అంకితముజేసిన అనేక సేవా తత్పరుల సేవా పరత్వ మును బహిర్గతమును చేసి వారి అఖండమైన అంతశ్శక్తు లను వినియోగించుచున్నవి.

ప్రముఖ స్త్రీ సంక్షేమ సేవికలతోనూ, రాష్ట్ర ప్రభుత్వ ప్రతినిధులతోనూ నిర్మింపబడిన రాష్ట్ర సంక్షేమ సలహా సంఘములు నిర్వహించవలసిన విధులు చాల ముఖ్య మైనవి.

పల్లెప్రాంతములలో సంక్షేమ విస్తరణ ప్రణాళికలను ఆచరణలో పెట్టవలసిన బాధ్యత వీటిదే. కేంద్ర సంస్థ స్వచ్ఛంద సాంఘిక సేవా సమాజముల దరఖాస్తులపై యిచ్చు గ్రాంటులకు రాష్ట్ర సలహా సంఘములదే సిఫా రసుచేసే బాధ్యత. గ్రామసేవికలకు శిక్షణ ఏర్పాట్లు కావిం చుట వీటి ఆధ్వర్యముననే. చివరకు ఈ సలహా సంఘ ములు కేంద్ర సంస్థకును, రాష్ట్రప్రభుత్వములకునూ మధ్య సమన్వయపరచు రాయబారులుగా వ్యవహరించుచున్నవి.

ఈవిధముగా సలహా సంఘములు కేంద్ర సంస్థకు కన్నులుగానూ చెవులుగానూ పనిచేసి వాని పథకములను ఆచరణలో పెట్టుచున్నవి.

ప్రాంతీయ పరిస్థితుల పరిజ్ఞానముతో పనిచేయు ప్రణాళికా నిర్వహణ సంఘములద్వారా రాష్ట్ర సలహా సంఘములు తమ కార్యవిధానములను విస్తరణ ప్రాంతము లలో సాగించుచున్నవి. ముమ్ముందు నియమింపబడు ఆరోగ్యశాఖ ఉద్యోగులు, నిర్వహణ సంఘముల సన్నిహిత సహకారముతో పనిచేయగలవు.

వివిధ అంతస్థులకు చెందిన రెండువేల సంక్షేమ సేవి కలతో నెలకొల్పబడిన ఒక అపూర్వమైన యంత్రాంగం గత సంవత్సరమునుండియూ కృషిచేయుచున్నది.

సంస్థయొక్క పథకములను కార్యకలాపములను బొదుపుపరచి కేంద్ర సంస్థ ప్రచురణశాఖ కొన్ని కరపత్ర ములను ప్రచురించినది. దాని ఆధ్వర్యమున ఇంగ్లీషులో ప్రచురింపబడు మాసపత్రిక "సోషల్ వెల్‌ఫేర్" దినదినమూ జనాదరణ పొందుచూ సంక్షేమ కార్యకలాపముల సమా చారములను తెలియజేయుచూ యావత్తు దేశంలోని సంఘసేవకులకు సంక్షేమ ప్రబోధము చేయుచున్నది. హిందీలో కొద్ది వారములలో ప్రచురించబడు "సమాజ కల్యాణ్" ఇండియాలోని అశేష హిందీ భాషా ప్రజలకు ప్రబోధము కలగజేయగలదు. వివిధ రాష్ట్ర రాజధానుల నుండి పది పన్నెండు వివిధ ప్రాంతీయ భాషలలో సంఘ సంక్షేమ పత్రికలు వెలువడుచున్నవి. త్వరలోనే వెలువడ నున్న "సోషల్ వెల్‌ఫేర్ ఇన్ ఇండియా" అను ఉద్గ్రంథము సంఘ సంక్షేమముయొక్క వివిధ విషయ ములకు "స్టేండర్డ్ రిఫరెన్సు"గా ఉండగలదు అను సంగతి ఇక్కడ చెప్పకతప్పదు. భారత ప్రజలకు సంక్షేమ విజ్ఞానమును కల్పించుటకు కేంద్ర ప్రచురణశాఖ ముఖ్య మైన పాత్ర అధికంగా వహిస్తున్నది. రాబోవు కొద్ది సంవత్సరములలో ఈ కార్యము నిరంతరాభివృద్ధిని గాంచ గలదని ఆశించుచున్నాము.

సంఘ సంక్షేమమ్ముయొక్క ముఖ్యావసరమైన సమస్య లను గూర్చియూ కేంద్రముయొక్క అభివృద్ధిగాంచిన ప్రసిద్ధ కార్యకలాపములను గూర్చియూ విద్యాబోధక మునూ బలవత్తర ప్రచార సాధకమునూ అయిన ఫిల్ములు ప్రదర్శనములకై తయారగుచున్నవి. ఈ కార్యము ఇండియా ప్రభుత్వ సమాచారమంత్రిత్వ శాఖ సన్నిహిత సహకారమువల్ల జరుగుచున్నందుకు నాకృతజ్ఞత తెలుపు చున్నాను.

50,000 గ్రామాలకు విస్తరణ :

కేంద్ర సంస్థ తన ప్రధాన కార్యక్రమం ప్రస్తుతం కంటె చాల అధికం చేయుటకు సంకల్పించుకుంది. వచ్చే పంచవర్ష ప్రణాళికాకాలంలో ఇంకొక 5000 సేవా సంఘ ములను ఎక్కువచేసి తన కార్యక్రమం కొనసాగించ దలచుకొన్నది. ద్వితీయ పంచవర్ష ప్రణాళికా కాలం పూర్తయేలోగా ఇంకొక 1030 గ్రామ ప్రణాళికలను ఎక్కువచేయడానికి సంకల్పించుకొన్నది. దీనివల్ల 1961 నాటికి దేశం అంతలోనూ గల 5000 గ్రామాలు స్త్రీ శిశు బాధితులకు సంక్షేమ ప్రయోజనాలు సమకూర్చుతుం దన్నమాట.

ఈ కార్యాలు గ్రామప్రాంతాలకేకాక. పట్టణ ప్రాంతా లకుకూడా విస్తరింపజేయడానికి కొత్తగా తలపెట్టాం. కార్మికస్త్రీలు కూలీ పనికి వెళ్ళే స్త్రీలు తాలూకు పిల్లలను సంరక్షించడం, జైలునుంచి విడుదల అయి తిరిగి వచ్చి పని పాటలు లేకండా తిరిగేవారికి పని కల్పించడం, ఇళ్ళూ వాకిళ్ళూ లేకండా నిరాధారులై శక్తిహీనులైన ముసలి వాళ్ళూ, నేరాలుచేసేబాలలూ దిక్కులేనివారూ మొదలైన

సాంఘిక సంక్షేమ సేవ

వాళ్ళకి ఆధారం కల్పించడం మొదలైన కార్యక్రమాలు అనేకమందికి ఇంతవరకూ లేనిచోట్ల నెలకొల్పుటకు రెండవ పంచవర్ష ప్రణాళికలో కేంద్ర సంస్థ అమలు జరిపే ఏర్పాట్లు చేస్తున్నది. రికామీగా తిరిగేవాళ్ళకి వారి అభిరుచులకు సరియైన సరదా వృత్తులూ ఆటస్థలాలూ కూడా కల్పించేపథకాలు ఇందులో ఉన్నాయి.

ఇలాంటి ఏర్పాట్లు వాస్తవపరిస్థితులూ అవసరాలూ పూర్తిగా తెలుసుకుంటేగాని తగినట్టుగానూ, సంతృప్తికరంగానూ నిర్వహించలేముగనుక, కేంద్ర సాంఘిక సంక్షేమ సంస్థ అందునిమిత్తమై రెండు సహాయ సంఘాలను నెలకొల్పింది. ఒకటి జైలునుండి విడుదల అయిన బాలనేరస్థులకు తరవాత వృత్తులను కల్పించేది. రెండోది నైతిక ఆరోగ్యం, స్త్రీలలో పడుపువృత్తి వీనికి సంబంధించిన సమస్యలను గురించి పనిచేసేదిన్నీ. కొద్ది వారాలలో ఈ రెండు సంఘాలయొక్క నివేదికలూ కేంద్ర సంస్థకు వస్తాయి. ఈ బాలనేరస్థుల జాగ్రత్త విషయంలోనూ, దుర్నీతి వ్యాపార నిర్మూలన విషయంలోనూ వారి సిఫారసుల ననుసరించి సక్రమమూ, సవిస్తరమూ అయిన కార్యవిధానానికి పునాదులు వేయబడతాయి.

తన కార్యకలాపాలలో సత్ఫలితాలు పొందాలంటే సంక్షేమ సంస్థకు న్యాయశాస్త్ర సహాయం ముఖ్యావసరం. సంఘ సంస్కరణ నిమిత్తం కావించే చట్టాలు ఆచరణలో నిష్ప్రయోజనమో లేక దుర్నీతిపరులు నిర్లక్ష్యభావంతో చూడడమో జరుగుతూ ఉంది. ఉదాహరణకు పడుపు వృత్తి నిర్మూలనయందు కృషిచేసే సంస్కర్తలు న్యాయశాస్త్రరీత్యా పిల్లలనూ స్త్రీలనూ పడుపువృత్తిలోనికి దింపే మధ్యతరగతి వారిని ఏమీ చేయలేకపోతున్నారు అలాగే యాచనా వృత్తిని నిర్మూలించడానికి కృషిచేసే సేవాపరులు దేశంలో బీదవారికి ఆశ్రయం ఇచ్చే శరణాలయాలుగాని సంస్థలుగాని లేకపోవడంవల్ల ఏమీ చెయ్యలేక పోతున్నారు. అందుచేత ఈ వృత్తులు నిరాఘాటంగా జరుగుతూనేవున్నాయి. ఇంకా అనేక సంఘదురాచారాలు చీడపురుగుల్లాగు పట్టుకుని విడిచి పెట్టడంలేదు. సాంఘిక అన్యాయాన్ని అరికట్టేవి, సాంఘిక సమానత్వాన్ని పురికొల్పేవి చట్టాలు, ఆచరణలో నిష్ఫలమైపోతున్నాయి. ఎందుచేతనంటే దేశంలో అందుకు పూనుకున్న సేవాతత్పరులను ఆదుకొనే ఆచరణయంత్రాంగము లేనందువల్ల. కేంద్ర సంఘం సేవా విధానంలోని లోటును తొలగించడానికి ప్రయత్నం చేస్తున్నప్పుడు, పార్లమెంటులోని చట్ట నిర్మాతలున్నూ చట్టాల ఆచరణలోని లోట్లనుకూడా సరిదిద్ది సహకరించవలసిన అవసరం ఎంతైనా ఉంది.

గ్రామ సంక్షేమ పథకాలకు పాటుపడుతున్న కేంద్ర సంక్షేమ సంస్థ పట్టణప్రాంతాలను అశ్రద్ధ చేస్తున్నదని అనడం సరియైనదికాదు. పట్టణప్రాంత ప్రజలకై కుటుంబ సంక్షేమ కృషి వాణిజ్య, ఉత్పత్తి మంత్రిత్వశాఖవారి సహకారంతో, కేంద్ర సంస్థ ఈవరకే పనిచేయుచున్నదని ఇక్కడ చెప్పక తప్పదు. దీనివల్ల మొట్టమొదటి ఫలితం, కొత్తఢిల్లీలో అగ్గిపెట్టెల కర్మాగారం. ఇందులో స్వల్ప ఆదాయంగల కుటుంబాలలోని 500 మంది స్త్రీలు, ఇంటివద్దా, ఫ్యాక్టరీలోనూ, అనేక విధాలుగా పని చేస్తున్నారు. వాణిజ్య పరిశ్రమల మంత్రిత్వశాఖ సలహాతోనూ సహాయంతోనూ ఇలాంటివే కర్మాగారాలు. విజయవాడలోనూ పూనాలోనూ హైదరాబాదులోనూ నిర్మించడానికి ఏర్పాట్లు అప్పుడే సాగుతూ ఉన్నాయి.

సుశిక్షిత సేవకులు :

గ్రామీణ ప్రజల సేవకు అనువైన గ్రామసేవికలకు ఆరోగ్యరక్షణ సిబ్బందికి తగిన శిక్షణ ఇచ్చి కేంద్ర సాంఘిక సంక్షేమ సంస్థయొక్క పథకం పల్లెజనుల వాకిళ్ళ వరకు సంక్షేమ కార్యములను తీసుకువెళ్ళడానికీ తగిన సిబ్బందిని సమకూర్చడానికీ ఏర్పాటు చేయబడింది. గ్రామాలలోని వివిధ ప్రాజెక్టు కేంద్రములలో వచ్చే ఐదేండ్లలోనూ నియమించవలసిన దాదాపు 8000 వేల గ్రామసేవికల శిక్షణ ఏర్పాట్లు, గొప్ప అనుభవం కలిగి ఐచ్ఛిక సేవకు పేరుగాంచిన కస్తూర్బా జాతియ నిధివారి ఆధ్వర్యమున నడుపుటకు ఒప్పచెప్పాము. 1600 మంది మంత్రసాని నర్సులకు, 600 మంది దాదులకు శిక్షణ ఇచ్చే కార్యవిధానపు ఏర్పాట్లు కేంద్ర ఆరోగ్య మంత్రిత్వ శాఖ ద్వారా దాదాపు పూర్తి అయాయి. కేంద్ర సంస్థ సేవా సంఘాలకు గ్రాంట్లు ఇచ్చి జరిగించిన కృషినీ, సంక్షేమ విస్తరణ ప్రణాళికల కృషినీ సంకలనం చేసేపథకం ఒకటి తలపెట్టబడుతూఉందికూడా. ఇది ఆచరణలో ఎలా పెట్టాలో ఆలోచనలో ఉంది. కాని గ్రాంటులు స్వీకరిస్తున్న కొన్ని సేవా సంస్థలను, కొన్ని సంక్షేమ కేంద్రాలనూ తమ తమ కార్యకలాపాలలో దృఢతరం

చెయ్యడం సాధ్యం అవుతుంది. ఇదిచేస్తూ ఇంకా కొన్ని కొత్త సంస్థలను, కొన్ని కొత్త ప్రణాళికలు నిర్వహించ డానికి నెలకొల్పడంకూడా సాధ్యం అవుతుంది.

ఉజ్వల భవిష్యత్తు :

పరిస్థితులను సమీక్షించి ఇక విరమిస్తాను. ఈ రెండు సంవత్సరాలనుంచి జరిగిన కృషికి కేంద్ర సంఘం సంపూర్ణమైన సంతృప్తిని పొందుతూ ఉంది. ఉజ్వల భవిష్యత్తు కలదనే దృఢవిశ్వాసంకూడా సంస్థకు ఉన్నది. ఇంత విశాలమైన దేశంలో, ఇన్నిన్ని కార్యాలు ఆచరించ డానికి రెండు సంవత్సరాలు ఒక పెద్ద కాలంకాదు కాని ప్రారంభంలో ఉత్సాహకరమైన ఫలితాలను కనపర చిందిగనుక సంతృప్తికరమైన పురోభివృద్ధి త్వరలోనే సాధించగలమని ఆశిస్తున్నాము.

ఇటు ప్రభుత్వఉద్యోగులలోనూ జనసామాన్యంలోనూ అటు సంక్షేమ సేవాకర్తలలోనూ, సాంఘిక దృష్టి ఉద యించడం ప్రస్తుతపరిస్థితియొక్క ముఖ్యమైన లాభకర మైన విషయం. ప్రజలయొక్క సాంఘిక పురోభివృద్ధిని గూర్చీ, సాంఘిక న్యాయాన్నిగురించి ప్రణాళికలో పొందు పరచబడిన విషయములు, వివిధ సందర్భాలలో, వివిధ ప్రదేశాలలో మాకు నిరంతరమూ జ్ఞాపకంవస్తూఉంటాయి.


అనేకమైన పథకములు తేలికగా నిర్వహించుటలో కేంద్ర సంక్షేమ సంస్థకు విద్యామంత్రిత్వశాఖ సహకారం తోనూ యావత్తు దేశంలోని సంఘసేవా నిరతుల అఖండ సేవాదీక్షతోనూ, కేంద్ర సంస్థ, సాంఘిక సంక్షేమాభివృద్ధి కార్యకలాపాలలో ఇతోధిక ప్రయోజనాలను ముమ్మందు కాంక్షించుచున్నది.

ఈ సమయంలో భారతదేశంలోని యావత్తు స్వచ్ఛంద సేవా సంస్థలయొక్క ఉత్సాహపూరిత సహకారాన్ని కేంద్ర సాంఘిక సంక్షేమ సంస్థకు కలగజేయమని నేను ఆహ్వానించుచున్నాను ప్రజా సమూహాలలోని నిర్భాగ్యుల నుద్ధరించుటలో స్వచ్ఛందసంస్థలు సహకారంతో అత్యంత ప్రోత్సాహాన్ని కలగజేస్తున్నాయి. అలాగే భారతప్రభుత్వం తాలూకు ప్లానింగు కమిషన్‌వారుకూడా మాకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటూ ఎన్నో విధాల వారి సహాయ సహకారములను ఇచ్చి ప్రోత్సహిస్తున్నారు. వీరు కాక భారత ప్రభుత్వం మంత్రిత్వశాఖల అకుంఠిత సహకార సంపత్తులతో సేవాసంస్థలు భాగస్వాములుగా ఉండాలని ముందు ప్రసంగించాను. ఇప్పటికే సుస్థిరమైన భాగ స్వామ్యం ముమ్మందు పరస్పర ప్రయోజనాల నిమిత్తం బహుళమూ, పటిష్టమూ కాగలదని నమ్ముచున్నాను.

కేంద్ర సంక్షేమ సంస్థ కృషి మాత్రమేకాక, అనేక మంత్రిత్వ శాఖలుకూడా సంక్షేమ కార్యకలాపాలలో బాధ్యత వహిస్తున్నాయి. వీటి అన్నిటిలోనూ అత్యంత ప్రధాన పాత్ర వహిస్తున్నది షెడ్యూల్డు తరగతులు, కొండజాతులు, వెనుకబడినజాతుల సముద్ధరణకోసం హోమ్ మంత్రిత్వశాఖ ఆధ్వర్యమున నడపబడే ప్రత్యేక పాలన శాఖ. వారివారి రంగాలలోని సంక్షేమ కార్య కలాపములు నిర్వహించుటకు, విద్య, ఆరోగ్య, కార్మిక మంత్రిత్వశాఖలు బాధ్యతవహిస్తున్నాయి. కేంద్ర సంక్షేమ సంస్థ తన విధులలో ఒకటిగా ఎంచుకుని, వారివారి పాలనక్రింద జరిగే కార్యములలో సహాయము వాంఛించే వారికి ఆయా మంత్రిత్వ శాఖలతో పరిచయముచేసి, మంత్రిత్వ శాఖలు చేసే పనిని సమన్వయ పరచుచున్నవి.

మొత్తంమీద, వచ్చే పంచవర్ష ప్రణాళికాకాలం పూర్తి అయేలోగా, నిర్భాగ్యుల నిమిత్తమూ, బలహీనుల నిమి త్తమూ కావించే సంక్షేమ కార్యకలాపాలూ, సంఘసేవా ఇతోధికాభివృద్ధి గాంచగలదనియు, అంత మందు మనము శ్రేయోరాజ్యమునకు ఇప్పటికంటె దగ్గరగా రాగలమనియు ఆశించుచున్నాను.





"ఎవడు అర్హుడు?"

శ్రీ కొల్లకుదురు రాజశేఖరరెడ్డి

పూర్వము పినాకినీప్రాంతాన్ని "ప్రభాకరవర్ధనుడు" అనేరాజు పరిపాలించే వాడు. వర్ధనుడు కరుణాళువు. దయార్ద్ర హృదయుఁడు. ప్రజలను కన్నబిడ్డలవలె కాపాడి పరిపాలించే వాడు. రాజుకు నలుగురు పుత్రులు గలరు.

వర్ధనునకు వృద్ధాప్యం సమీపించింది. రాజ్యాన్ని కొడుకుల కప్పగించి తపోవనాలకు వెళ్ళి కాలం గడుపుదా మని నిశ్చయించాడు. కాని రాజ్యాన్ని నలుగురిలో ఎవరి కప్పగించేది అని రాజుకు సంశయ మొచ్చింది. వర్ధనుడు ఆలోచించి వారికి ఒక పరీక్ష పెట్ట దలచాడు. వెంటనే సభ ఏర్పాటుచేసి కొమరులను రావించి ఒక్కొక్కరికి ఒక్కొక్క ఫలమొసగి దీనిని మీరు ఎవ్వరును చూడకుండ తినవలయును అని చెప్పినాడు.

సూదిమొన మోపినంత సందు లేకుండా తలుపులు బిగించుకొని ప్రథమపుత్రుఁడు ఫలాన్ని భుజించాడు. ద్వితీయ పుత్రుడు నరులు లేని అడవికివెళ్ళి ఎవ్వరూ చూడకుండా పండును తిన్నాడు. మూడవవాడు తనఉద్యానవనములో గుబురుగా నున్న చెట్టెక్కి ఫలమును ఆరగించాడు కడసారివాడు. "వీరవర్ధనుఁడు" ఫలమును చేబుచ్చుకొని నిర్మానుష్య మైన ప్రదేశ మున కరిగాడు. వెంటనే పండును తిన బోయాడు కాని అతనిమనసులో ఏదో తట్టింది. ఎవరు చూచినను చూడకపోయినను భగవంతుడు ఎల్లప్పుడు చూచుచుండును. ఎవరి కళ్ళు గప్పినను, భగవంతుని కళ్ళుగప్ప ఎవరి సాధ్యము? కావున ఎవరునూ చూడకుండా ఈఫలమును తినలే మని నిశ్చయించు కొని బయలుదేరెను.

మరునాడు సభలో అందరు హాజరైరి తాము తిన్నవిధములను వివరించి, వివరించి చెప్పారు. వీరవర్ధనుఁడు తనమనసులో తట్టిన విధానమును తండ్రికి తెలిపాడు. ప్రభాకరవర్ధనుఁడు సంతోషముతో కడసారివాని తెలివికి మెచ్చి ఇతడే నాసింహాసనానికి అర్హు డని తెల్పి పట్టాభిషేకం చేశాడు.

★ ఆత్మహత్య! ★

"శ్రీ గిరిధర్"

ఆ యింట్లో సులోచన నానా బాధలూపడు తోంది. సులోచన పెండ్లి అయిన తర్వాతఆరు నెలలవరకూ పుట్టింట్లోనే వుంది. అందుకు కారణంవుంది. -సులోచన తండ్రి ఒకగుమాస్తా. సులోచన తల్లిలేని పిల్ల. ఎంతో గారాబంగా పెంచాడతను

చలం బి. ఏ ప్యాసయ్యాడు. ఏదోవుద్యోగంకూడా చేస్తున్నాడు. సులోచనని చలంకి యిచ్చి పెళ్లిచేశారు. -సులోచన తండ్రి, పెళ్లినాటికి అడిగినంత కట్నం యివ్వలేకపోయాడు. తర్వాత యిస్తానని ప్రాధేయపడ్డాడు. పెళ్లి మాత్రం ఆగిపోకుండా జరిగిపోయింది.

కాని కట్నం అంతా యిచ్చేవరకూ, కాపురానికి పంపవొద్దన్నాడు చలం తండ్రి. —సులోచన తండ్రి కూతురుని తనదగ్గర్నేవుంచుకొని, ఆరునెల్లకూ కొంత డబ్బుచేశాడు. కట్నం రూపాయలయితే బావుండు! వందలూ, వేలే!

ఈ ఆరునెల్లకే లోకం, నోటి కొచ్చినట్టూ కూసింది! లోకం:! దీన్ని ఎదిరించడం కష్టమే!

"బావా! పెళ్లయిన పిల్లని యింట్లో వుంచుకోడం బావుండదు! మిగతాదికూడా, అవసరమయితే వడ్డీతోసహా రెండునెలల్లో యిచ్చుకుంటాను!" అంటూ బ్రతిమాలాడు చలం తండ్రిని అతను.

అత్తగారి బాధలు అంతా పడ్డారు, భర్త దగ్గరుండటమే పదివేలుఅనుకున్నాది సులోచన. - అయితే కోడరికం సులోచన అనుకున్నంత తేలిక గాదు!

"ఛీ:! ఈ దిక్కుమాలిన సంబంధం యెక్కడ దొరికిందోగాని, చస్తున్నాను!" అన్నాది ఒకనాడు అత్తగారు. సులోచనని ఎన్ని తిట్టినా, అలాపూరు కునే వాడు చలం!

ఒక రోజు అడిగింది- "ఏమండీ! నావల్ల తప్పేముంది? మీ అమ్మ రోజూ నన్నిలా తిడతారేం!" అని.

"తప్పు లేకుండా యేమీ అమ్మ అనదు!" అన్నాడు భర్త.

"ఏముందీ! కట్నంయివ్వలేదనే కదా!" అన్నది సులోచన.

"నోర్ముయ్.... ! నీ వెధవ కట్నంకోసం మా అమ్మ ఆశించిందా? నువ్వెంత. నీ కట్నంయెంత? నీ కంటే ఎందరో అందమయిన వాళ్లు. కట్నంయివ్వగల వాళ్లూ వున్నారు! —" ఇంకా ఏవో అనరాని మాటలన్నాడు చలం.

సులోచన గుండెల్లో శూలాల్లా గుచ్చు కున్నాయీ మాటలు. ఆమెకు బ్రతుకు మీద రోత పుట్టింది-సులోచన అనుకుంది భర్తకు తనమీదప్రేమవుందని. కాని యిప్పుడు తెలిసింది, తనమీదప్రేమ లేదని.

'ఛీ! వీళ్ళు, నాన్నగారు కట్నం అంతా తెచ్చి యిచ్చినా నన్ను హీనంగానే చూస్తారు." అని గ్రహించింది. ఒక వేళ ప్రేమగాచూసినా, ఆప్రేమ తనమీదగాదు డబ్బుమీద!

ఆ బావి చుట్టూ జనం మూగారు! సులోచన శవాన్ని బయటకు తీశారు! -ఎవరికి తోచింది వాళ్ళు చెప్పు కోవడమేకాని, సులోచన మాత్రం తన ఆత్మ హత్యకు కారణం రాసింది గాదు!

సులోచన చచ్చిపోయిన, మరుసటి సంవత్సరమే తిరిగి చలం పెళ్లిచేసుకున్నాడు. ఆయన సులోచన కోసం రవంతయినా విచారించలేదు! అంతకన్నా ఎక్కువ కట్నంతో, మరింత వైభవంగా పెళ్లి చేసుకున్నాడు.

పాపం! స్త్రీ ఆత్మ హత్య చేసుకుంటుంది! అంతకన్నా వేరేదారి వుందేనా! పురుషుడు మాత్రం మూడో పెళ్ళికూడా చేసుకో గలడు!

'కందుకూరి'

శ్రీ మండా రామారావ్

సంఘ దురాచారము లకు
బలియై పలుబాములొందు
అనాయకుల నుద్ధరింప
అచంచల దీక్షను పూనిన
ఆంధ్రుల ఆశాదీపం
ఆదర్శం 'కందుకూరి'
మనవాడోయ్ మరువకండి
మణిపూసని తెలుసుకోండి—

పసితనమున వివాహాలు
చేసే మూర్ఖ ఛాందసులు
సంఘపు చీడపురుగు లని
సత్వరము నశించా లని
బాల్య వివాహములు మాన్పి
భ్రాంతులను పోద్రోలుచు
పాటుపడిన కార్యవాది
మనవారు 'కందుకూరి'—

'నా' అనెడు వారు లేని
అనాథ శిశువులను చేర్చి
వైవాహిక సౌఖ్యమ్ముల
జీవితానందమే లేని
స్త్రీ జాతికి అమిత సేవ
చేయుటకై దృఢమైన
రక్షణ కల్పించినట్టి
సచ్చరితుడు 'కందుకూరి'—

ఆంధ్ర ప్రజా కోటిలోన
నవ్యత్వము చేకూర్చను
చైతన్యము కల్గించను
విజ్ఞానము వెదజల్లను
కలంచేత పట్టి రచన
సాగించి సమాజమ్మున
మార్పులను తెచ్చినట్టి
చిరంజీవి 'కందుకూరి'—

★

ఆంధ్రసారస్వతము

శ్రీమతి కొత్తపెంట విజయలక్ష్మి

దేశభాషల లెస్సయౌ తెనుగు తల్లి
ఆది- కవిబ్రహ్మనన్నయ అధికు డతడు
కుడువ బెట్టె గదమ్మ ముంగోరు ముద్ద
ఖడ్గ తిక్కన గేహాన కాదటమ్మ

పరిఢవిల్లి- సంపదైన పాయసంబు
శంభుదాసుని చేతిలో చక్రకేళి
అందుకొంటివి గాదమ్మ వందమార్లు
ఒంటిమెట్టను తాతయ్య వంటయింట

కమ్మగాచిన గోదారి కరుడు లెన్నొ
సరస శృంగార సాహిత్య చక్రవర్తి
మహిత ప్రఖ్యాతు శ్రీనాథు మందిరాన
అందుకొన్నావు బంగారు టందలంబు
ఇస్తె- పెద్దన్న తాతగారింటి నుండి
వేసికొన్నావు బంగారు కాసులెన్నొ

సరియె -రాణివై నావమ్మ వీరభద్రు
డింకెటుల పోషించెనో ఏమిచెప్ప
దివ్య గానముల ప్రోక దే దీప్యమాన
సరస సమరస సాహితీ శాస్త్రవీణ

అంజలి ఘటింతు దాసిని యమ్మనీకు
దీవనలిడి మముబ్రోవవే దివ్యమతివి

★ కమల తెలివి ★

శ్రీ పిళ్కా సుబ్బారావు శాస్త్రి

కమలకి తగనిభయం. కమల రామారావుగారికి భార్య. తెలివయినది, చదువుకున్నది గూడ! ఆడదానికి భయం సహజమే. అయితే ఆడవాళ్ళేపూర్వంరోజుల్లో రాజ్యాలు చేసేవారు, యుద్ధాలకి వెళ్ళేవారు. కాని ఇవి పూర్వం రోజులు గావుగా!

రామారావుగారు ఆఫీసుపనిమీద ప్రక్కవూరు వెళ్లాల్సి వచ్చింది. అది పగలేతెలిస్తే బావుణ్ణు. రాత్రి తెలిసింది. ప్రయాణంకూడా అప్పుడే! రామారావుగారి యిల్లు అందరి ఇళ్ళకంటే ఎలాగయిన దూరమే! ఆరాత్రిపిలిస్తే మాత్రం కమలకి సహాయంగా పడు కుందుకు ఎవరువస్తారూ! ఆయింట్లో రామారావుగారు, కమల తప్పితే, ఆవిడకి పిల్లలుకూడా లేరాయె.

"ఎందుకు కమలా భయం! అంతభయమయితేయెలా? ఒక్కరాత్రేకదా! రేపు సాయంత్రానికల్లా నేనేవస్తాను. ధైర్యంగా పడుకో!" అంటూచెప్పి వెళ్ళిపోయారు రామారావుగారు. అవునుమరి. సొంతపనికనుకనా ఉండి పోవడానికి. ఆఫీసుపని. వెళ్ళకుంటే వుద్యోగమేవూడు తుంది. కమల కూడాభర్త మనసు కష్టపెట్టదల్చు కోలేదు.

దీపం చిన్నదిచేసి, పడుకుంది. పడుకుందే కాని నిద్ర పట్టలేదు. అందులో ఆరోజునే వుదయం అందరూ చెప్పుకుంటూ వుండగా విన్నాది—శేషయ్యసెట్టిని దొంగలు చంపేసి, డబ్బంతా దోచుకొనిపోయా రని, రామారావు గారు జమిందార్లుగాక పోయినా, కమలకి పుట్టింటి వాళ్ళు పెట్టిన నగ బాగానే వున్నది,

గంగడు పేరు మోసిన గజదొంగ. శేషయ్యసెట్టిని చంపిందికూడా వాడే అని అందర అనుమానం, వాడి పేరు చెబితే ఆ చుట్టుపక్కల గ్రామాల వాళ్లకి గూడాహడలే....!

'దభీ' మని శబ్దం అయింది. కమలగుండెల్లో రాయి పడింది. గజగజ వణికిపోయింది. కటక్కున నాలుక కరుచుకుంది, యింట్లోనుంచి దొడ్లోకి వుండే తలుపు గడియ వెయ్యటంమర్చే పోయింది—నోటమాట రాకుండా అలానే కూర్చుండిపోయింది దొంగని చూస్తూ.

"పిల్లా! నేనె వర్నో తెలుసా? — నిన్నగాకమొన్న స్వర్గానికి పంపేనే శేషయ్యని, ఆ గంగణ్ణి....! అహవా....హాహాః...!" వెకిలిగా నవ్వేడుగంగడు. నల్లని శరీరం, బొద్దుమీసాలు, నల్లని లంగోటీ, వాణ్నిచూస్తే నిలువునా ప్రాణాలుపోతాయి.

కమలకి ముచ్చెమటలు పోసేసినై! "నువ్వురోజూ పెట్టుకునే నగలేవి? దాచేశావా?? మంచి పనిచేశావు, నాకు కష్టం లేకుండా....; ఎక్కడ దాచావు??? ఊఁ..." —గంగడు హుంకరించాడు.

కమల ముందు ఆలోచించింది. గంగడుఅరిస్తే చంపే స్తాడని తెల్సుకుంది. వాడిచేతిలో 'తళతళా' మెరుస్తోంది చాకు— ప్రక్కనేవున్న చిన్నగదిలోనని సైగచేసింది, కాని నోట మాట రాలేదు.

గంగడు తాళాలు అడిగేడు. తలగడ క్రిందనుంచి తీసియిచ్చింది. గంగడు గదిలోకి వెళ్తూ తిరిగివచ్చేడు. తిరిగి కమల గుండెల్లో రాయిపడింది. గంగడుకమలవోణీ కొంగు పుచ్చుకున్నాడు. కెవ్వనకేక వేయబోయింది. గంగడుచాకు చూపించాడు.....కమల వోణీ కొంగును తన లంగోటీకి ముడి వేసుకున్నాడు. తనుడబ్బు తీస్తూ వుండగా వెళ్ళిఅందర్నీ పిలుచుకు వస్తుందేమోనని!

గంగడు పెట్టెతాళాలుతీసిడబ్బు.నగలూఅవీతీస్తున్నాడు కమల దూరంగానుంచుంది. — కమలమెల్లగా 'వోణీ' తీసేసింది. వోణీని మేకుకు తగిల్చి బయటకి వచ్చేసి తలుపు గడియవేసేసింది!

వెంటనే మరో వోణీ కట్టేసుకు దగ్గరగావున్నయిళ్ళకి వెళ్ళి చెప్పింది. ఇంకేముంది, అంతా బడితలతో ప్రవేశిం చారు కమల యింట్లోకి....!

గంగడు తలుపు బద్దలు కొడదామని ప్రయత్నించాడు కాని లాభంలేక పోయింది. అదిచిన్నగది, చిన్నకిటికి తప్పితే వేరేమార్గంలేక పోయింది. ఒకవేళ కిటికీ ఊచలు వంచినా అందులో తలతప్పితే శరీరం పట్టదు....! మొత్తంమీద గంగడు దొరికి పోయాడు! సంవత్స రాలుగా వెతుకుతున్న పోలీసులకి కాదు!! కమలకి!!! కమలని అంతా ఎంతగానో మెచ్చుకున్నారు. ఆమెకి బహుమతులు కూడా యిచ్చారు.

తీరని సమస్య

రచన :
శ్రీ మధిర భానుమూర్తి

సోమేశ్వరరావుగారికి ఈసమస్య ఇవాళే క్రొత్తగా ఉద్భవించిందికాదు. ఎన్నాళ్ళుగానో ఎదుర్కొంటూనే ఉంది. ఎప్పటికప్పుడు మాత్రం వాయిదావేస్తూవచ్చారు అనేక కారణాలవల్ల. రాను రాను దాని రూపం మరింత వికృతమవుతూందేకాని ఏమీ తేలి కవటంలేదు. దానిని గురించి ఆలోచించిన కొద్దీ మతిపోతుందా అనిపిస్తోంది. అంతజటిలంగా తయారవుతుంది నానాటికి. ఇంత విపరీతంగా తనని ఆ సమస్య ఎదురుకుంటుందని తనకి ముందే తెలిసిఉంటే తానసలు దానిని ఇంతకాలంగా వాయిదా వేసేవాడుకాదు. ఏదో ఒకవిధంగా అప్పుడే పరిష్కరించి ఉండేవాడు. ఇవన్నీ ఇవాళ అనిపిస్తున్నాయి గాని ఆనాడు ఏమైనా తోచాయా ?...ఇది గతజలసేతు బంధనంతప్ప ఇంకేమీకాదు....ఇకముందు చెయ్యవల సిందేమిటో ఆలోచించుకోవాలిగాని జరిగిపోయినవాటిని ఎన్నిసార్లు స్మరించుకుంటే మాత్రం ప్రయోజనమేమిటి ? ఇదంతా తన అప్రయోజకత్వం వల్ల ఇలా జరిగిందని తన్ను తాను నిందించుకోవటంకూడా కద్దు. ఎవరిని నిందించినప్పటికీ ఏమీ లాభంలేదు....లాభం లేదని తెలిసి ఉండికూడా నిందించటం మానటంలేదు...ఎందుకో తనకే తెలియదు – వెనకటివి తలపోసుకోవద్దనుకున్నాడు ఎన్నో సార్లు. దానివల్ల లాభంలేదని...అయితేనేం ? తలపోసు కోకుండా ఉండలేకపోతున్నాడు. ఎప్పుడు ఈవిషయాన్ని గురించి ఆలోచించినా వెనకటి విషయాలన్నీ వరసగా గుర్తుకువస్తాయి. జరిగిన పదేళ్ళ సంఘటనలు కళ్ళముందు వచ్చి నుంచుంటాయి. పొమ్మన్నా పోవే !....అవ్వి తన మనోఫలకంమీద అంతగాఢమైన ముద్రవేసుకున్నాయి కాబోలు !

అసలు ఈ సంగతులన్నీ ఇవాళ గుర్తురావటానికి కారణం జానకి పెళ్ళి ప్రసక్తిరావటమే !...ఆ ఐ.ఏ. యస్. చదివిన కుర్రాడు చువుకోని పల్లెటూరి పిల్లనే తప్ప పెళ్ళాడనంటున్నాడని తెలియడమే !....ఆ అబ్బాయి - కామేశం – ఎం.ఏ. ప్యాసయాడు. ఒక కాలేజీలోజేరాడు. అక్కడే ఉంటూ కష్టపడి చదివి ఐ.ఏ.యస్. పరీక్ష ప్యాసయాడు. సర్కారువారు అతనికి తగిన శిక్షణనిచ్చి ప్రస్తుతం డిప్యూటీ కలక్టరుగావేశారు. మంచి సాంప్రదాయమైన కుటుంబంలోవాడు. రూపవంతుడు. గుణవంతుడు. అన్నిటికన్నా ముఖ్యంగా కట్నంకానుకలమీద అంత ఆశలేదని తెలిసింది. తను తన కూతురినిస్తే బాగుంటుందనుకున్నాడు. ఈడూ జోడూ బాగుంటుంది. పైగా జానకికూడా బి.ఏ. వరకూ చువుకుందిగనక తప్పకుండా ఆ కుర్రాడు చేసుకుంటా డని ఆశించాడు. ఆ ఆశతోనే పిల్లనిస్తానని వెళ్ళాడు. అయితే తన ఆశ అంతా క్షణంలో మాయమయింది. ఆ అబ్బాయి చదువుకున్న పిల్లని చేసుకోనని, పల్లెటూరి పిల్లనే చేసుకోవాలనుకుంటున్నాననీ చెప్పాడు. కారణం అడిగాడు సోమేశ్వరరావుగారు. పట్నవాసాల్లో ఉండి చదువు సంధ్యల్లో ఉండే పిల్లకి తన షోకులమీద ఉండే శ్రద్ధ పనిపాటలమీద ఉండదని, సాధారణంగా వారిలో చాలమందికి పనిపాటలు చేతకావని తను నమ్మడంచేతనే ఆ నిశ్చయానికి వచ్చినట్టు చెప్పాడు అతను. జానకి బి.ఏ. చదివినప్పటికీ దానికి తగని షోకు లేమీలేవని, పనిపాటలన్నీ చక్కగా చెయ్యగలదని తను ఎంతో నచ్చ చెప్పాడు కుర్రాడికి. ఎంతగా చెప్పినా ఏమీ లాభంలేక పోయింది. పోనీ ఒకసారి వచ్చి పిల్లని చూసుకుని తరువాత ఏమాటా చెప్పమనికూడా బ్రతిమాలాడు. కామేశం 'ససేమిరా !' అన్నాడు. ఒక్కసారిగా కోపం, ఏడుపూకూడా తనను ఆవహించాయి. అవన్నీ దిగ మ్రింగుకుని అతని దగ్గిరనుంచి వచ్చేశాడు.

ఆరోజు ఇంట్లో ఎవరితోనూ ఆయన సరిగా మాట్లాడ లేదు. ఎక్కడ ఉన్నా, ఏపని చేస్తున్నా ఒకటే ఆలోచన. ఏ చిన్న విషయాన్ని గురించైనా ఎంతో చిరాకు ప్రదర్శించాడు. ఇంటిల్లపాదిమీదా కోపమే అకారణంగా – అయితే వాళ్ళకందరికి ఈయన ఇలా ఉండటానికి కారణాలు తెలుసును. ఇదివరకెన్నోసార్లు వారు ఆయనను చూశారు. అలాంటి స్థితిలో....అందుచేత వారికిదంతా కొత్తేమీకాదు. కనక ఎవరిమట్టుకు వాళ్ళే తప్పుకుతిరిగారు.

ఆరోజల్లా ఒక కుర్చీలో కూచుని ఆలోచిస్తూఉన్నాడు. ఆ ఆలోచన ఎప్పటికి తెములుతుందో ఆయనకేతెలియదు. ఆ ఆలోచనలోనే వెనకటి సంగతులన్నీ ఆయనకళ్ళ ముందు నిలిచినై. పదేళ్ళ చరిత్ర ఒక్కసారి కళ్ళముందు తిరిగింది.

అది సరిగ్గా పదేళ్ళనాటిమాట. అప్పటికి జానకి పదమూడేళ్ళు. హైస్కూలులో చదువుతోంది. మనమరా

పెళ్ళిచూసి మరీకన్నుమూయాలని ఎంతో అల్లాడేవాడు తన తండ్రి. కాని అప్పట్లో పిల్లకి పెళ్ళిచెయ్యటం తనకి ఇష్టంలేదు. తనకి తెలుసు పెళ్ళయిన మరుక్షణాన్నుంచే పిల్లని చదువు మానిపించాలని. జానకిని చదువు మానిపించడం తప్పనిపించింది తనకి. ఎంతో బాగా చదువుతోంది. ఫస్టుమార్కులన్నీ దానివే. అంతచురుకైన పిల్లని స్కూలుఫైనలేనా అవనిదే చదువు మానిపించకూడదనుకున్నాడు. "ఇంతవరకూ చదివింది చాలు. ఇంకా చదివి ఈవిడ ఊళ్ళేలాలా?....ఉద్యోగాలు చెయ్యాలా?... ఈపాటికి చదువు కట్టిపెట్టించి పిల్లని అయినవాడి చేతులో పెట్టు" అనేది అమ్మ. ఆవిడ ఎప్పుడూ అంతే! ఆడపిల్లలకి చదువు అక్కర్లేదంటుంది. జానకిని బళ్ళో వెయ్యటమే ఆవిడకసలు ఇష్టంలేదు. అంతా పూర్వకాలపుమనిషి. ఆవిడకు ఎవరూ చెప్పలేరు. ఎవరేనా ఆవిడతో వాదించబోతే "మా అమ్మకి చదువుందా? మా అమ్మమ్మకి చదువుందా?....మా తాతమ్మకి చదువుందా?.... మరి మేమంతా కాపరాలు చెయ్యలేదా? పిల్లల్ని పెంచలేదా? మాకు ఈ చదువులు లేకపోతే ఏంలోటయింది?" అని పదితరాల వెనకనించి ఉదాహరణలిస్తుంది. అందుచేత ఆవిడతో వాదించి లాభంలేదు. అది గ్రహించే తను వాదన పెంచుకోలేదు. తననుకున్న ప్రకారం హైస్కూలు చదువు పూర్తయేవరకూ పిల్ల పెళ్ళి ప్రసక్తి ఎవరినీ తేనివ్వలేదు. తన భార్య మాత్రం ఒకటి రెండు సార్లు చెప్పి చూసింది. కాని లాభంలేక ఊరుకుంది. చేసేదేమీలేక.

జానకి జాగ్రత్తగా చదువుకుని స్కూలుఫైనలు పరీక్షకు వెళ్ళింది. బాగానే వ్రాసింది. తనకోరిక తీరింది. ఇక ఆనాటినుండి జానకికి సంబంధాలు వెదకాలని నిశ్చయించాడు. ఎక్కడెక్కడున్న సంబంధాలను గురించి వాకబు చెయ్యటం మొదలుపెట్టాడు. ఆస్తి, పాస్తులు, చదువు సంధ్యలు అన్నీ వాకబుచేస్తున్నాడు. ఇంతలో రెండునెలలయి స్కూలుఫైనలు పరీక్షాఫలితాలుతెలిశాయి. జానకి ప్యాసయింది. అంతేకాదు. వాళ్ళ స్కూలుకి ఫస్టుగావచ్చింది. ఇంట్లో అందరూ ఆనందించారు. జానకికి పాఠాలు చెప్పిన పంతుళ్ళుకూడా ఎంతో గర్వించారు. ఆ స్కూలు హెడ్మాస్టరుగారు జానకిని పైకి చదివించమని సలహాయిచ్చారు. జానకి విషయం తెలిసి ఉన్న చాలమంది ఆసలహా బాగుందన్నారు. అంత తెలివైన పిల్లకి చదువు చెప్పించకపోవటం తప్పన్నారు. అందులోనూ ఆ ఊళ్ళోనే కాలేజీ ఉన్నప్పుడు జానకిని చదివించకపోవటం తనకికూడా అన్యాయంగానే కనిపించింది. అదీకాక ఇంకా ఏ సంబంధం సిద్ధంగాలేదప్పటికి. అందుకని 'పోనీ' అని జానకిని కాలేజీలో జేర్చాడు.

ఆమెను కాలేజీలో జేర్చాడన్న మాటేగాని అనుక్షణం ఆమె వివాహం విషయం తనను వేధించేది. ఒకవేళ ఎప్పుడైనా తను ఆ విషయం మరిచిపోతే తల్లి, తండ్రి, భార్య అందరూ జ్ఞాపకంచేసేవారు. వారంతా తనకి వ్యతిరేకులే. జానకిని కాలేజీలో జేర్పించకూడదంటారువారు. "ఇంట్లో కూచునిమాత్రం ఏంచేస్తుందని జేర్పించాడు తను. ఇది వారికర్థంకాదు....తనుమాత్రం తీవ్రంగానే ప్రయత్నంచేశాడు వరునికోసం. అయితే ఒక విశేషం. ఇదివరకటిలాగ ఏసంబంధంపడితే దానికని ఎగబడటం లేదిప్పుడు. ఇదివరకంటే పిల్ల హైస్కూలులోనే చదువుతుండేది గనక స్కూలుఫైనలు ప్యాసయినవాడినిగురించి కూడా వాకబుచేసేవాడు. కాని ఇప్పుడలాకాదు. పిల్ల ఇంటర్మీడియేట్ చదువుతోంది కనక వరుడు కనీసం గ్రాడ్యుయేటయినా అయిఉండాలి. అంతకు తక్కువవాడిని తనుతెస్తే అమ్మాయి వప్పుకోదు. ఒకవేళ అది మొహమాటపడి చెప్పనప్పటికి తనకిమాత్రంతెలియదూ?- ఇంటర్మీడియేట్ చదివేపిల్లకి ఎలాంటివరుణ్ణి తేవాలో;.... తెలుసు.... తను అన్యాయం చెయ్యడు.

ఇలాగతను వరుణ్ణి ఎన్నుతుంటే తనకి తెలియకుండానే కాలం గడిచిపోయింది. జానకి సీనియరుక్లాసులోకి వచ్చేసింది. పెద్ద పరీక్షలుకూడా దగ్గరకువచ్చాయి. కాలేజీలోకూడా తన పేరు నిలబెట్టుకుంది జానకి. కాలేజీకి ఫస్టువస్తుందనుకుంటున్నారంతా. పరిస్థితు లనుకూలిస్తే యూనివర్సిటీ ఫస్టుకూడా రావచ్చునట. అందుచేత ఆమె చదువుకు ఏవిధమైన అంతరాయం కలగకూడదనుకున్నాడు.

ఇంక ఒక నెలరోజుల్లో పరీక్షలనగా అన్నివిధాలా అనువైన సంబంధం ఒకటి తటస్థపడింది. అన్ని విషయాలు కుదిరినై. కాని మగపెళ్ళివారు వెంటనే పెళ్ళి చేసి పిల్లని చదువు మానిపించమన్నారు. ఇంతవరకూ చదివించినదంతా వృథాఅవుతుందనీ, ఇక ఒక్కమాసమే గనక అనుమతించవలసిందనీ ప్రాధేయపడ్డాడు తను. వాళ్ళు దానికంగీకరించలేదు. పెండ్లి కుమారుడు ఏదో దూరదేశానికి ఉద్యోగంమీద వెడుతున్నాడట. కనక

అతనితో వెంటనే పిల్ల వెళ్ళటానికి వప్పుకుంటేనే అంగీకరిస్తామన్నారు. ఇంతవరకూ పడ్డశ్రమ ఒక్కనెలలో ఒక రూపానికి వస్తుందనీ, సత్ఫలితాలనిస్తుందనీ ఆశించే సమయంలో జానకి చదువు ఆపడం ఇష్టంలేక ఆ సంబంధం వదులుకోవలసివచ్చింది. తల్లి, తండ్రి, భార్య తనని ఆడిపోసుకున్నారు....ఏమయినాసరే, ఈనగాసి నక్కల పాలుచెయ్యటం తనకిష్టంలేదు. అంతటితో జానకి వివాహం మళ్ళా వాయిదాపడింది.

కాలచక్ర గమనం చాలా చురుకుగాఉంది. జానకి పరీక్షలవడం, ఫలితాలు తెలియడం, ఆమె ఫస్టుక్లాసులో ప్యాసుకావడం....ఇవన్నీ ఒకదాని వెనుక ఒకటి తనకు తెలియకుండానే జరిగిపోయాయి. తన అభీష్టం సిద్ధించింది. తన కూతురు కాలేజీకి ఫస్టువచ్చింది. సరస్వతీ దేవి భూలోకంలో జానకిరూపంలో అవతరించిందన్నారు అంతా. ఆమె సాధించిన విజయానికి అందరూ సంతోషించారు. తమ బంధువుల్లో అంత తెలివైన పిల్ల ఉన్నందుకు గర్వపడ్డారు చుట్టాలంతా. అందరూ ఈ విషయాన్నిగురించే చెప్పుకున్నారు. తనని అభినందించారు ఆపిల్లకి ఉన్న తెలివితేటలకు కావలసిన ప్రోత్సాహమిచ్చి వృద్ధిలోకి తీసుకువచ్చినందుకు. తన తల్లి ఈ మాటలువిని కొడుకుతో అంది. "నాయనా ! ఇంతవరకూ ఏదో జరిగింది. నువ్వు చదువు చెప్పించినందుకు అదీ మాట దక్కించుకుంది....ఇకనైనా ఆలస్యం చెయ్యక పెళ్ళి ప్రయత్నంచెయ్ !" అని. "నేను మాత్రం ప్రయత్నించటం లేమటమ్మా !...మరి కుదరటంలేదు.... నేనేం చెయ్యను చెప్పు ఇంతకంటె !" అన్నాడు భారంగా. ఇంత సంతోషం వెనకా తన గుండెల్లో భారం మాత్రం అలాగేఉంది. ఇప్పుడిక బాగా మంచి మార్కులతో గ్రాడ్యుయేటయి పైచదువుకి వెళ్ళేవాడేనా అయితేనే గాని పిల్లనివ్వటానికి మనస్కరించటంలేదు తనకి. నిజమే మరి. అంత బాగా ఇంటర్మీడియేటు ప్యాసయిన జానకికి తను చేజేతులా ఏథర్డుక్లాసు బి.ఏ.నో తెచ్చికట్టబెట్టగలడా ?....

జానకికి తగిన సంబంధం కోసం తను వెదుకుతూనే ఉన్నాడు. నలుగురినీ అడుగుతున్నాడు. ఎక్కడ సంబంధం ఉందంటే అక్కడికి వెడుతున్నాడు.... ఇంతలో తిరిగి కాలేజీలు తెరిచారు. మళ్ళా మునుపటి సమస్యే వచ్చింది. ఊరికే ఇలా ఇంట్లో కూచోబెట్టుకునేబదులు బి. ఏ. చదివిస్తే !— ఊళ్ళోనే కాలేజీ గనక— ఎప్పుడు సంబంధం కుదిరితే అప్పుడే పెళ్ళి చెయ్యవచ్చు. అంతవరకూ ఇంట్లో ఊరికే కూచోబెడితే కలిసి వచ్చేదేమిటి ? పొరుగూరు పంపవలసివస్తే తను ఎలాగూ పంపడు. ఊళ్ళోనే చదువయినప్పుడేం అభ్యంతరం ఉంటుంది ? దీనికి ఇంట్లో అంతా వ్యతిరేకులే. అయినా ఊళ్ళో అంతా సుముఖులేకాకుండా బాగా ప్రోత్సహించేరుకూడా. జానకి కూడా చదువుకుంటానంది. వెంటనే జేర్పించాడు.

పిల్లని కాలేజీలో జేర్పించాడన్నమాటేగాని తను మాత్రం సంబంధాలకోసం వెదుకుతూనే ఉన్నాడు. ఎంత వెదికినా తనకూతురికి తగిన సంబంధం దొరకటంలేదు. పెద్ద చదువు చదివినవాళ్ళే ఎవరూ కనిపించటంలేదు. ఒకవేళ ఎవరేనా ఉన్నా వాళ్ళకి అంతకుముందే పెళ్ళయి ఉంటూంది. అవివాహితులైన విద్యావంతులు యోగ్యులైనవాళ్ళు ఎంతగా వాకబుచేసినా దొరకటంలేదు.

తను ఒకటి రెండు సంబంధాలు తెచ్చాడు. కాని అవి కుదరలేదు. ఒక సంబంధం విషయంలో కుర్రాడిప్రవర్తన మంచిది కాదని చూచాయిగా తెలిసింది. మరో సంబంధం విషయంలో కుర్రాడి తల్లి గడుగ్గాయనీ కోడళ్ళని యమయాతనలు పెడుతుందనీ విన్నాడు. అదీకాక ఆ యిద్దరు పెళ్ళికొడుకులకీ తగని భేషజం ఉండడంవల్ల జానకికూడా ఏవగించుకుంది వాళ్ళని.

ఇంతలో జానకి సీనియరు క్లాసులోకి వచ్చింది. చదువు కూడా వెనకటిలాగే సాగుతోంది. ఇంట్లో తల్లి, తండ్రి, భార్యల సాధింపు ఎక్కువగానే ఉంది. "పెళ్ళి చెయ్యకుండా దానికి ఈ చదువెందుకు ?" అని. వారినందరినీ అంతగా లెక్కచెయ్యకుండానే కాలక్షేపం చేద్దామంటే వీలా ? అందులోనూ వార్థక్యంవల్ల మంచంపట్టిన తండ్రి తనని పిలిచి "నాయనా ! దానికి మూడు ముళ్ళు పడడం చూసే యోగం నాకు లేదేమిట్రా !" అన్నాడు జాలిగా. ఆయన ఆదుర్దాకొద్దీ తనని అంటాడుగాని తన లోపం ఏముంది ? ప్రయత్నం చెయ్యటంలేదుగనకనా ? ఎంత ప్రయత్నించినా ఘటన లేనిదే ఎలా అవుతుంది ?— ఈమాటే తల్లిదగ్గర అంటే ! "ఆఖరికి ఈ వెర్రి వేదాంతంలోకి దిగింది కథ" అంటుంది. ఇంట్లో వాళ్ళ అందరికీ ఒకటే సాకు దొరికింది తనని సాధించటానికి— జానకి ఇంటర్మీడియట్ పరీక్షలముందు వచ్చిన సంబంధం

తను చెయ్యలేదని. మాటికి ముందు దానిని గురించే అంటారు. "చేతులారా ఆ సంబంధం వదిలావు" అని.

వాళ్ళెవరికీ ఆలోచనేలేదు. నిజానికి ఆ సంబంధం అవనందుకు విచారించక్కర్లేదు. పెళ్ళికాకముందే పిల్లని ఒక్కనెల ఆపమంటే కాదన్నవాళ్ళు తరువాత తరువాత పిల్లనసలు పుట్టింటికే పంపమనవచ్చును. అలాంటి పెంకి ఘటాలమధ్య జానకి సుఖంగా ఒక్కరోజు కాపరం చెయ్యగలదా? ఏదేనా ఆపద వచ్చి పిల్లని అనవసరంగా పంపమన్నా వాళ్ళు ఆమాట అనేవారుగా! తను ఇన్ని ఆలోచించి ఆ సంబంధం వదిలేస్తే వాళ్ళివేమీ ఆలోచించకుండా తననే తిడుతున్నారు. పోనీ ఇవన్నీ వాళ్ళకి నచ్చచెబుదామంటే మాట వినరుగా!.... వాళ్ళకి ఎంతతోస్తే అంత. ఇప్పుడు చెయ్యలేదని నలుగురూ నాలుగుమాటలు అంటున్నారుగాని, తను ఆ సంబంధమే చేసి ఉండి, వాళ్ళు పిల్లని అన్ని బాధలూ పెట్టి ఉంటే అప్పుడు ఈ తల్లి, ఈ తండ్రి, ఈ భార్య తనని దుయ్యబట్టుదురు అన్యాయంగా పిల్లగొంతుకు కోసినందుకు. ఇంతకీ.... తనలోతాను ఇలా కుమిలిపోవలసిందేగాని ఎవరున్నారు తను చెప్పుకునేందుకు? ఎవరు సానుభూతితో వింటారు?

ఇక ఏదో ఒక సంబంధం నిశ్చయం చెయ్యనిదే ఇంట్లో కునుకు పోగూడదనే కృత నిశ్చయంతో బయలుదేరి వెళ్ళాడు. నెలరోజులు విరామంలేకుండా తిరిగాడు. వేళ పట్టున భోజనం, నిద్ర లేకపోవడంచేత తన ఆరోగ్యం పాడయింది. అది గ్రహించినవెంటనే ఇంటికి జేరుకున్నాడు. మంచం పట్టాడు.

ఆ రుగ్మతనించి పూర్తిగా కోలుకోవటానికి రెండు మూడు నెలలు పట్టింది. ఈ లోగా జానకి బి. ఏ. పరీక్షలయినాయి. అనివార్యంగా జానకికి పెళ్ళి విషయం వాయిదా వెయ్యవలసివచ్చినందుకు చింతించినా, ఈ లోగా జానకి పటభద్రురాలయినందుకు చాల సంతోషించాడు.

జబ్బుపడిలేచినతరువాత తిరిగి సంబంధాలకై తిరగడం మొదలు పెట్టాడు. కాని ఈపని ఇప్పుడు మరీ కష్టంగా ఉంది. బి. ఏ దాకా చదివిన కూతురికి రాబోయే భర్త ఇంకాపైకి చదివిన వాడయితేనేగాని లాభంలేదు. అందుకోసమే ప్రయత్నం చెయ్యసాగాడు. ఆ ప్రయత్నంలోనే కామేశాన్ని గురించి తెలిసింది. అన్నీ బాగున్నాయని పిల్లనిస్తానని వెళ్ళాడు. అతను పల్లెటూరి పిల్లనిగాని చేసుకోననటంతో తన ఆశలన్నీ కూలిపోయాయి. ఇక తను జీవితంలో జానకికి పెళ్ళి చెయ్యగలడా అన్న సందేహం కలిగింది. రానురాను ఈ బెంగ ఎక్కువయింది. జానకిని చూసినప్పుడల్లా తనకి వెక్కివెక్కి ఏడవాలనిపిస్తుంది. కాని బేలతనంతో తనే అలా ఏడిస్తే కుర్రపిల్ల అదేం అఘాయిత్యం తలపెడుతుందోనని భయపడి ఆ బాధను దిగమ్రింగుకునేవాడు. తను ఇన్నాళ్ళుగా జానకికై ఖర్చుపెట్టిన సొమ్ము, ఆమె ఎంతో శ్రమపడి చదివి సంపాదించిన ఫస్టుక్లాసు డిగ్రీలు....ఇవన్నీ వృథా అయిపోయినై. ఇప్పటి పెళ్ళికొడుకు లింతచవటలేమిటి? రత్నంలాంటి పిల్లని—అందులోనూ పట్టభద్రురాలైనదాన్ని— ఇస్తామంటే 'వద్దు' అని జంకుతారు, అని తిట్టుకున్నాడు. జాలిపడ్డాడు. అంతలో అసహ్యంకూడా వేసింది వాళ్ళ తెలివితక్కువకి.

ఇంట్లోవాళ్ళ సొద మరీ ఎక్కువయింది. మేం అప్పుడు చెప్తేవిన్నావా? ఇవాళ అనుభవిస్తున్నావు. అవాళే పెళ్ళి చేస్తే ఎంతబాగుండును? అంటారు. ఆలోచించగా వాళ్ళు చెప్పేది నిజమేమో అనిపిస్తూంది. చిన్న పిల్లగా ఉన్నప్పుడయితే ఎవడికో ఒకడికిచ్చి పెళ్ళిచేసును. అటుపైన దాని అదృష్టమెలా ఉంటే అలాజరుగును ....ఎన్ని అనుకుని ఏంలాభం?....చేతులు కాలిపోయాయి ....ఎన్ని ఆకులు పట్టుకుంటే మాత్రం ఏముంది?....

ఇలా తనని తను సమాధాన పర్చుకున్నా లోపల దిగులుమాత్రం ఎక్కువగానే ఉంది—జానకిజీవితం ఎటూ గాకుండా పోతుందేమోనని ... ఇలా ఉండగా ఊళ్ళో హైస్కూలులో ఒక ఖాళీ వచ్చింది. జానకిని ఆ ఉద్యోగానికి రమ్మని పిలిచారు. "ప్రస్తుతానికి ఏదోఒకటి-చేరు" అన్నాడు తను. "నాయనా: ఆఖరికి ఉద్యోగాలు కూడా చేయిస్తున్నావు. అయినా మా మాటలు మీ కెందుకు పనికొస్తాయిరా!" అని తల్లి అక్కసును వెళ్ళబుచ్చుకుంది. "ఇంతకీ ఇది నాఖర్మం!" అని శ్రుతి కలిపింది భార్య.

జానకి ఉద్యోగంలో జేరింది. అది విన్న వారంతా సంతోషించారు జానకంత తెలివయిన పిల్ల ఆ స్కూల్లో మేష్టరయినందుకు. కాని సోమేశ్వరరావుగారి హృదయం మాత్రం బరువుగానే ఉంది. జానకి ఇంటికివచ్చి "ఇవాళ ఉద్యోగంలో జేరాను నాన్నా!" అని చెప్తే ఆయనరెండు కన్నీటి చుక్కలు రాల్చాడు అది సంతోషమో విచారమో తెలియదుగాని. లోకం దృష్టిలో ఆయన అదృష్టవంతుడు-జానకికి తండ్రి అయినందుకు. ఆయనకు మాత్రం ఒక్క-సమస్యాతీరకుండా అలాగే ప్రళయతాండవం చేస్తున్నాయి కళ్ళముందు.

"To train women workers and harness their services in the building up of the future of our Nation and Womanhood"

నవంబరు 1955

ఆది	సోమ	మంగళ	బుధ	గురు	శుక్ర	శని
		1	2	3	4	5
6	7	8	9	10	11	12
13	14	15	16	17	18	19
20	21	22	23	24	25	26
27	28	29	30		•	•

2. అట్లతద్దె. 12. నరకచతుర్దశి. 13. దీపావళి అమావాస్య. 18. నాగులచవితి. 29. కార్తీకపౌర్ణమి.

ANDHRA MAHILA SABHA

MYLAPORE : MADRAS 4.

Edited by Mrs. K. Lakshmi Raghu Ram, B. A.
Printed & Published by Mrs. A. C. Krishna Rao, M.A., L.T.,